RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 2 Monthly February 2024 ISSN No. : 2456-4702 Rs. : 15/-



## డా॥. కట్టమంచి రామలింగారెడ్డి

(డా॥. సి.ఆర్. రెడ్డి)

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)




# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

Mail : bhavaveena2024@gmail.com

Cell : 9949929674, 7989088274

# BHAVAVEENA

(MONTHLY MAGAZINE)

Journal - Arts, Literature, Cultureand Language Study

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **ఫిబ్రవరి – 2024** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/–** |
| కాపీలకు | : | **డి.నెం. 135–14–716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు – 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి.నెం. 135–14–716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు – 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509. |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)



***Founder :***

Kolla Sri Krishnarao (Late)

***E-mail :***

bhavaveena2024@gmail.com

7989781963

9949929674

7989088274

# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.



**Vol. 21 - Issue : 2 - February 2024 - ISSN No.: 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs.: 15/-**



**EDITORIAL BOARD**

*Honourable Editor*

**Dr. PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***

*Chief Editor*

**Dr. PAYARDA NAGAIAH**

***M.A.(Tel), M.A.(Pol-Sci.)., M.Ed., Ph.D.,***

# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P
2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Hyderabad Central University, Hyderabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   Associate Professor, Dept. of Telugu &
   Chairman, BOS Philothrophy& Religion Studies,
   Andhra University, Visakhapatnam.
7. **Prof. T. Ramaprasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
   Principal,
   St Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Prof. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Professor, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narsapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur- 2 . 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494 660 509.

# డా॥. కట్టమంచి రామలింగారెడ్డి

డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి, సి.ఆర్. రెడ్డిగా ప్రసిద్ధుడు. ప్రముఖ ప్రజ్ఞాశాలి, సాహితీవేత్త, విద్యావేత్త, పండితుడు, వక్త, రచయిత, హేతువాది, రాజనీతిజ్ఞుడు. డా॥. సి.ఆర్. రెడ్డి డిసెంబర్ 10, 1880 సంవత్సరంలో చిత్తూరు జిల్లా కట్టమంచి గ్రామంలో జన్మించారు. తండ్రి సుబ్రహ్మణ్యారెడ్డి, తల్లి నారాయణమ్మ దంపతులకు జన్మించారు. కట్టమంచి వారి ప్రాథమిక విద్యాభ్యాసం వీధి బడిలో పూర్తి అయింది. తరువాత 1890లో ప్రస్తుతం పి.సి.ఆర్ పేరుతో ఉన్న చిత్తూరు బోర్డు ఉన్నత పాఠశాలలో మొదటి ఫారంలో చేరి ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. తరువాత మద్రాసులో క్రైస్తవ కళాశాలలో 1902లో బి.ఏ ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకం పొందాడు. ప్రతిభకు ఫలితంగా వచ్చిన స్కాలర్‌షిప్‌తో ఇంగ్లాండ్ వెళ్ళి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ పరిధిలోని సెయింట్ జాన్స్ కళాశాలలో చేరి, 1906లో ఏం.ఏ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. డా॥. సి.ఆర్. రెడ్డి బాల్యం నుండి చాలా తెలివైన, చురుకైన విద్యార్థి. ఇంగ్లాండ్‌లోనే ఆయన మేథస్సు బహుముఖలుగా వికసించింది. అతని తెలివితేటలు, సామర్థ్యానికి గుర్తింపుగా 1903లో రైట్ బహుమతి లభించింది. 1904 “విధ్వాంసుడు” అనే పురస్కారం అందుకున్నారు. 1905లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో యూనియన్ లిబరల్ క్లబ్ కార్యదర్శిగా ఎన్నికై ఆంగ్లేయుల మన్ననలు, ప్రశంసలు పొందిన మొట్టమొదటి భారతీయుడిగా ప్రసిద్ధికెక్కాడు సి.ఆర్.రెడ్డి.

డా॥. సి.ఆర్.రెడ్డి ఇంగ్లాండ్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న తర్వాత ఆయన అమెరికా వెళ్ళి వివిధ విశ్వవిద్యాలయాల పనితీరును పరిశీలించి 1908లో స్వదేశానికి తిరిగివచ్చి తన 28వ యేట బరోడా కళాశాలలో ఆచార్యునిగా తన ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. ఆ తరువాత మైసూరు మహారాజా కళాశాలలో ఆచార్య పదవి స్వీకరించాడు. అక్కడ ఆచార్యునిగా, ప్రిన్సిపాల్‌గా విశ్వవిద్యాలయ రూపకర్తగా, విద్యాశాఖాధికారిగా పలు బాధ్యతలు ఎంతో విజయవంతంగా నిర్వహించారు.

డా॥. సి.ఆర్. రెడ్డికి చిన్నతనం నుండి తెలుగు భాష, తెలుగు సాహిత్యం పట్ల ప్రత్యేక ఆసక్తిని కనపరిచేవారు. చిన్న వయస్సులోనే భారతం, బాల రామాయణం క్రమం తప్పకుండా చదివేవారు. తన 19వ యేటనే “ముసలమ్మ మరణము” అను లఘు కావ్యాన్ని రచించారు. కట్టమంచి వారు సాహిత్యరంగంలో వినూత్నమైన భావాలు, ఆలోచన కొత్త రచనా వ్యాసంగానికి పూనుకున్నారు. అనగా వారి నూతన ఆలోచనా రీతులకు మనోవికాసాత్మకమైన విమర్శలకు ఆయనకు దోహదపడ్డాయి. ఒకవైపు తెలుగు కవితను మరోవైపు కవితా విమర్శను నూతన శోభతో కొత్తకాంతులతోఓ ఆవిష్కరించిన సాహితీమూర్తి. ఆయన రచనలలో హాస్యం, ఛలోక్తులు, సంభాషణా నైపుణ్యం ఎంతో ప్రత్యేకమైనవి ఎందరో సాహితీవేత్తల మన్ననలనున పొందినవి. కట్టమంచి వారి కొన్ని ముఖ్య రచనలు ముసలమ్మ మరణము (1899), కవిత్వతత్త్వ విచారము, ఆంధ్రసర్వ కళాశాల విద్యార్థి,

లఘు పీఠికా సముచ్ఛయం, వ్యాసమంజరి, పంచమి, వేమన, డా॥. సి.ఆర్.రెడ్డి పీఠికలు, సరస్వతీ సామ్రాజ్యము, ముత్యాల సరములు, దేవీ భాగవతము, ప్రహసనములు, ప్రతాపరుద్రీయము మొదలగు కొన్ని ముఖ్యమైన కొన్ని తెలుగు రచనలు వాటితోపాటు ఆంగ్లంలో **Drama in the East and West, Speeches on University Refor, Democracy in Contemporary India cogress in Ofiice, Education Industry & Commerce** మొదలగునవి. బహుళ ప్రాచుర్యం పొందిన రచనలు.

డా॥. సి.ఆర్. రెడ్డి 1921 సంవత్సరం తరువాత రాజకీయాల్లో ప్రవేశించారు. 1922 లో మొట్టమొదటి సారిగా ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టారు. 1921-25 మధ్యకాలంలో మద్రాసు కౌన్సిల్ సభ్యుడు యునైటెడ్ నేషనలిస్టు పార్టీ డిప్యూటీ లీడర్గా వ్యవహరించారు. 1935 లో కాంగ్రెసు పార్టీ తరపున మద్రాసు కౌన్సిల్కి మరోకసారి ఎన్నికయ్యారు. 1936లో చిత్తూరు జిల్లా బోర్డు ఛైర్మన్గా పనిచేశారు. రాజకీయ నాయకుడిగా ఎన్నో రాజకీయ చతురతలు ప్రదర్శించి అంచలంచెలుగా ఉన్నతస్థాయికి ఎదిగారు డా॥. సి.ఆర్. రెడ్డి.

ఆంధ్రులకు ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయం ఉండాలని శాసనసభలో గట్టిగా తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచి చివరకు శాసన సభ్యత్వానికి రాజీనామా చేసిన గొప్ప త్యాగశీలి. చివరకు తను అనుకున్నది సాధించారు. 1926లో ఆంధ్ర విశ్వవిద్యాలయ వ్యవస్థాపక ఉపకులపతిగా నియమించబడ్డారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.

కట్టమంచి వారు ఆచార్యుడిగా, వైస్ ప్రిన్సిపాల్గా విద్యాశాఖాధికారిగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా, మంచి కవిగా, కవితా విమర్శకుడిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన కట్టమంచి వారు ఫిబ్రవరి 24, 1951న మరణించారు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | జైనం బౌద్ధం - అనుసరణీయ దర్శనం | - ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్ | 8 |
| 2. | హేతువాద ఉద్యమశీలి - త్రిపురనేని | - ఆచార్య ఎం.రామనాథం నాయుడు | 12 |
| 3. | భారతీయ సంస్కృతి - స్త్రీ స్థానం | - డా॥. పి. శ్రీనివాసరావు | 19 |
| 4. | తెలుగు - లంబాడాల పొడుపు కథలు - ఒక పరిశీలన | - డా॥. లక్ష్మణ్ నాయక్ భానోత్ | 22 |
| 5. | లంబాడీల పండుగలు - సామాజిక సంస్కృతి | - డా॥. బి. వీరన్న | 27 |
| 6. | గిరిజన స్ఫూర్తిప్రదాతలు - సమ్మక్క, సారక్క | - డా॥. బి. భీమమ్మ | 33 |
| 7. | జానపద సాహిత్యంలో పొడుపు కథలు - విశిష్టత | - కె. అమృతజ్యోత్స్న | 36 |
| 8. | డబ్బు తయారు చేస్తున్న కొత్త సమాజం చిత్రీకరణే 'బ్రిడ్జికింద' | - డా॥. పొదిలి నాగరాజు | 41 |
| 9. | రంగాచార్య సంప్రదాయ రచనల్లో అభ్యుదయ దృక్పథం | - డా॥. కే.డి.డి. మృణాళిని | 47 |
| 10. | జి. మేరీకృపాబాయి కథానీరాజనం - సామాజికత | - యలమర్తి సునీత & - డా॥. కె . బలరాం | 52 |
| 11. | స్త్రీవాద, బాల కార్మికుల కథలు - సామాజికత | - రెబ్బ మల్లిఖార్జున్ | 57 |
| 12. | పోతన భాగవత కథల్లో సమసమాజ నిర్మాణము - భక్తితత్వం | - అంబటి సరిత | 64 |
| 13. | Konda Chiluva : Python | - Dr. M. Koteswar Rao | 69 |

# జైనం బౌద్ధం - అనుసరణీయ దర్శనం

– ఆచార్య డి. వి. శ్రవణ్‌కుమార్, ప్రొఫెసర్-కం-డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

మానవునిలో అంతర్గతంగా ఉండే హేతువు నుండే మతం ఉద్భవించింది. భూమిపై మానవుడి సుఖ జీవనానికి ఉద్దేశించిన సృష్టే మతం. కాలక్రమంలో అన్ని వ్యవస్థలకు పట్టిన చీడ మతానికి కూడా సోకింది. మతం ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని పీడించే స్వార్థపరుల సొత్తయ్యింది. ప్రజా జీవితాన్ని సుగమం, సుఖమయం చేయవలసిన సాధనమే పీడించి అణగదొక్కే పాశవిక ఆయుధంగా రూపాంతరం చెందింది. అటువంటి పరిస్థితులు తలెత్తినప్పుడల్లా ప్రపంచంలో జోరాస్టరు, గౌతమ బుద్ధుడు, జీసస్ క్రీస్తు, మహమ్మద్, శంకరా చార్యులు వంటి ప్రవక్తలు పుట్టుకొచ్చి తమదైన పంథాలో మార్గనిర్దేశకులయ్యారు. ఒక ఉద్దాత్తమైన జీవన విధానాన్ని రూపొందించి మతాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేశారు.

క్రీ.పూ.6వ శతాబ్దిలో నాగరికతను చవిచూసిన అనేక ప్రపంచ దేశాలు మత కల్లోలాలకు గురైనాయి. ఈ కాలంలోనే అనేక మంది మత సంస్కర్తలు బయలుదేరి అంత వరకు ఉన్న మూఢ విశ్వాసాలపై, మతాచారాలపై ధ్వజమెత్తారు. చైనాలో కన్ఫూసియస్, పర్షియాలో జోరాష్టరు వంటి వారు ఆయా మతాల్లోని లోపాల్ని ఎత్తి చూపి తమ సిద్ధాంతాల్ని ప్రబోధించారు. సరిగ్గా ఈ సమయంలోనే భారతదేశంలో జైన, బౌద్ధ మతాలు ఆవిర్భవించాయి. ఈ మతాల ఆవిర్భావానికి అంత వరకు ఉన్న ఛాందస మత విశ్వాసాలే కారణమైనాయి. వైదిక మతం యజ్ఞ యాగాది క్రతువుల రూపంలో సామాన్యులకే కాకుండా ఉన్న వారికి సైతం ఒక గుదిబండగా తయారైంది. మతం పేరిట జరుగుతున్న జంతుబలులు ప్రజల మానసిక ప్రవర్తనలో పరివర్తన తెచ్చింది. ఈ పరివర్తనే అహింసాతత్త్వానికి పునాది వేసింది. జైన, బౌద్ధ మతాల పుట్టుకకు దారి తీసింది.

## జైన మతం :

జైనమతం ఎప్పుడు ఎలా ఉద్భవించిందో తెలీదు కానీ తీర్థంకరులనబడే 24 మంది జైనమతాచార్యులు జైనమత ఆవిర్భావ వికాసాలకు మూలకారకులని మాత్రం తెలుస్తుంది. జైనతీర్థంకరుల్లో మొదటివాడు ఋషభ దేవుడు. ఇతడి ప్రశంస ఋగ్వేదంలోను, భాగవత పురాణంలోనూ ఉండడం వల్ల జైనమతం కూడా వైదిక మతం లాగే ప్రాచీనమైందని అర్థమవుతుంది. 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడే నిజమైన జైనమత నిర్మాతగా భావిస్తారు. ఈ పార్శ్వనాథుడు వైశాలి (బీహార్)ని పాలించిన రాజవంశీయుడు. ఈయన అహింసా, సత్యం, ఆస్తేయం, అపరిగ్రహం అనే నాలుగు పవిత్ర వ్రతాల్ని పాటించాలని తన అనుచరులకు నిర్దేశించాడు.

24వ తీర్థంకరుడైన మహావీరుడి అసలు పేరు వర్ధమానుడు. ఈయన క్రీస్తుపూర్వం 599వ సంవత్సరంలో జన్మించాడు. త్రిశాల సిద్ధార్థుడు వర్ధమానుడి తలి దండ్రులు. ఈ వర్ధమానుడు 72 సంవత్సరాలు జీవించి క్రీస్తుపూర్వం 527లో దక్షిణ బీహార్‌లోని పావాలో మరణిం చారు. వర్ధమానున్నే మహావీరుడని, జినుడని నిగ్గంధుడని కూడా పిలుస్తారు. వర్ధమానుడు యశోద అనే రాకుమారిని వివాహమాడి ఒక కుమార్తెను కూడా పొందాడు. తల్లిదండ్రుల మరణం తరువాత తన 30వ ఏట గృహ జీవితానికి స్వస్తిచెప్పి ప్రాపంచిక సత్యాన్ని తెలుసుకోవాలనే తపనతో తూర్పు భారతదేశమంతటా పర్యటించారు. దాదాపు 13 సంవత్సరాలు నిరంతర సత్యాన్వేషణను సాగించిన తరువాత తన 43వ ఏట కేవల జ్ఞానాన్ని పొందాడు. ఈ జ్ఞానాన్ని పొందిన తరువాతే వర్ధమానుడు మహావీరుడుగాను, జినుడుగాను ప్రసిద్ధి చెందాడు. మహావీరుడు జైనమత ప్రచారకుడే కానీ నిర్మాత కాదు. తీర్థంకరుల్లో చివరి వాడిగా గొప్ప పేరును

సంపాదించాడు. జైనమతంలో ఇది వరకు ఉన్న అహింసా, సత్యం, ఆస్తేయం, అపరిగ్రహం అనే నాలుగు జినవ్రతాలకు ఐదవదిగా బ్రహ్మచర్యాన్ని చేర్చారు. మహావీరుడు భగవంతుని ఉనికిని విశ్వసించలేదు. వేద ప్రమాణాల్ని, బ్రాహ్మణాధిక్యతను నిరసించాడు. తన భవిష్యత్తుని తీర్చిదిద్దుకునే శక్తి మానవుడికే ఉందని ప్రవచించాడు. ఆత్మజ్ఞాన సంపాదన కోసం భౌతిక విషయ వాంఛలతో పాటు ధరించే దుస్తుల్ని కూడా త్యజించ మన్నాడు. జన్మరాహిత్యాన్ని పొందడానికి మూడు ముఖ్యమైన కర్మల్ని ఆచరించమన్నాడు. ఒకటి జినుడి పట్ల పవిత్ర విశ్వాసం, రెండు జినసంబంధమైన జ్ఞాన సంపాదనం, మూడు సద్వర్తనం వీటిని త్రిరత్నాలు అని కూడా వ్యవహరిస్తారు.

జైన మతానికి మూలాధారం అహింసా సూత్రం. ప్రాణంగా ఏ జీవిని కూడా మానసికంగా కానీ, శారీరకంగా గానీ హింసించకూడదని మహావీరుడు బోధించాడు. జినులు ఆమరణ నిరాహారదీక్షను పవిత్రకార్యంగా భావిస్తారు. మహావీరుడు జైనమత పీఠాన్ని స్థాపించారు. తనకు సన్నిహిత శిష్యుల్ని మతాచార్యులుగా నియ మించారు. వీరిని గాంధారులని పిలుస్తారు. క్రీస్తుపూర్వం 4వ శతాబ్దం చివరల్లో జైనమతంలో చీలికలు వచ్చాయి. శ్వేతాంబరులు, దిగంబరులు అని రెండు శాఖలుగా చీలిపోయారు. 'పూర్వాలు' అనే 14 ప్రాచీన జైనమత గ్రంథాలే మహావీరుడి బోధనలకు అద్దంపడతాయని శ్వేతాంబరుల నమ్మకం. బౌద్ధం లాగా జైన మతం ఖండాంతరాల్లో వ్యాపించలేదు. భారతదేశంలో కూడా బౌద్ధమతం పొందినంత ఆదరణ జైనమతం పొందలేక పోయింది. చంద్రగుప్త మౌర్యుడు, కళింగ రాజైన ఖారవేలుడు జైనమత వ్యాప్తికి కృషి చేశారు. అశోకుడి మనుమడైన సంప్రాతి జైన మతాన్ని స్వీకరించడమే కాక మతబోధకుల్ని పంపి దక్షిణ భారతదేశమంతా ప్రచారం చేయించాడు. ఈ క్రమంలోనే ఆంధ్రదేశంలో కూడా జైనమత ప్రచారం జరిగింది. గుప్తుల కాలంలో హిందూ మతానికి తిరిగి పెద్దపీట వేయడంతో జైనమతం క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతూ వచ్చింది.

**బౌద్ధమతం :**

ప్రపంచంలో అతిప్రాచీనం, ఉదాత్తమైన మతాల్లో బౌద్ధం ఒకటి. ప్రగతి దిశలో సంఘాన్ని నడిపించే తాత్విక చింతన బౌద్ధం. నిజానికి బౌద్ధం ఒక మతం కాదు.. ఒక జీవిత దర్శనం. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో జన్మించిన గౌతమ బుద్ధుడే బౌద్ధమత ప్రవక్త. అప్పటికే భారతదేశ ప్రజా జీవితం అస్తవ్యస్తంగా ఉంది. నైతికంగా, సామాజికంగా పతనావస్థలో ఉంది. జాతి వైషమ్యాలు, సామాజిక అసమానతలు సంఘాన్ని పట్టి పీడిస్తున్నాయి. రాజకీయంగానూ, ఆర్థికంగాను సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. మతం బలిపీఠం అయ్యింది. మూఢ విశ్వాసాలకు భయంకరమైన ఊహలకు ఆటపట్టైంది. క్రీస్తుపూర్వం 566వ సంవత్సరం నేపాల్ పర్వత సానువుల్లో నెలకొన్న కపిల వస్తువు నగరానికి సమీపాన ఉండే లుంబినీవనంలో గౌతముడు జన్మించాడు. కపిల వస్తువు నగర రాజైన శుద్ధోధనుడు గౌతముడి తండ్రి. తల్లి మాయాదేవి. గౌతముడు పుట్టిన ఏడు రోజులకే తల్లి మాయాదేవి మరణించడంతో ఆమె చెల్లెలైన గౌతమి ప్రజాపతి గౌతముడ్ని పెంచి పెద్ద చేసింది. గౌతమ అన్నది కుటుంబ నామం. గౌతముడి అసలుపేరు సిద్ధార్థుడు. సిద్ధార్థుడికి యశోదతో వివాహం జరిపించారు. కొన్నాళ్ళకు వీరికి కుమారుడు జన్మించాడు. అయినా సిద్ధార్థుడికి సంసార జీవితంపై విరక్తి పెరిగిందే కానీ తగ్గలేదు. మానవ జీవితంలో సంభవించే కష్టాలు, రోగాలు, మృత్యు భయం వంటివి చూసి సిద్ధార్థుడు కలత చెందాడు. వీటి నుండి మానవుడి విముక్తి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించు కున్నాడు. సత్యాన్వేషణకు గృహస్థ జీవితాన్ని వదిలేసి తన 29వ ఏట సన్యాస జీవితంలోకి ప్రవేశించాడు. ఈ సంఘటనలన్నీ బౌద్ధులు 'మహాభినిష్క్రమణం' అంటారు. దాదాపు ఆరు సంవత్సరాల కఠోర దీక్షల్ని అవలంబించాడు. సత్యాన్వేషణకై రాజగృహమైన గయ సమీపంలో ఉన్న

హృవేల ప్రాంతాల్లో సందర్శించాడు. తన ప్రశ్నలకు సమాధానం దొరక్కపోవడంతో విసుగెత్తి తపోదీక్షల్ని విరమించాడు. బోధగయ ప్రాంతానికి చేరుకుని అక్కడ ఒక రావి చెట్టు కింద కూర్చొని ధ్యాన నిమగ్నుడయ్యాడు. ఆ ధ్యానంలో సిద్ధార్థుడికి సత్యం గోచరించింది. జ్ఞానోదయం కలిగింది. బోధివృక్షం కింద జ్ఞానం పొందిన సిద్ధార్థుడు బుద్ధుడు అయ్యాడు. తాను తెలుసుకున్న సత్యాన్ని ధర్మబోధ చేయాలని కాశీ సమీపంలోని సారానాథ్ చేరుకుని అక్కడున్న హరిణవనంలో మొదటి ధర్మోపన్యాసం ఇచ్చారు. ఈ సంఘటననే బౌద్ధ వాఙ్మయంలో 'ధర్మప్రవచన' అని అంటారు. ఆ తరువాత ఐదు సంవత్సరాల పాటు బీహారు దాని పరిసర ప్రాంతాల్లో నిర్విరామంగా తిరిగి తన బోధనలతో అందర్నీ చైతన్యపరిచారు.

## బుద్ధుడి బోధనలు :

బుద్ధుడు తన శిష్యులకు పవిత్రమైన నాలుగు సత్యాల్ని బోధించాడు. వీటినే 'ఆర్య సత్యాలు' అని వ్యవహరిస్తారు. మొదటిది మానవ జీవితం దు:ఖమయ మైంది. రెండవది ఆ దు:ఖానికి కారణం ఉంది. ఈ దు:ఖ కారణాన్ని నశింపజేసి శాశ్వత సుఖాన్ని పొందవచ్చనేది మూడవ సత్యం. ఇక నాలుగవది ఈ దు:ఖ కారణాన్ని నశింపజేయడానికి ప్రతి ఒక్కరూ అష్టాంగ మార్గాన్ని అనుసరించాలని బోధించాడు.

### అష్టాంగ మార్గం :

1. పవిత్ర భావం, 2. పవిత్రమైన కోరిక 3. పవిత్రమైన వాక్కు 4. పవిత్రమైన నడవడిక 5. పవిత్ర జీవనం 6. పవిత్రమైన ప్రయత్నం 7.పవిత్రమైన బుద్ధి 8. పవిత్రమైన ధ్యానం ఇవి పాటిస్తే జీవితం సుఖమయ మవుతుందని బుద్ధుడి విశ్వాసం. ఈ అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా నిర్వాణం (మోక్షం) పొందవచ్చు. నిర్వాణం అంటే మరుజన్మ కావాలనే కోరిక లేకపోవడం. అంటే జన్మరాహిత్యాన్ని పొందడం. బుద్ధుడు చెప్పిన అహింసాతత్త్వం కేవలం హింసను అరికట్టడం వరకే పరిమితం కాదు. జీవుల హృదయాన్ని పెనవేసే ప్రేమతత్త్వమే అహింసా సూత్రానికి మూలాధారం.

## బౌద్ధ వాఙ్మయం - త్రిపీఠకాలు:

బుద్ధుడు జీవిత కాలంలో ఆయన బోధనలు గ్రంథస్తం చేయలేదు. ఆయన మరణానంతరం బుద్ధుడి శిష్యులు రాజగృహంలో సమావేశమై బుద్ధుడి సూక్తుల్ని, బోధనల్ని 'సుత్త', 'వినయ' అనే భాగాలుగా క్రోడీకరించారు. మూడవ పీఠకమైన 'అభిదమ్మ' భాగాన్ని మాత్రం అశోకుడి కాలంలో పాటలీపుత్రంలో జరిగిన బౌద్ధసంఘ సమావేశం క్రోడీకరించింది. మొదటి భాగమైన సుత్తలో బుద్ధుడి సూక్తులు, మత బోధనలు చోటుచేసుకున్నాయి. రెండవ భాగమైన వినయ బౌద్ధారామాల్లో పాటించాల్సిన క్రమశిక్షణ నియమాల్ని గురించి వివరిస్తోంది. మూడవదైన అభిదమ్మ వివిధ వేదాంతపరమైన చర్చల్ని గురించి బౌద్ధమత తత్త్వాన్ని గురించి చెప్తుంది. ఈ మూడు భాగాల్ని కలిపి 'త్రిపీఠకాలు' అని అంటారు. పీఠిక అన్నది పాళీ భాషా పదం. త్రిపీఠకాల రచన మొత్తం పాళీ భాషలో జరిగింది.

కాలక్రమంలో బౌద్ధమతం మహాయానం, హీనయానం అనే రెండు శాఖలుగా చీలిపోయింది. హీనయాన బౌద్ధమే బుద్ధుడి బోధనలకు ప్రతీకలుగా నిలిచిందని అంటారు. వాయువ్య భారతదేశంలోని హిందువులు, విదేశీయులు బౌద్ధం వైపు ఆకర్షితులయ్యారు. వీరు బౌద్ధమతాన్ని స్వీకరించడంతో ఆ మతం యొక్క రూపురేఖలు మారి పోయాయి. బౌద్ధం తన మౌలిక స్వభావాన్ని కోల్పోయింది. హిందూ మతంలోని అనేక లక్షణాలు బౌద్ధ మతంలోకి ప్రవేశించాయి. హిందువుల అవతారతత్త్వాన్ని మహాయాన బౌద్ధులు స్వీకరించారు. బుద్ధుడు విష్ణువు యొక్క దశావతారమూర్తుల్లో ఒకరుగా మారిపోయారు. దీంతో మహాయానానికి, పౌరాణిక హిందూ మతానికి తేడా లేకుండాపోయింది. మొదట్లో నేపాల్, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైన బౌద్ధమతం అశోకుడి కాలంలో దేశవ్యాప్తంగా ప్రచారం కావడమే కాకుండా విదేశాల్లో

సైతం తన ప్రభావాన్ని చూపింది. గుప్తుల కాలంలో హిందూ మతానికి విశేష ఆదరణ లభించడం వలన బౌద్ధమతం తన పుట్టిన దేశం నుంచి కనుమరుగవుతూ ఖండాంతరాల్లో స్థిరపడిపోయింది. నేటికీ ప్రపంచ జనాభాలోని మూడవ వంతు ప్రజలు బౌద్ధమతానికి చెందిన వారుగా చెప్పుకుంటారు. కాలక్రమంలో అన్ని గొప్ప మతాలకు పట్టినగతే బౌద్ధమతంకు పట్టింది. కాలక్రమంలో బుద్ధుడి ఉపదేశాలకు వక్రభాష్యాలు వెలిశాయి. బుద్ధుడి మౌలిక ఉపదేశాలకు బౌద్ధులు, బౌద్ధులు కాని వారు కూడా అన్యాయం చేశారు. కొందరు దురాశాపరులైన పూజారులు, నీతిబాహ్యులైన రాజులు, రాజకీయవేత్తలు ఇందులో పాత్రధారులయ్యారు.

బుద్ధుడు హేతువాది. కార్యానికి కారణం వుంటుంది.. చర్యకు ప్రతిచర్య వుంటుంది. ఋజువర్తనతో మంచి కార్యాలను ఆచరించడం ద్వారా మానవుడు జీవన స్థాయిని పెంచుకోగలరు. లక్ష్యాన్ని చేరగలరు, బాధల నుండి విముక్తుడు కాగలడు అని బుద్ధుడి నమ్మకం. బుద్ధుడు ఎంత యదార్థవాదో అంత ఆశావాది. మానవుడి భవిష్యత్తుపై ఆయనకు ఎంతో నమ్మకం. మానవుడి ఋజువర్తనపై ఆయనకు అచంచల విశ్వాసం. ఎటువంటి దళారులు, పూజారులు అవసరం లేకుండా తన నిర్వాణాన్ని మానవుడు సాధించుకోగలడని బుద్ధుడు చెప్పాడు. అందుకు మానవుడు తన అజ్ఞానాన్ని జయించడమే పరిష్కార మార్గంగా భావించాడు. అంతేగాక గౌతమ బుద్ధుడు ఆచరణబద్ధుడైన దార్శనికుడు. మానవాళి తక్షణ అవసరాలపై దృష్టికేంద్రీకరించాడు. తన దర్శనంలో తర్కవితర్కాలకు, వితండవాదనకు తావివ్వ లేదు. అందుకే బౌద్ధాన్ని 'నీతిశాస్త్రం, తర్కశాస్త్రం, మనోవిజ్ఞానాల సమన్వయ ఫలితంగా ఆవిర్భవించిన దర్శనము' అని డా.సర్వేపల్లి రాధాక్రిష్ణన్ పేర్కొన్నారు. బుద్ధుడి జీవితం, ఆయన జీవితంలోని విశిష్ట సంఘటనలు అందరికీ తెలిసినవే. వాటిని ఆచరిస్తేనే, అనుసరిస్తేనే మనిషి జీవితం సార్థకమవుతుంది. ముఖ్యంగా ఆయన మహాభినిష్క్రమణను అర్థం చేసుకుంటే అది ఐహిక సుఖాలను త్యజించడమే కాదు.. పదవీ త్యాగం కూడా. తనకు హక్కుగా లభించిన రాజ్యాన్ని, రాజ్యాధికారాన్ని వదిలివేసుకుని బుద్ధుడు వెళ్ళిపోయాడు. మానవసేవకై సింహాసనాన్ని సైతం త్యజించాడు. ఇది నేటి రాజకీయ నాయకులందరూ తెలుసుకోవాల్సిన అంశం. ప్రజా సేవ చేయడానికై అధికారాన్నే ఆశిస్తున్నారు. అధికార హస్తగతం కోసం అన్ని దారులు తొక్కుతున్నారు. జ్ఞాని అయిన సిద్ధార్థుడికి అధికార పరిధులు బాగా తెలుసు. అందుకే సింహాసనాన్ని ఆయన త్యజించాడు. నిజంగా ప్రజాసేవ తప్పరతే ఆశయంగా ఉన్న వారు బుద్ధుడి జీవితం నుండి పాఠాలు నేర్చుకోవడం చాలా అవసరం.

**ఆధార గ్రంథాలు :**

1. బుద్ధుడు - బౌద్ధ దమ్మము - డా॥. బి.ఆర్. అంబేడ్కర్.
2. Jainism.. Augustin Paniker.
3. The Jainism.. Paul Dunds.

❖❖❖

# హేతువాద ఉద్యమశీలి - త్రిపురనేని

- ఆచార్య ఎం. రామనాథం నాయుడు, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు.

ఆంధ్ర దేశంలో అనేక ఉద్యమాలు తలెత్తాయి. ఆంధ్రజాతి చైతన్యానికి దోహదం చేశాయి. ఆంధ్రుల ఆలోచనకు పదునుపెట్టాయి. మెరుగులు దిద్దాయి. అలాంటి ఉద్యమాల్లో పేర్కోదగిన ఉ ద్యమం హేతువాద ఉద్యమం.

హేతువాద ఉద్యమం అనగానే మదిలో మెదిలే మహావ్యక్తి త్రిపురనేని రామస్వామి చౌదరి. రామస్వామి చౌదరి కృష్ణాజిల్లాలో పుట్టి గుంటూరు జిల్లాలో స్థిర పడినప్పటికి ఆయన ఉద్యమం మాత్రం ఆంధ్రదేశ మంతటా వ్యాపించి అట్టుడికించింది. చౌదరి పుట్టి పెరిగిన వాతావరణం, ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితులు, అతని ఆలోచనల్లో మార్పు తెచ్చాయి. దృక్పథంలో నవ్యతను చొప్పించాయి. హేతువాదిగా మార్చాయి. బానిసత్వ తిరస్కరణ, ఆత్మగౌరవ పరిరక్షణ అతనిలోని మేధావిని నిదుర లేపాయి. జాతి జాగృతికి దోహదం చేసేట్టు చేశాయి.

త్రిపురనేని రామస్వామి చౌదరి కవి. కవిరాజు బిరుదాంకితుడు. గొప్ప ఉపన్యాసకుడు. అభ్యుదయ వాది. హేతువాది. మానవతావాది. ధర్మచింతన కలవాడు. నాస్తికుడైనప్పటికీ తన వాదనాపటిమతో ఆస్తికుల నుంచి కూడా మెప్పులందుకున్నవాడు. కుల, మత, వర్గ రహిత సమాజం కోరుకున్నవాడు.

చౌదరి ఆంధ్రదేశంలోనేకాక ఆంగ్ల దేశానికి కూడా వెళ్ళి విద్యనభ్యసించి వచ్చాడు. తన ఆహార విహారాల్లో కాని, వేషభాషల్లో కాని ఎటువంటి మార్పు రానీయకుండా విదేశాల్లో గడిపివచ్చాడు. తన రచనల ద్వారా, ఉప న్యాసాల ద్వారా, ప్రతిపాదించిన సిద్ధాంతాల ద్వారా ప్రజల మన్ననలను చూరగొన్నాడు. ఎన్నో సన్మానాలు పొందాడు. బిరుదులు అందుకున్నాడు. త్రిపురనేని రామస్వామి జీవితము, వ్యక్తిత్వము, ఆయనకాలం వారికేగాక తరువాతి వారికి కూడా ఆదర్శమంటే అతిశయోక్తి కాదు. ఈయన జీవిత విశేషాలను తెలుసుకోవడం ఎంతో ఆసక్తికరం.

### త్రిపురనేనివారు :

ఆంధ్రదేశంలో త్రిపురనేనివారు పేరు ప్రతిష్ఠలు పొందినవారు. ఈ వంశంలో జన్మించిన కొందరు పండిత ప్రకాండులుగా, కవులుగా, గాయకులుగా, గణిత శాస్త్రజ్ఞులుగా, పౌరాణికులుగా, న్యాయవాదులుగా, వైద్యశాస్త్ర నిపుణులుగా గణుతికెక్కారు. ఈ వంశానికి మూల పురుషుడు కాకతీయ త్రిపుర నాయకుడు. అతని పేరు శంభుడు. ఆయన ప్రతాపరుద్రుని కొలువులోని ముఖ్య సేనాపతులలో ఒకడు. ఈయన వంశానికి చెందినవారే త్రిపురనేనివారు. ఈ వంశానికి వన్నె తెచ్చిన ఘనుడు త్రిపురనేని గోపాలయ్య. ఈయనిది అంగలూరు. ఈ గోపాలయ్యకు నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు జన్మించారు. మూడవ కొడుకు చలమయ్య. చలమయ్య ధర్మాత్ముడుగా మంచిపేరు తెచ్చుకున్నాడు. చలమయ్య భార్యపేరు రామయాంబ. ఈ దంపతులకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. వీరి మొదటి కుమారుడు గోపాలకృష్ణయ్య. ఈయన కమనీయంగా కవిత్వమల్లేవాడు. రామశతకం, మానస బోధ శతకం, సంయుక్త ప్రభాకరం, వ్రతకల్పం, కర్ణామృతం అనేవి ఈయన రచనలు. అప్పటి ఆంగ్లేయ చక్రవర్తి ఎనిమిదవ ఎడ్వర్డు మద్రాసు వచ్చి ఆంధ్ర కవులను సత్కరించాడు. ఆ సందర్భంలో గోపాల కృష్ణయ్యను కూడా ఆంధ్రసాహితీరత్న బిరుదుతో, స్వర్ణ కంకణంతో సత్కరించాడు. రెండవవాడు నరసయ్య. ఈయన గురుకులవాసం చేసి సంస్కృతాంధ్ర భాషలలో అద్వితీయమైన పాండిత్యం గడించాడు. శివశతకం, దీన చింతామణి ఈయన రచనలు. మూడవవాడు శ్రీరాములు.

ఇతను సాధు సజ్జన సంఘ సాంగత్య శీలుడు. నాల్గవ కుమారుడు సుబ్రహ్మణ్యం. ఈయన శాలివాహన విజయం అనే నాటకం యివశాడు. కడగొట్టు బిడ్డ రామస్వామి. కుమార్తె సీతారత్నం - విదుషీమణి. ఈవిధంగా రామస్వామి గారి వంశం సంగీత, సాహిత్యాల లోనూ, శాస్త్ర వ్యవహారాలలోనూ గణుతికెక్కింది.

**జననం - బాల్యం - విద్యాభ్యాసం :**

త్రిపురనేని రామస్వామి చౌదరి చలమయ్య, రామ మాంబలకు ఐదవ కుమారుడుగా 1887వ సంవత్సరం, జనవరి 15న జన్మించాడు. రామస్వామికి అంగలూరు వీధి బడిలో 1895 జూలై 15వ తేదీన అక్షరాభ్యాసం జరిగింది. ఆ వీధిబడిని మంగయ్య పంతులు నిర్వహిస్తూ ఉండేవాడు. చిన్నతనం నుండి రామస్వామి కొంటెతనానికి, కోనంగితనానికి ప్రసిద్ధి. ఇప్పటికీ ఆ విషయాలను కథలుగా చెప్పుకుంటారు. ఈయన బాల్యం అంగలూరు, గుడివాడల్లో గడిచింది. రామస్వామి 1905 సం॥లో బందరు హిందూ హైస్కూల్లో నాలుగో ఫారంలో చేరాడు. చదువుమీద ఎంత ఆటలమీద అంతే ఆసక్తిని కనబరచేవాడు. ఫుట్బాల్ ఆడడంలో నిపుణుడు. శ్రద్ధ చూపేవాడు.

రామస్వామి కవిత్వ విషయంలోనూ, సంస్కృతా ధ్యయనంలోనూ అధ్యాపకులు లభించక అష్టకష్టాలు పడ్డాడు. ఎవరి వద్దకు వెళ్ళినా నీవు శూద్రుడివి సంస్కృతం అభ్యసించకూడదు అని తిరస్కరించారు. దానితో రామస్వామిలో విద్యాతృష్ణ రోజు రోజుకూ అధికం కాసాగింది. రామస్వామి జిజ్ఞాసను విన్న ఆ నూరి కాంతయ్య ఆయనకు విద్యను బోధించాడు. ఆ తరువాత చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి శిష్యత్వం పొంది కవితా రచన ప్రారంభించాడు.

త్రిపురనేని రామస్వామి చౌదరి బారట్ల చదివేందుకు ఇంగ్లాండుకు వెళ్ళాలనుకున్నాడు. బంధువులు వద్దని వారించినా పట్టించుకోలేదు. లండన్ వెళ్ళి అక్కడ గాంధీజీని కలుసుకొన్నాడు. ఆయన గొప్పతనానికి ముగ్ధుడయ్యాడు. చౌదరి ఇంగ్లాండులో ఉన్నప్పుడు టమోటాలు, దోసకాయ ముక్కలు మొదలైన శాకాహార పదార్థాలనే తిన్నాడు. మాంసం ముట్టుకోలేదు. మద్యం జోలికి వెళ్ళలేదు. వేషం మార్చుకోలేదు. తలపాగా తీసివేయలేదు. చౌదరి డబ్లిన్ కళాశాలలో చేరినప్పుడు తలపాగా ధరించరాదని కళాశాల వారు విధించిన ఆంక్షను తిరస్కరించాడు. ఆ కళాశాలనే మానుకొన్నాడు. తర్వాత ఐర్లాండులోనే విద్యాభ్యాసం కొనసాగించి బారిస్టర్ పట్టా పొందాడు.

రామస్వామి లండన్ నగరమంతా కలయ చూశాడు. ఒక హోటల్ బోర్డు మీద "Indians and does are not allowed" అని వ్రాసి వుంది. భారతీయులు కూడా మానవులే కదా! మానవులను కుక్కలతో పోల్చడం అసమంజసం కాదా. అంతర్జాతీయ శాస్త్రరీత్యా ఇది చాలా అన్యాయమని ఆ హోటల్ యజమానితో వాదించాడు. కొంతసేపటికి ఆ హోటల్ యజమాని ఆ బోర్డును ఆయన ముందే తీసివేయించాడు. ఆత్మగౌరవంతో జీవించనివాడు మృతతుల్యుడు.

రామస్వామి సింగపూర్, సిలోన్, ప్యారిస్, డబ్లిన్, ఉత్తర, దక్షిణ ఆఫ్రికాలు మొదలైన దేశాల్లో పర్యటించాడు.

**ఉద్యోగం - పదవులు :**

రామస్వామి 1917 సం. నవంబరు 11వ తేదీన విదేశాల నుండి స్వదేశానికి తిరిగి వచ్చాడు. న్యాయవాద వృత్తిని స్వీకరించాడు. 1918 సం.లో బందరులో ప్రాక్టీసు ప్రారంభించాడు. తరువాత బెజవాడకు తరలివచ్చాడు. న్యాయ శాస్త్ర వాదంలోనూ, న్యాయాధికారులను ఒప్పించడం లోనూ ఆయన గొప్ప పేరు తెచ్చుకొన్నాడు. కానీ న్యాయవాద వృత్తి మీది వ్యామోహంకంటే, ప్రజా సేవాభిలాషే ఆయనకు ప్రబలంగా వుండేది. అందుచేత న్యాయవాదిగా సంఘంలోని అవకతవకలను గమనించాడు. న్యాయంవైపు నిలబడడం తన ధర్మంగా భావించాడు. ఫలితంగా సంఘసేవ, సారస్వతసేవ, బ్రాహ్మణేతర ఉద్యమం మొదలు పెట్టాడు.

రామస్వామి చౌదరి 5-11-1925న పిల్లలమర్రి ఆంజనేయులును ఓడించి తెనాలి పురపాలక సంఘానికి చైర్మనుగా ఎన్నికయ్యాడు. 1938 సం.రం వరకు ఆ పదవిలో ఉండి వ్యవహార సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నాడు. వారి బాధలు, గాథలు, కనీ వినీ వాటి తరుణోపాయాలను సూచించాడు. తనకున్నంత మేరలో అధికారాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని ప్రజలకు సేవ చేశాడు.

త్రిపురనేని రామస్వామి చౌదరి 1926వ సం.లో నడింపల్లి నరసింహారావును ఓడించి ఆంధ్రా యూనివర్శిటీ సెనేటు మెంబరు అయ్యాడు. తెలుగు టెక్స్టు బుక్ కమిటీ మెంబరుగా కొంతకాలం ఉన్నాడు. అప్పుడు సంస్కృత ప్రాముఖ్యాన్ని తగ్గించడానికి ప్రయత్నించాడు.

రామస్వామి ఇల్లెప్పుడూ సాహిత్య వాదోపవాదాలతోనూ, సంస్కర్తల వాదధ్వనులతోనూ ప్రతిధ్వనిస్తూ వుండేది. ఒకనాటి శంభుకాశ్రమమ్ పేరు 'సూతాశ్రమం"గా మార్చాడు. ఆస్తికులూ, నాస్తికులూ, రాజకీయ వేత్తలూ, లౌకిక వ్యవహర్తలూ, పండితులూ, పామరులూ, కవులూ, గాయకులూ మరెందరో ప్రముఖ వ్యక్తులు ఎప్పుడో ఒకప్పుడు సూతాశ్రమంలో అడుగుపెట్టకుండా వుండేవారుకారు. చౌదరి సలహాలనూ, సూచనలనూ అడక్కుండా వుండేవారు కాదు. 1941 సం.లో మహామేధావి యం.యన్. రాయ్ కూడా సూతాశ్రమాన్ని సందర్శించి హేతువాదంపై రామస్వామితో చర్చలు జరిపాడు. విప్లవాత్మకమైన ఉద్యమంతోనూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చౌదరికి సంబంధం వుండేది. ఎక్కడ ఏ నూతనాంశం కనిపించినా చౌదరి ఆసక్తితో గమనించేవాడు. ఎక్కడ ఎలాంటి నూతనోత్సాహం మోసులెత్తినా దానికి ఆయన దోహదం వుండేది. ఆయన ఎన్నో హృదయాలలో జ్ఞాన జ్యోతులను వెలిగించాడు. సాంఘికంగా అధమాధమ స్థితిలో వుండి, దిక్కుతోచక బెంబేలు పడుతున్న వారికెందరికో చేయూతనిచ్చి, వీపుతట్టి 'నాయనా' నేనున్నాను అని స్థైర్యాన్ని కలిగించేవాడు రామస్వామి. సముద్రమంత ధైర్యం తమకిచ్చాడన్న సంతోషం వారిని పునరుజ్జీవితులను చేసేది.

## కుటుంబ జీవితం :

క్రీ.శ.1898వ సంవత్సరంలో రామస్వామికి వివాహమైంది. అత్తవారిది చౌటపల్లి. మామ అట్లూరి అమరయ్య. అత్త నాగమ్మ. భార్య పున్నమాంబ. వీరి దాంపత్య జీవితం ఆనాటి వారికి ఆదర్శవంతమైంది. వీరికి క్రీ.శ.1910వ సంవత్సరం సెప్టెంబరు 8వ తేదీన ఒక కుమారుడు జన్మించాడు. ఈయనే ప్రఖ్యాత కథకుడు, నవలా రచయిత, తత్త్వవేత్త శ్రీ గోపీచంద్. తర్వాత 5 సంవత్సరాలకు ఒక కూతురు కలిగింది. ఈమె పేరు సరోజిని.

రామస్వామి భార్య పున్నమాంబ 1920 సం.రం జనవరి 16న కాలధర్మం చెందింది. ఆ సంవత్సరమే రామస్వామి ద్వితీయ వివాహం చేసుకొన్నాడు. ఈమెపేరు చంద్రావతి. వీరికి ఒక కుమారుడు. ఈయన గోకుల్ చంద్. 1932 సం.లో రామస్వామి మూడవ పెళ్ళి చేసుకున్నాడు. ఈమె పేరు అన్నపూర్ణమ్మ. వీరికొక కూతురు పుట్టింది. ఈమె చౌదరాణి. రామస్వామి మూడవ భార్య కూడా 1964వ సం.రం ఏప్రిల్ 30వ తేదీన కాలధర్మం చెందింది.

## బిరుదులు - సన్మానాలు :

రామస్వామి భాషా సేవను మెచ్చిన ఆంధ్ర మహాసభ బెజవాడలో 1929 సం.రం నవంబరు 4వ తేదీన కాశీనాథుని నాగేశ్వరరావు గారి చేతులమీదుగా "కవిరాజు" బిరుదునిచ్చి తనను తానే గౌరవించుకొంది. గుడివాడ పౌరులు రామస్వామికి 1942వ సం.రం ఏప్రిల్ 25, 26 తేదీలలో గజారోహనోత్సవంతో ఘనంగా సన్మానం జరిపి ఆయన సంస్కరణోద్యమంపట్ల తమ గాఢానురాగాన్ని తెలియజేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి అనేక మంది ప్రముఖులూ, వేలాది స్థానిక ప్రజలూ ఆ సన్మానంలో పాల్గొని కవిరాజుకు బ్రహ్మరథం పట్టారు. బెజవాడ రామచంద్రారెడ్డి అధ్యక్షతన, చల్లపల్లి సంస్థానాధీశ్వరుల సమక్షంలో పండితాశీర్వాదాలతో అనేకమంది

కవుల అభినందనలతో అఖండ వైభవోపేతంగా ఆ సన్మానం జరిగింది.

రామస్వామికి అస్వస్థత కలిగింది. అది టైఫాయిడ్కు దారి తీసింది. రోజురోజుకు ఆయన ఆరోగ్య పరిస్థితి దిగజారింది. డాక్టర్ కొల్లూరి వెంకట్రాయుడు చికిత్స చేశాడు. అయినా జ్వరం రోజులు గడచేకొద్దీ ఎక్కువ ఔతున్నదేకానీ తగ్గడం లేదు. డాక్టర్ థర్మామీటర్ నోట్లో పెట్టి జ్వరం ఎన్ని డిగ్రీలున్నదో చూస్తున్నాడు. కవిరాజు అపస్మారక దశలో ఉన్నాడు. థర్మామీటరును పటపటమని కొరికాడు. అక్కడ వున్నవారంతా కవిరాజు జీవిస్తారనే ఆశ వదులుకున్నారు. ఆంధ్రుల దురదృష్టం కొద్దీ, మహాకవి, భావ విప్లవ వైతాళికుడు, హేతువాది, యుగ పురుషుడు అయిన రామస్వామి తెనాలిలోని తన స్వగ్రహం "సూతాశ్రమంలో 1943 సం.రం జనవరి 16వ తేదీ రాత్రి 1.30 గం.లకు కీర్తిశేషుడయ్యాడు. అప్పటికి ఆయన వయస్సు 56 సంవత్సరాలు మాత్రమే. ఈ ఆకస్మిక వార్త యావదాంధ్ర ప్రజానీకాన్ని దుఃఖసాగరంలో ముంచివేసింది.

## రచనల పరిచయం :

త్రిపురనేని రామస్వామి చౌదరి కలం నుంచి 16 రచనలు వెలువడ్డాయి. వాటిలో పద్య కృతులున్నాయి. శతకాలున్నాయి. నాటకాలున్నాయి. గేయాలున్నాయి. ముద్రితాలున్నాయి. అముద్రితాలున్నాయి.

**రామస్వామి ముద్రిత కృతులు :**

1. సూత పురాణం, 2. భగవద్గీత, 3. కురుక్షేత్ర సంగ్రామం, 4. శంబుకవధ, 5. ఖూనీ, 6. వివాహవిధి, 7. కుప్పుస్వామి శతకం, 8. ధూర్త మానవా, 9. సూతాశ్రమ గీతాలు.

**అముద్రిత కృతులు :**

1. అంపకం, 2. మాలదాసరి, 3. నరకం, 4.గోపాల రాయ శతకం, 5.చెన్నకేశవ శతకం, 6. పల్నాటి పౌరుషం, 7. రాణా ప్రతాప్.

**1. సూతపురాణం :**

చౌదరి సకల పురాణాలనూ, సాంగోపాంగంగా చదివాడు. అందలి పరస్పర విరుద్ధ గాథలు ఆయనకు అనేక సందేహాలు కలిగించాయి. ఆ సందేహాలను తీర్చుకోవడానికి విజ్ఞాన దురంధరులమనిపించుకొన్న వారి వద్దకు వెళ్ళారు. ఆ పండితులు వారి సందేహాలను తీర్చ డానికి బదులు అసలు అలా ప్రశ్నించడమే తప్పన్నారు.

ఈవిధంగా ప్రశ్నించడమే తప్పు అని పెద్దలనేటప్పటికి రామస్వామిలో వున్న "హేతువాదశక్తి" విపరీతంగా విజృంభించింది. సత్యాన్వేషణకు పూనుకొనేట్టు చేసింది.

ప్రపంచంలోని దురాచారాలను రూపుమాపి నీతిని నెలకొల్పడానికి రామస్వామి సూతపురాణం రచించాడు. గంగాతీరంలో తపస్సు చేసుకొంటున్న సూతమహర్షిని రామస్వామి కలుసుకొని భారత దేశంలో జరుగుతున్న అన్యాయాలను నివేదించినట్టు, లోకకల్యాణం కోసం సూతపురాణం రాయమని సూతమహర్షి సూచించగా తాము సూతపురాణం రాసినట్టు పేర్కొన్నాడు.

"సూత పురాణం" నాలుగు ఆశ్వాసాల రసవత్కావ్యం. ప్రథమాశ్వాసంలో కౌశికునికి జ్ఞానోదయం కలిగించిన ధర్మవ్యాధుడనే కసాయివాని కథ, భద్రాద్రి గోపన్నను రామదాసుగా మార్చిన కబీరుదాసు వృత్తాంతము ఉన్నాయి. ద్వితీయాశ్వాసంలో దేవతలను గూర్చి, దేవలోకాన్ని గూర్చి చర్చించడం జరిగింది. తృతీయా శ్వాసంలో ప్రహ్లాద చరిత్ర, యథార్థ రామాయణం, చతుర్థాశ్వాసంలో శ్రీకృష్ణ చరితము, కురుపాండవుల కథ చక్కగా వివరించబడ్డాయి. 1925 సం?లోనే సూత పురాణ రచనను చౌదరి ప్రారంభించాడు.

**2. భగవద్గీత :**

రామస్వామి 1941లో భగవద్గీత రాశాడు. దీనిలోని వస్తువు పలనాటి యుద్ధం. కురుక్షేత్రంలో కృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేశాడు. ఇది వ్యాసభారత కథనం. రామస్వామి భగవద్గీతలో బ్రహ్మనాయుడు బాల

చంద్రుడికి గీతోపదేశం చేశాడు. కారంపూడి యుద్ధ భూమిలో పలనాటి కృష్ణుడు బ్రహ్మనాయుడు పల్నాటి పార్థుడైన బాలచంద్రునికి గీతోపదేశం చేశాడని రామస్వామి భావించారు. ఈ భావం నూతనమైనది. భారత యుద్ధానికి, పల్నాటి యుద్ధానికి చాలా పోలికలుండడం చేత భారత వీరులను పలనాటి వీరులతోనూ, ద్రౌపదిని నాగసానితోనూ, శ్రీకృష్ణుణ్ణి బ్రహ్మనాయనితోనూ పోలుస్తూ రామస్వామి అపూర్వమైన అధిక్షేప కావ్యం రచించాడు. రామస్వామి ఎంతో శ్రద్ధతో గీతారచనను ప్రారంభించాడు. గురిజాల రాజప్రాసాదంలో ఉన్న నలగామరాజు తన ఆంతరంగిక సచివుడైన గింజయుని ముఖతః యుద్ధ వార్తలను యధాతథంగా వినాలన్న కుతూహలంతో అతణ్ణి అడిగే ఘట్టంతో ఈ భగవద్గీత ప్రారంభమవుతుంది. ఆనాడు కురుక్షేత్ర రంగంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేసినపుడు, శ్రీకృష్ణుడు అతన్ని ఎలా రణాసక్తుణ్ణి చేశాడో, అదేవిధంగా కారంపూడి రణరంగంలో, చేతిలోని గుజ్జిపు కళ్ళాన్ని జారవిడిచిన బాలచంద్రునిలో సమరోత్సాహం ఉద్దీప్తం చేయటానికి బ్రహ్మనాయుడు ఈ భగవద్గీతను బోధించాడు.

బాలచంద్ర విషాదయోగం, సాంఖ్యయోగం, జ్ఞాన యోగం, కర్మయోగం, విభూతి యోగం, విశ్వరూప సందర్శన యోగం అనే ఆరు యోగాలలోనూ, పద్దెనిమిది అధ్యాయాల కృష్ణ భగవద్గీతను పరిహసిస్తూ రామస్వామి అపూర్వమైన బ్రహ్మ భగవద్గీతను ఆంధ్ర ప్రజలకు అందించాడు. పాత భగవద్గీతలో ప్రతిపాదించిన సిద్ధాంతాలను తుత్తునియలు చేశాడు. రామస్వామి చౌదరి భగవద్గీత ప్రచురణతో గీతాహృదయం బ్రద్దలయింది. భగవంతుడు హాస్యాస్పదుడయ్యాడు. వ్యంగ్య రచన సంఘ సంస్కరణకు ఎంత చక్కగా ఉపయోగిస్తుందో ఈ గ్రంథం ద్వారా నిరూపించాడు చౌదరి. ఆంధ్ర సాహిత్యంలో ఇప్పుడుకాని, పూర్వంకాని, పద్యంలోగాని, వచనంలోగాని ఎవ్వరూ చెయ్యని, చేయబోని పనిని ఈయన భగవద్గీతలో చేశాడు. ఆంధ్రకవిత్వం ఎన్నడూ ఎరుగని చక్కని సెటైర్, చక్కని హాస్యం ఈయన వల్ల తెలుగువారికి లభించాయి అన్నాడు డాక్టర్ జి.వి. కృష్ణరావు.

**3. కురుక్షేత్ర సంగ్రామం :**

అంధ విశ్వాసాలతో నిండి నిబిడీకృతమయిన సమాజంలో చైతన్యం కలిగించడానికిగాను ఈ "కురుక్షేత్ర సంగ్రామము" రచింప బడింది. తొలి ముద్రణ 1910 సం.లో జరిగింది. దీనిలోని ఇతివృత్తం మహాభారత యుద్ధానికి సంబంధించినది. అందుచేత ఇది వీరరస ప్రధానమైన నాటకం. ఇది మూడు అంకాల నాటకం. మొదటి అంకంలో సంజయ, కృష్ణరాయబారాలు, రెండవ అంకంలో భీష్మయుద్ధం, మూడవ అంకంలో ద్రోణ యుద్ధం చమత్కార పూరితంగా వర్ణించబడ్డాయి. పాండవులకంటే కౌరవులే నీతిపరులనీ, పాండవులకసలు రాజ్యార్హత లేదనే అభిప్రాయాన్ని ఈయన ఈ నాటకంలో బలీయంగా వెలిబుచ్చారు. ఈ గ్రంథాన్ని చౌదరి బాల్యంలోనే రాశాడు.

**4. శంబుక వధ :**

శంబుక వధ చౌదరి రెండవ నాటకం. దీనిలో నాలుగు అంకాలున్నాయి. ఇది మొదటిసారి 1920 సం.లో ప్రకటించబడింది. శూద్రుడైన శంబూకుడు తపస్సు చేశాడన్న మిషతో రాముడతన్ని తుదముట్టించడాన్ని నిరసిస్తూ ఈ నాటకం రచింపబడింది. రాముణ్ణి ఆర్యుల ప్రతినిధిగాను, శంబుకుణ్ణి ద్రావిడుల ప్రతినిధిగాను ఈ నాటకంలో చూపడం జరిగింది. ఈ నాటకానికి ఆదరణ, వ్యతిరేకత రెండూ ఆనాడు సమాజంలో చోటుచేసుకోవడం గమనార్హం.

**5. ఖూనీ :**

వేనుని నిజస్వరూపాన్ని లోకానికి తెలియజేయాలనే కాంక్షతో "ఖూనీ" నాటకాన్ని 1935 సం.లో రచించాడు. ఇందులో నాలుగు రంగాలున్నాయి. వేనుడు రాజు నాయకుడు. అతని సైన్యాధిపతి దృష్టవర్మ ఉప నాయకుడు. దృష్టవర్మ మునుల చేతుల్లో కీలుబొమ్మగా మారి, గాఢనిద్రలో వున్న వేనుని గుండెల్లో బాకుతో

పొడిచి చంపుతాడు. తుట్టతుదకు దృష్టవర్మ తన అపరాధాన్ని తెలుసుకొని పిచ్చివాడయిపోతాడు. తాను కూడా పృథువు చేత కత్తితో పొడవబడి మరణిస్తాడు. అంతటితో ఈ నాటకం ముగుస్తుంది. కాబట్టి ఇది విషాదాంత నాటకం.

**6. వివాహ విధి :**

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి చిన్ననాటి నుండి తాను విశ్వసించిన అభిప్రాయాలను నిర్భయంగానూ, నిరాఘాటంగానూ వెల్లడించేవాడు. మానవ జీవితంలో వివాహం మహోత్కృష్టమైనది. అందుచేత పెండ్లి నూరేళ్ళ పంట అని అంటారు. గనుక వివాహ నిర్వహణ విధానంలో చౌదరికి కొన్ని అమూల్యమైన అభిప్రాయాలు వుండేవి. వాటిని లోకానికి తెలియజేయాలనే ఉద్దేశంతో "వివాహవిధి" అనే చిన్న పుస్తకాన్ని 1930వ సం.లో ప్రచురించాడు.

కవిరాజు వివాహరంగంలో కూడా సంస్కరణను ప్రవేశపెట్టాడు. సంస్కృత మంత్రాల తెలుగు మాటల్లోకి మార్చివేశాడు. వధూవరులు ఆచరించవలసిన విధులను సులభమైన తెలుగులో ప్రవచించాడు. ఆయనే స్వయంగా నడుం కట్టి అనేక వివాహాలు చేయించాడు. ఒక పెండ్లి చేయడం - వధూవరులనుద్దేశించి ఒక ఉపన్యాసం ఇవ్వడం ఇది పద్ధతి.

1. బ్రాహ్మణ పౌరోహిత్యం వల్ల జరిగే దోపిడీ అరికట్టబడింది.
2. వివాహంద్వారా తమకు సంక్రమించే బాధ్యతలు, విధులు ఏమిటో వధూవరులకు అర్థంకావడం.
3. అట్టే పటాటోపం లేకుండానూ, న్యాయశాస్త్రానికి భిన్నంగాని పద్ధతిలోనూ, దుర్వ్యయం లేకుండానూ, వివాహం జరిపించడం.

**7. కుప్పుస్వామి శతకం :**

చౌదరికి మిత్రుడైన జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిని ప్రతి ఆదివారం కలవడం సాహిత్య గోష్ఠిని నిర్వహించుకోవడం కవిరాజుకు ఆనవాయితి. ఈ కుప్పుస్వామి చౌదరిని దృష్టిలో ఉంచుకొని రామస్వామి చౌదరి కుప్పుస్వామి శతకం రచించాడు. దీనిలో ఆటవెలది, తేటగీతి పద్యాలు ఉన్నాయి. అందరికీ అర్థమయ్యే మాటలతో చౌదరి ఈ శతకాన్ని రచించాడు. సమాజానికీ, మానవుడికీ కనువిప్పు కలిగించి పురోగమింపజేయాలనే చౌదరి కోరికే ఈ పుస్తక రచనకు ప్రేరణ. దీనిలో నీతులు, హితోక్తులు, విమర్శలు చోటుచేసుకున్నాయి.

**8. ధూర్త మానవ శతకం :**

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రారంభించి అసంపూర్తిగా ఆపివేసిన శతకం "ధూర్త మానవ శతకం" ఈ మకుటంతోనే ఇందులోని పద్యాలు సమ వృత్తాలుగా రచించబడ్డాయి. ఈ పుస్తకం ప్రకటించినప్పుడు ఆంధ్ర విద్వల్లోకంలో మరో పెను తుఫాను చెలరేగింది. శక్తివంతమైన భాష మహాశక్తివంతమైన భావం. వీటి సమ్మేళనమే ఈ "ధూర్త మానవ" శతకం. కవిరాజు అకస్మాత్తుగా మరణించినందువల్ల ఇది అర్ధశతకంగా నిలిచిపోయింది. దీని ప్రథమ ముద్రణ 1943 సం. సెప్టెంబరులో జరిగింది. తక్కిన శతకాల్లో మానవులు ఇబ్బందులను దేవుడికి విన్నవించడం ప్రధానాంశంకాగా "ధూర్త మానవ" శతకంలో దేవుడే మానవుల పట్ల సాటి మానవుల దుండగాలను తూలనాడడం ప్రధానాంశం.

**9. సూతాశ్రమ గీతాలు :**

రామస్వామి చౌదరి జాతీయగేయ కవి. ఆయన భారత జాతికి అండగా నిల్చి జాతీయోద్యమంలో పాల్గొని, భారత మాత దాస్య శృంఖలాలను విచ్ఛేదం చేయాలని సంకల్పించాడు. నీరసమూ, విస్తేజమూ అయిన జాతిలో వీరరసంతో ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్ని కలిగించడానికి "వీర గంధము" అను జాతీయ గీతం రాశాడు. పికెటింగు సందర్భంలో సత్యాగ్రహులు పాడుకోవడానికి 'పిలుపు' అనే మరో గేయం కూడా రాసి ఇచ్చాడు చౌదరి. నిద్రాణమైవున్న తెలుగు ప్రజానీకానికి వైతాళికగీతికలు ఆలపించాడు చౌదరి. ఆంధ్రరాష్ట్రం అవతరించాలని ఆకాంక్షించాడు. నాయకులు ఉపేక్షను నిరసించాడు. తెలుగు వారికి

దెలుఉగు రాష్ట్రము. తేర తేరఉగ నూడి పడునా! అని ఒక గీతంలో తెలుగు ప్రజలను నిలదీశాడు. రాష్ట్ర సంపాదన పట్ల ఆంధ్రులలో నెలకొన్న వైరుధ్యాన్ని చౌదరి తన సూతాశ్రమ గీతాల్లో చక్కగా చిత్రించాడు. కవిరాజు తెలుగువారు పిరికివారు కాదంటూ 'తెలుగు జోదులు' అనే గీతం రాశాడు.

**చదువదగిన పుస్తకాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి
2. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న.
3. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి జీవితం - సాహిత్యం - త్రిపురనేని సుబ్బారావు

❖❖❖

# భారతీయ సంస్కృతి - స్త్రీ స్థానం

- డా॥. పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, ఏలూరు జిల్లా.

**భారతీయ సంస్కృతి :**

సంస్కృతి అనే పదానికి అభివృద్ధి పురోగమనం, ఉత్పత్తి అని అనేక విధాల అర్థాలున్నాయి. దీనిన బట్టి ఒక జాతి సంస్కృతిలో, ఆ జాతి జనులకు సంబంధించిన అన్ని విషయాలు చేరతాయని తెలుస్తుంది. ఒక ప్రత్యేకమైన అర్థంలో సంస్కృతి అనే పదం మానవ శరీరం, ఆత్మ, మనస్సు మొదలైన విషయాలను కూడా చర్చించేదిగా వ్యవహారంలో ఉంది. మంచి సంస్కారం నాగరికమైన ప్రవర్తన అనే అంశాలు ఆయా జాతి జనుల జీవనం, నృత్యరీతులు మొదలైన అంశాలు కూడా చేరతాయి. ఒక జాతికి చెందిన కళలు, సాహిత్యం, మతము, సాంఘిక జీవనము వారి సంస్కృతిని ప్రతిబింబి స్తుంది.

నిజానికి ఒక జాతి జనుల సమిష్టి సృష్టి. అది వారి సామాజిక విలువలకు, వికాసానికి సంబంధింఇన అంశం. భారతీయ సంస్కృతికి ఒక ప్రత్యేకత ఉంది. కొన్ని వేల సంవత్సరాలుగా భారతీయ సంస్కృతి తనను తాను రక్షించుకొంటూ ఇప్పటికీ ఉనికిలో ఉంది. విదేశీయుల దండయాత్రలు, వారి పరిపాలన ప్రభావం భారతీయ సంస్కృతిని మార్చలేకపోయాయి. యూరోపియన్, ఇస్లామిక్ దేశాల సంస్కృతుల ప్రభావం ఉన్నా అవి భారతీయ సంస్కృతిలో కలసిపోయాయేగానీ, దాన్ని తీవ్రంగా ప్రభావితం చేయలేకపోయాయి. కొన్ని శతాబ్దాలుగా ఎన్ని ప్రభావాలు, దాడులు భారతీయ సంస్కృతిపై విరుచుకుపడినా అది హిమాలయాలంత ఉన్నతంగానే నిలిచి, తన ప్రత్యేకత చాటుకుంది. అలాంటి మన సంస్కృతిలో ప్రధానంగా కనబడే లక్షణాలు సహనం, నిస్వార్థం, ఆతిథ్యం, సత్యాన్వేషణ, ధర్మాచరణ, సమాజ శ్రేయస్సు, మానవులంతా ఒకటే అనే భావన, ఇవన్నీ ఇతర సంస్కృతులలో చూస్తే భారతీయ విభిన్న సంస్కృతులతో ఏకత్వాన్ని, ప్రత్యేకతను సాగిస్తూ నేటికీ కొనసాగుతున్నాయి.

భారతీయ సంస్కృతిని చతుర్వేదాలు, ఉపనిషత్తులు సజీవంగా ఉంచగలిగాయి. "లోకాఃసమస్తా సుఖినో భవంతు" అంటూ ఎల్లలెరుగని విశ్వమాన శ్రేయస్సును ఆకాంక్షించాయి మన వేదాలు. "యత్ర విశ్వం భవతి ఏక నిడమ్" అనే వసుదైక కుటుంబం భావాన్ని అణువణువునా జీర్ణించుకున్న తత్త్వం మనది. "మాతృదేవోభవ పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ" అంటూ బోధించింది. తైత్తరేయోపనిషత్తు. నిత్య పోరాటాలతో ప్రపంచం అనాగరికంగా బ్రతుకుతున్న కాలంలోనే "సత్యమేవ జయతే" అంటూ సత్యం జయిస్తుందనే సత్యాన్ని చెప్పింది. "ఓం శాంతి శాంతి" అంటూ శాంతి ప్రవచనాన్ని నినదించింది. భారతీయ సంస్కృతి.

**భారతీయ ధర్మం - ఆధ్యాత్మికత :**

భారతదేశ ఆధ్మాత్మిక వారసత్వం అపరిమితమైంది. అత్యంత సంపన్నమైంది. దీని జన్మస్థానం భారతదేశమే అయినా, సకల ప్రపంచ మానవ జీవితానికి సంబంధిం చిన అన్ని పార్శ్వాలకు ఈ సంస్కృతి నిలయమైంది. సార్వకాలికం, సార్వజనీనం, భారతీయ సాంస్కృతిక ఆధ్యాత్మిక వారసత్వం అందించే సందేశంలో మతపరమైన అంశాలకు గానీ, వర్గదృష్టికిగానీ చోటులేదు. కేవలం మానవ వికాసం, ప్రగతి, సర్వోత్కృష్ట కార్యసాధనే వాని లక్ష్యం ఇది సార్వజనీన మానవతాభావం. మానవ సమాజం మనుగడకు, వికాసానికి అవసరమైన కొన్ని శాశ్వత విలువలను నిరంతరం పాటిండం భారతీయ ధర్మం. వాటని ఉపేక్షిస్తే సమాజం విచ్ఛిన్నమై క్షీణించి పతనమవుతుంది. గతంలో వాటిని స్థిరంగా ఆచరించడం వల్లనే భారతదేశం మహోత్కృష్టమైన సాంస్కృతిక జీవనాన్ని,

వారసత్వాన్ని వేలాది సంవత్సరాలుగా కొనసాగిస్తూ పటిష్టంగా ఉంది.

సముద్ర జలాలన్నింటినీ సిరగా పోసి, ఈ భూ మండలం యావత్తు కాగితంగా వాడుకొని వ్రాసిన భారతీయ సంస్కృతికి వైభవాన్ని వర్ణించడం సాధ్యం కాదన్నారు - కబీర్. "భారతదేశం సమస్త ప్రపంచానికీ నీతిని బోధించగల మహోత్తమ ఉపాధ్యాయురాలు" అంటారు - అరవిందులు.

"గ్రీసు దేశం బట్ట కట్టినప్పుడే, రోము తలెత్తనప్పుడే, ఆధునిక యూరోపా వాసుల పూర్వీకులింకా అటవిక జీవితం సాగిస్తున్నప్పుడే, ఇంకా చెప్పాలంటే చరిత్రకందని కాలాని కన్నా ముందే ఈ దేశంలో మానవ సంస్కృతి పరిఢవిల్లింది" అన్నారు - వివేకానందుడు.

సత్యం - శివం - సుందరం అంటూ భారతీయ సంస్కృతిని నిర్వచించారు - విశ్వకవి రవీంద్రుడు. సమస్త విశ్వానికి రక్షణనిచ్చి కాపాడేది సత్యమైతే, శుభాన్ని ప్రసాదించే మంగళకరమైన శక్తి శివం కాగా, అంతః సౌందర్యంలో శోధించేది సుందరం. ఇంత గొప్ప సంస్కృతికి వారసులమైనందుకు గర్విద్దాం. మన సంస్కృతి పరిమళాన్ని దశదిశలా వ్యాపింపచేద్దాం. కాపాడుకుందాం.

## భారతీయ సంస్కృతి స్త్రీ స్థానం :

భారతీయ ధర్మ శాస్త్రాలు, పురాణాలు స్త్రీలకు అత్యున్నత స్థానం ఇచ్చాయి. స్త్రీని శక్తి స్వరూపినిగా, ఆదిపరాశక్తిగా సృష్టి, స్థితి, లయకారిణిగా కీర్తించాయి - మన పురాణాలు. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతా" (మను 3:56) ఎచ్చట స్త్రీలు గౌరవించ బడతారో అచ్చట దేవతలు నివసిస్తారని మను వాక్యం. అలాగే స్త్రీలను దుఃఖపట్టు, బాధించు హింసించు గృహాలు నాశనం అవుతాయని కూడా చెప్పాడు.

"కలికంట కంట కన్నీరొలికిన సిని ఇంట నుండీ నొల్లదు" అని సుమతీ కారుడూ చెప్పాడు. ఉపాధ్యాయాన్ దశాచార్యం అచార్యాణాంశతం సహస్రంతు పితౄన్ మాతాశారవేతదిచ్ఛతే (మను 1:45).

వివాహ సమయంలో కన్యాదాత వద్దకు వచ్చి వరుని తండ్రి 'ధర్మప్రజా సంపత్యర్థం వృణేమహే' అనడుగు తాడు. అనగా ధర్మపరమైన సంతానం కొరకు ఈ కన్యను వధువుగా అడుగుతున్నాను. అంటే స్త్రీ భోగ వస్తువు కాదని, సమాజానికి పనికి వచ్చే ధర్మపరమైన సంతానాన్ని ఇవ్వడానికి మాత్రమే స్త్రీని వివాహమాడాలనే భావన మన పూర్వీకులు ఏర్పరచడం మనం గౌరవించదగ్గ సంప్రదాయం.

ప్రజనార్థం మహాభాగ పూజార్హాగ్రాహదీప్తయ !
స్త్రియః శ్రేయచ్ఛ గేహేషువ విశేషోస్తి కశ్చిన !!

అనగా స్త్రీలు సంతానోత్పత్తికి కారణములు, మహా భాగ్యశాలులు, పూజనీయులు, గృహజ్యోతులైన ఇంటి లోని స్త్రీలే గృహలక్ష్ములు. గృహిణికి లక్ష్మికి బేధం లేదని చెప్పబడింది.

సమాజంలో తల్లిగా, చెల్లిలిగా, అక్కగా, అత్తగా, అమ్మమ్మగా, నాయనమ్మగా, భార్యగా, గురువుగా వివిధ పాత్రలు పోషించి స్త్రీమూర్తి అందించే సేవలు అంతా ఇంతా కావని చెప్పవచ్చు. వేదాలు, ఉపనిషత్తులలోని పలు కథలను పరిశీలిస్తే స్త్రీలు వేదాధ్యయనం చేసినట్లు, బ్రహ్మ విద్యను అభ్యసించేందుకు గురుకులాల్లో నివశించి నట్లు తెలుస్తుంది. అంతేగాక వేద సంప్రదాయానికి చెందిన ప్రాచీన మహర్షుల కుటుంబాలకు చెందిన స్త్రీలు అందరూ వేదాలు చదువుకున్నట్లు పలు ఆధారాలున్నాయి.

ఎందరో స్త్రీ రత్నాలు వివిధ రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకున్నారు. విమానాల్లోని ఎయిర్ హోస్టెస్ నుంచి ఎవరెస్టు శిఖరం ఎక్కడం వరకు, క్రీడాకారిణి నుండి రక్షణాధికారి వరకు, ఉపాధ్యాయు రాలు నుంచి పెద్ద పెద్ద కంపెనీల సి.ఇ.ఓ స్థాయి వరకూ, సంగీతం నుంచి సాహిత్యరంగం వరకు స్త్రీ ప్రభావం లేని రంగం అంటూ ఏదీ లేదు. తెలుగు సాహిత్య చరిత్రలో తాళ్ళపాక తిమ్మక్క, రామాయణాన్ని రచించిన మొల్ల గొప్ప విదుషీమణులు. వారి రచనలు ఆబాల గోపాలాన్ని ఆకట్టుకున్నాయి. నేటి తరంలో కాత్యాయనీ విద్యహే,

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

ఓల్గా చిల్లర భవానీ దేవి, పృహజన్, మృణాళిని వంటి రచయిత్రలు తెలుగు కవితామ తల్లికి సేవలందించారు.

మరి అంతటి గౌరవాదరణ పొందిన నాటి సమాజం నేడు కనుమరుగు అవడానికి కారణం ఏమిటి? భారతీయ అనైక్యతనే ఆధారంగా చేసుకొని విదేశీయులు భారత దేశంలోకి ప్రవేశించడం, భారతీయ స్త్రీలు తెరచాటుకు వెళ్ళడం జరిగింది. పురుషుల రక్షణ వ్యవస్థలో ఇమడటం జరిగింది. బాల్యంలో ఆమెను తండ్రి రక్షిస్తే, యౌవ్వనంలో భర్త రక్షించగా, వృద్ధాప్యంలో కుమారుడు ఆమె రక్షణ బాధ్యతను తీసుకున్నాడు. ఆ కారణంగానే స్త్రీకి స్వాతంత్ర్యం లేదన్నాడు మనువు.

ఆడది అంటే అబల. ఆడది అంటే అణచివేత. ఆడది అంటే అత్యాచారం. ఆడది అంటే కట్టుబానిస. ఆడది అంటే విలాస వస్తువు. ఆడది అంటే పిల్లల్ని కనే యంత్రంగా, ఆడది అంటే ఆటబొమ్మగా, ఓ వ్యాపార వస్తువుగా మొత్తానికి ఓ నిస్సహాయత. ఇది నేటి స్త్రీ యొక్క దుస్థితి.

స్త్రీలు సృష్టించిన ఈ సమాజం స్త్రీలనే అణగద్రొక్కడం ఎంత వరకు సబబు? దానికి ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తే? జవాబు స్త్రీలే అని చెప్పక తప్పదు. స్త్రీకి స్త్రీయే శత్రువుగా మారటం ఒక కారణమైతే, పురుషాధిక్య సమాజాన్ని పెంచి పోషించిన స్త్రీలే మరో కారణం. ఔను ప్రతి మాతృమూర్తి తన కుమారుడ్ని 'మగాని'గా కాక 'మనిషి'గా తీర్చిదిద్దితే 'మహీష' బాధలే వుండవు.

సృష్టికి మూలం స్త్రీ యే కనుక స్త్రీ లేకపోతే సృష్టి లేదు. సమాజమూ లేదు. ప్రపంచమూ లేదు. అందుకే నవ సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత స్త్రీలందరి పైన ఉంది.

**ఆధార గ్రంథము :**

1. మనుధర్మ శాస్త్రం - మను

❖❖❖

# తెలుగు - లంబాడాల పొడుపు కథలు - ఒక పరిశీలన

- డా॥. లక్ష్మణ్ నాయక్ భానోత్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేర్, యాదాద్రి భువనగిరి జిల్లా.

## పొడుపు కథ ఆవిర్భావం :

ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ పొడుపు కథలు ఆవిర్భవించాయి. మానవుడు భాష నేర్చుకున్న తర్వాత లిపి ఏర్పడక ముందే పొడుపు కథ పుట్టి ఉంటుంది. అంతేగాక మెదడుకు మేతగా నిలిచి విజ్ఞానాన్ని, వినోదాన్ని, ఉల్లాసాన్ని ప్రసాదించే ఈ పొడుపు కథలు ఎప్పుడు పుట్టాయి? ఎలా పుట్టాయి? ఇవి పుట్టడానికి గల కారణాలేమిటి? మొదలైన అంశాలను పరిశీలిద్దాం.

భారతీయ ఆది గ్రంథాలైన వేదాల్లో, గ్రీకు పురాణాల్లో, అరబిక్, పర్షియా భాషల అతి ప్రాచీన గ్రంథాల్లో, బైబిల్, ఖురాన్, బౌద్ధ జైనాది ధర్మ గ్రంథాల్లోను పొడుపు కథలు వాటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇవి మూలాలుగా పొడుపు కథా సాహిత్యం వికసించింది. ఈ గ్రంథాలు ఉనికే తెలియని గిరిజన భాషల్లో కూడా పొడుపు కథలు పుట్టాయి. నేటికి ఆ గ్రూపు భాషలుగానే మిగిలి వున్న తెగులుదేశంలోని గోండు, లంబాడా ఎరుకల భాషల్లోనూ పొడుపు కథలున్నాయి. పై భాషలను పరిశీలించి గేయాలు, కథా గేయాలు ప్రథమ దశకు చెందినవని, గద్య కథనాలు రెండవ దశకు చెందినవని ఇక పొడుపు కథలు మూడవ దశలో ఆవిర్భవించినాయి అని ఆచార్య కాసిరెడ్డి గారు పేర్కొన్నారు.

జానపద సాహిత్యంలో ఆవిర్భవించినట్లే లంబాడా సాహిత్యంలో కూడా గేయం తర్వాత కథా గేయాలు దాని వెంటనే పొడుపు కథలు ఆవిర్భవించి ఉండవచ్చు. తెలుగు జానపద సాహిత్యంలో మాదిరిగానే లంబాడాల మౌఖిక సాహిత్యంలో పొడుపు కథలు అసంఖ్యాకంగా లభిస్తాయి. అవి వారి ఆచార జీవిత విధానాలను ప్రతి బింబిస్తాయి.

'వినోదాన్ని, విజ్ఞానాన్ని సమానంగా పంచి ఇచ్చే ప్రక్రియల్లో పొడుపు కథను మించింది లేదు. ఇలాంటి ప్రయోజనాత్మక దృష్టితోనే ప్రపంచంలోని ప్రతి సమాజం లోని వ్యక్తులు వీటిని ఉపయోగించుకుంటూ వచ్చారు. ఇవి నిత్య జీవితంలో భాగమైపోయాయి. ఆదిమ మానవుని చిత్తవృత్తి బుద్ధి వికాసం పొందుతున్న దశలో మానవుని తహతహను అభివ్యక్తి శక్తిని ఇవి ప్రతి బింబిస్తాయి. పొడుపు కథలకు జీవితమే మూలధనం. జీవితంలో సమస్యల్ని విడగొట్టడానికి మనిషి చేసే యత్నమే వీటికి ప్రేరణ. ఎదుటివాని బుద్ధి కుశలతకు ఒక పరీక్షగా ఉద్భవిస్తాయి. పొడుపు కథలు సామాన్య మానవునలోని బుద్ధి చాతుర్యాన్ని హాస్య ప్రియత్వాన్ని సమస్యలను పరిష్కరించుకోవాలనే మనస్తత్వాన్ని పొడుపు కథలను పెంచి తీర్చిదిద్దగలిగే శక్తి వీటికి వుంది. అంతేగాక "ప్రత్యుత్తరం తెలియని వారి బుద్ధి కుశలతను పరీక్షించ డానికి వారిని తికమక పెట్టడానికి తయారు చేసిన ప్రశ్నలు పొడుపు కథలు" అన్నారు. రోగెర్ డి. అబ్రహమ్స్, అలన్ ఉండస్ (రిచర్డ్ ఎం. డార్సన్ 1972:130)

"దశ, కాలం ఏదైనా తెలుగు - లంబాడ భాషల్లో పొడుపు కథలు అనుభవ సాగర మథనం నుండి ఆవిర్భ వించాయి. ఆది నుండి మానవుని మేధస్సులో మెదలు తున్న ధార్మిక ఆలోచనలు, మానవాతీత శక్తులపై ఉన్న ప్రగాఢ విశ్వాసం, ప్రకృతి మాత ఒడిలో సామాజిక విషయాలపై ఉండే ఆసక్తి మొదలైన అంశాలెన్నో హాస్య పూరిత, చమత్కారయుత అంశాలు పొడుపు కథ ఆవిర్భావానికి కారనాలు అయ్యాయి.

## పొడుపు కథ అంటే :

పొడుపు కథ అని ఎందుకు వాడుకలోకి వచ్చింది. సంస్కృతాది తెలుగు, మళయాళ, తమిళ, కన్నడ భాషల్లో ఏమని పిలుస్తున్నారు. ఈ పేరు వచ్చిన విధానాన్ని పరిశీలిద్దాం. పొడుపు కథ ప్రశ్నార్థక రూపకాతిశయోక్తి

ప్రక్రియ. దీనికి బుద్ధి బలం, ప్రయత్నం అవసరం. పొడుపు కథలో ఉపమానోపమేయాలు రెండు దాగి ఉంటాయి. ఇందులో ఉపమానం వాచ్యం ఉపమేయం సూచ్యం వాచ్యమైన ఉపమానంచే సూచ్యమైన ఉపమేయాన్ని గుర్తించడం సమాధానమిస్తుంది.

జానపద సాహిత్యంలో పొడుపు - విడుపు అనే పదాలు వ్యవహారంలో ఉన్నాయి. రహస్య భావాలున్న చిక్కు ప్రశ్నలనే పొడుపు కథ అంటారు. జానపదుల్లోను కొందరు శాస్త్రం అని కూడా అంటారు.

''పొడుపు కథ : పొడ్పు కథ - పొడుపు + కథ - పొడుపు + చూపించుట.

1. పొడ + చూపు పొడుచు పొడుపు - పొడ్పు - ఉదయం, చూపించుట.
2. పొడుచు - పొడుపు - ప్రకాశం - వెలుగు
3. పొడుచు - పొడుపు - తగులుట - తాకుట బాధించుట, చీకాకు పరచుట చిక్కులో వేయుట

అని పి. యశోదారెడ్డి గారు విశ్లేషించారు.

ఈ విధంగా వివిధ అర్థాల్లో భాసిస్తుంది. ఒకసారి అంతర్గతంగా ఆలోచిస్తే ''పొడుపు కథ అంటే జ్ఞానోదయాన్ని కలిగించేది. నిగూఢమైన అర్థాన్ని ప్రకాశింప చేసేది. మనస్సుకు సూటిగా తగిలేది. ఎదలోనాటేది లేదా వెంటనే అర్థం తోచక చిక్కులు పెట్టేది అని మనం గ్రహించవచ్చు''. ఈ విశ్లేషణ తెలుగు పొడుపు కథలకే గాక లంబాడాల పొడుపు కథలకు కూడా వర్తిస్తుంది.

**"విడుపు"** : అంటే వేసిన పొడుపు కథకు అర్థం చెబితే విడుపు అవుతుంది. పొడుపు అంటే ఒక చిక్కుముడి ఆ ముడిని విప్పితే విడుపు అవుతుంది. సంస్కృత భాషలో పొడుపు కథను ప్రహేళిక అని, జాతీయ భాషయైన హిందీలో పహేలీ అని, ఆంగ్లంలో రిడిల్ అని అంటారు. బ్రౌణ్య ఇంగ్లీషు తెలుగు నిఘంటువులో ఈ పదానికి విడి కథ, విచ్చుట, విడికథను విచ్చుట అనే అర్థాలు కన్పిస్తున్నాయి. అయితే ఇది అనే పదం నుంచి పుట్టింది. ఈ పదానికి సలహా ఇవ్వడమనే అర్థం వుంది. తమిళ, మళయాళ భాషల్లో విడికతె, విడికథ అనే పదాలు వాడుకలో ఉన్నాయి. పొడుపు కథకు తెలుగులో చాలా పేర్లున్నాయి. తట్టు, శాస్త్రం, చిట్కా, ఒడ్డు కథ మొదలైన పేర్లు వాడుకలో ఉన్నాయి.

లంబాడ భాషలో పొడుపు కథను నాణ్కి సాక్కి అంటే చిన్న శాస్త్రం. వదోడ్ కేర్ సాక్కి అంటే విడపు చెప్పే శాస్త్రం. ఫాడేర్ సాక్కి అంటే పగులకొట్టే శాస్త్రం అని వ్యవహరిస్తుంటారు. నాణ్కి అంటే చిన్నది అని అర్థం. సాక్కి అంటే శాస్త్రమని, కథ అంటే విడుపు అని అర్థం. కేర్ అంటే చెప్పుట అని అర్థం. అదేవిధంగా ఫాడేర్ అంటే పగుల గొట్టుట అని అర్థాలున్నాయి.

### పొడుపు కథా లక్షణాలు :

పొడుపు కథలో రెండంశాలుంటాయి. ఒకటి పొడుపు రెండు విడుపు. లయాత్మకంగా ఉండడం పొడుపు కథ లక్షణం. పొడుపు కథలు ఒకటి, రెండు, మూడు, నాలుగైదు పంక్తుల్లో ఉంటాయి. స్పష్టత, సరళత, సులభశైలి తైలిక భాషలో చెప్పడం పొడుపు కథకున్న మరో లక్షణం. సంక్షిప్తత, ధ్వన్యాత్మకంగా కొండంత భావాన్ని కొద్దిమాటల్లో అందించడం పొడుపు కథ ముఖ్య లక్షణం. బాహ్య ప్రపంచంలోని వస్తువులు విషయాలు బింబ ప్రతిబింబ రూపాలుగా పొడుపు కథలుంటాయి. జానపదులు నిత్యజీవితంలో గమనించిన, అనుభవించిన విషయాలే పొడుపు కథల్లో ఉంటాయి. పొడుపు కథలో అంతర్లీయ, అక్షర మైత్రి ఉండడం వల్ల చెవికింపుగా ఉండి ఒకటి రెండుసార్లు వినగానే వాటిని జ్ఞాపకముంచుకునే లక్షణం కలిగి ఉంటాయి. పొడుపు కథలు చిన్న చిన్న మాటలనే గవాక్షాలను తెరచి విష్వవిశాలమైన సత్యాలను ప్రదర్శిస్తాయి. ఒడ్డేవాణ్ణి, విప్పేవాణ్ణి శ్రోతను ఉత్సాహంలో ముంచెత్తుతాయి. పొడుపు కథలు బుద్ధి కౌశలానికి, హాస్యనికి మాత్రమే కాకుండా లోకజ్ఞతను కలిగిస్తాయి. జ్ఞాపకశక్తికి పొడుపు కథలు పదును పెడతాయి. పొడుపు కథలో గాంభీర్యం దాగి వుంటుంది.

బుద్ధి చాతుర్యానికి వీటిలో ఎక్కువ ప్రాముఖ్య ముంటుంది. స్వరూప నిగూఢత పొడుపు కథల్లో ముఖ్యం. అర్థ, భావ, విషయ, పద, పదార్థ స్వరూపాలు కావచ్చు. పొడుపు కథలు రసస్ఫూర్తిని, వినోదాత్మకమైన క్రీడా రూపాన్ని కలిగి ఉంటాయి. వినేవారిని తికమక పెడతాయి. అయితే ఈ లక్షణాలన్ని ప్రతి పొడుపు కథలో ఉంటాయని చెప్పలేం. అందులో కొన్ని మాత్రం ఉండడం తప్పనిసరి అని ఆచార్య జి.ఎన్. రెడ్డి గారు విశ్లేషించారు.

జానపదులైనా, లంబాడాలైనా పొడుపు కథలను ఎప్పుడైన, ఎక్కడైన చెప్పుకుంటారు. అది వెన్నెల రాత్రి ఆరు బయట మంచం కావచ్చు ముఖ్యంగా చేను, పొలాలలో పని చేసేటప్పుడు శ్రమను మరచిపోవడానికి వీటిని ఆశ్రయిస్తారు. అంతేకాకుండా పండుగలు, పెళ్లిళ్ల వధూవరులకు పెళ్లయిన తర్వాత రోజు అమ్మాయి తల్లిదండ్రులు విందు ఏర్పాటు చేస్తారు. పెళ్లి కొడుకు పరివారం ఆ భోజనాన్ని తినేముందు అమ్మాయి తరపు అమ్మలక్కలు వేసే యక్ష ప్రశ్నల రూపంలో ఉండే పొడుపు కథలు విప్పిన తర్వాత మాత్రమే విందు భోజనాన్ని ఆరగించాలి. ఈ విధంగా వివిధ సందర్భాలలో బాల బాలికలు, స్త్రీ పురుషులు పొడుపు కథలను పొడవడం లోను, విప్పడంలోను ఉండే ఆనందాన్ని అనుభవిస్తుం టారు.

తెలుగు - లంబాడా భాషలలో ఉన్న పొడుపు కథలు కొన్నింటిని పరిశీలిద్దాం. అందరాని ఆకాశంలో కనిపించే సూర్యచంద్రుల గూర్చి ఇలా భావిస్తారు.

**లంబాడ :**

పర్భాతి ఆవె
సాంజ్ జావె
కత్రాయి పూచతో
ఓర్ ఘరేర్ జాడాకేని (దాడో)

**భావం :**

ఉదయం వస్తాడు
సాయంత్రం వెళతాడు
ఎంత అడిగినా
అతని ఇంటి జాడ చెప్పడు (సూర్యుడు)

**తెలుగు :**

ప్రాతఃకాలమున పుట్టాడు
పరుగులు తీశాడు
భువి నుండి దివి వరకు తిరిగి వచ్చాడు (సూర్యుడు)

లంబాడాలు వనచరులే అయినా ఉదయం రావడాన్ని సాయంత్రం పోవడాన్ని తెలుసుకున్న సూర్యుని చిరునామా కోసం అన్వేషణాపరమైన ఆలోచన కన్పిస్తుంది. అదే జానపదుల్లో ఉదయాన పుట్టి పరుగులు తీశారని తమ వ్యవసాయక విషయాంశాలను భువి నుంచి దివి వరకు పరిశీలిస్తాడని భావించారు. ఆలోచన విధానంలో కొంచెం భేదం ఉన్నా! సూర్యోదయాన్ని, సూర్యాస్తమ యాన్ని గుప్తంగా పేర్కొన్నారు.

ఆధునిక కంప్యూటర్ మీద కూడా లంబాడాల దృష్టి పడింది. అంతేవాళ్ల ఎదల్లోంచి పదాల కూర్పు ఆలోచన లతో పొడుపు కథలు రూపుదిద్దుకున్నాయి.

**లంబాడ :**

చతరేమ చత్తర్ కామ్ జతన్
పూంచతో దకల్ పాచేరి పేటేమ
ఆంగేరి హర్దేమ (కంప్యూటర్)

**భావం :**

తెలివే తెలివి చేసిన పని భద్రం
అడిగితే చెబుతుంది వెనుకవి కడుపులో
ముందువి ఎదలో నుండు అది ఏమిటి?(కంప్యూటర్)

చాలా తెలివైనది విషయాన్నంత భద్రపరచి అడగగానే చెబుతుంది. విషయాంశాలన్ని వెనుక ఉన్న తన కడుపులో, ఎదోలా దాచుకుంటుందట. అందుకే లంబాడాల పద జాలంలో బందీ అయింది.

తెలుగు, లంబాడాలలో పూర్తిగా సామ్యమున్న మరో పొడుపు కథ.

**లంబాడ :**

పర్భాతి చార్ టాంగేతి చాలె (నా బాళక్)
దోప్పేర్‌ది టాంగేతి చాలె (మోటార్)
సాంజ్ తీన్ టాంగేతి చాలె (బూడో)

**తెలుగు :**

ఉదయం నాలుగు కాళ్లతో నడిచేది (పసితనం)
మధ్యాహ్నం రెండు కాళ్లతో నడిచేది (యవ్వనం)
సాయంత్రం మూడు కాళ్లతో నడిచేది (వృద్ధాప్యం)

లంబాడాలు, జానపదులు ఇక్కడ చక్కని జీవిత వేదాంత జ్ఞానాన్ని ప్రవేశపెట్టారు. మానవ జీవనయానంలో మూడు ముఖ్యమైన దశలను ఒక్కరోజులో జరిగే సూర్యకాంతి మార్పులను సులభశైలిలో సామాన్య జనానికి అర్థమయ్యే రీతిలో అందించారు.

మనిషి శిశు దశలో రెండు చేతులు, రెండు కాళ్లను ఉపయోగించుకొని నడకకై లోకరీతిని గమనిస్తాడు. ఉదయం సూర్యకాలమే బాల్యం. పగలు సూర్యకాంతి ప్రభావం యవ్వనం. అంటే శారీరకంగా బలంగా ఉండి అన్ని కోర్కెలను సాధించుకుంటాడు. రెండు కాళ్లతో నడవడం అనేది కేవలం కాదు! ప్రవర్తనా పద్ధతులు కూడా ఇమిడి వుంటాయి. అదేవిధంగా సాయంత్రం అంటే సూర్యుడు అస్తమించే సమయం అంటే మనిసి అస్తమించే సమయమని పై తాత్వికుల అభిప్రాయం. ముసలితనంలో నడవలేని స్థితిలో ఆసరాగా మరోకాలుగా కర్రను ఊతంగా వాడుతారు. సూర్యుడు అస్తాద్రిలోకి ప్రవేశించినట్లే మానవుని జీవితం కూడా అలా ముగుస్తుందని జీవిత సారాంశాన్ని పొడుపు కథ ద్వారా చెబుతున్నారు.

లంబాడాల సంప్రదాయానికి చెందిన మరో పొడుపు కథ.

**లంబాడ :**

ఉంపర్ పాడే హాత్
నాయక్‌కరె ఓతి వాత్
రాం రచె ఓర్ సాత్ (పాణీర్ లోట)

**భావం :**

పైకి చేతులెత్తి
నాయకుడతనితో మాట్లాడుతాడు.
రాముడతనితో ఉంటాడు. (నీళ్లచెంబు)

లంబాడాల సమాజంలో రామనామస్మరణకు ఒక ప్రత్యేకత ఉంది. వాళ్లు తమ బంధువుల ఇండ్లకు అతిథులుగా వెళ్లినప్పుడు వారి ఇంటి గుమ్మం ముందు వెళ్లగానే అక్కడ ఉన్న వారికి రెండు చేతులు జోడించి రాం రాం అని రెండుసార్లు చెప్పాలి. అలా చెప్పగానే వాళ్లు తిరిగి రాం రాం రాం అని మూడుసార్లు చెప్పాలి. ఆ తర్వాత వచ్చిన అతిథి కాళ్లు, చేతులు కడుగుకొని మంచంపై కూర్చొని "అపణ్ సాజ్జ ఛెగె" "ఛెఛె" అంటే పరస్పరం క్షేమ సమాచారం అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత అతనికి మంచి నీళ్లిస్తారు. అతను నీళ్లు తాగేముందు "పాణిలేని" అంటే నీళ్లు తీసుకో అని అనాలి అంటాడు. అప్పుడు అక్కడ ఉన్న వాళ్లు "లె లె" అంటే నీళ్లు తీసుకో, తీసుకో అని చెప్పాలి. అప్పుడు కాని అతను నీళ్లను స్వీకరించడు. ఇది లంబాడాల సంప్రదాయంలో నిరంతరం జరిగే ప్రక్రియ. అంతేగాక ఇద్దరు లంబాడాలు కలుస్తే చాలు పరిచయమున్న లేకున్న తప్పనిసరిగా వారి మధ్య రామ నామస్మరణ జరగాల్సిందే ఇది ఇతర సమాజాలకు భిన్నమైందని చెప్పవచ్చు.

**ముగింపు :**

ప్రపంచంలోని అన్ని భాషా సాహిత్యాల్లోను పొడుపు కథలు తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. అలాగే లంబాడాల పొడుపు కథలను పరిశీలించడం ద్వారా లంబాడాల పూర్వపరాలు, చారిత్రక నేపథ్యం, జీవన విధానం వారి సాంస్కృతిక కళారంగాలు వాళ్ల మనస్తత్వం, ధార్మిక వ్యవస్థలు, విశ్వాసాలు మొదలైనవి వెలుగులోకి వచ్చాయి. లంబాడాలు తెలిసి తెలియక ఆడిన ఉప మాన, ఉపమేయాల వర్ణనలతో వాళ్ల జీవన విధానాలు సంస్కృతీ సంప్రదాయాలు విదితమవుతాయి.

**ఆధార గ్రంథాలు :**

1. ఆచార్య కాసిరెడ్డి, తెలుగు పొడుపు కథలు, పుట 10, 27, 72
2. డా॥. అర్వీ.యస్. సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, పుట 196.
3. డా॥. జనపాల శంకరయ్య, తెలుగు లంబాడీల గేయ సాహిత్యం, పుట 266.
4. ఆచార్య జి.ఎన్.రెడ్డి, తెలుగు పొడుపు కథలు, పుట 6, 7.

❖❖❖

# లంబాడీల పండుగలు - సామాజిక సంస్కృతి

- డా॥. బి. వీరన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు శాఖ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, రామగిరి, నల్లగొండ.

బంజారా సంస్కృతి సాంప్రదాయాలలో బంజారా ప్రజలు నిర్వహించే పండుగలకు ప్రత్యేక స్థానం ఉంది. తీజ్ పండుగ (మొలకల పండుగ) మోరామ్మ, తీజ్ మత్రాజ్, సీత్ల పండుగలు బంజారాల జీవితంలో పవిత్రమైన ఆధ్యాత్మిక జీవన విధానాన్ని నెలకొల్పాయి. బంజారా ప్రజలు ప్రధానంగా ఏడుగురు స్త్రీ దేవతలను నిత్యం భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తూ ఉంటారు. వారి పేర్లు మోరామ, హింగళ, తోల్జా, ధ్వాలంగన్, కేంకాలి, మసూరి, తీజ్ బంజార ఆడ పిల్లలు ప్రధాన పాత్రదారులుగా వుండి జరిపే పండుగ 'తీజ్' పెళ్ళీ ఈడు వచ్చిన అమ్మాయిల నాయకత్వంలో మిగతా అమ్మాయిలు కలిసి భక్తి శ్రద్ధలతో ఈ పండుగను ఎంతో సంబురంగా జరుపుకుంటారు. వీరిలో ఒకప్పుడు మాతృస్వామ్య వ్యవస్థ బలంగా ఉండేది. దానికి నిదర్శనంగా బంజార సమాజంలో ఏడుగురు స్త్రీ దేవతలు కొలువై నిత్యం పూజలు అందుకుంటున్నారు. ఈ స్త్రీ దేవతల పేరు మీదుగానే వీరు పండుగలు నిర్వహిస్తారు.

మోరామ్మ, తీజ్ మత్రాజ్, సీత్ల అనేవి బంజారాలకు ప్రధానమైన పండుగలు. మోరామ్మ దేవత తండాను రక్షిస్తే, తీజ్ దేవతల పంటలను కాపాడుతుంది. సీత్ల అనే దేవత పశు సంపదను వృద్ధి చేస్తుంది. మత్రాల్ పేరు గల దేవత పిల్లలకు ఎటువంటి రోగాలు రాకుండా చూస్తుంది. వీరిని తెలుగు సమాజంలో గ్రామ దేవతయిన ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, మారమ్మ, ముత్యాలమ్మ దేవతలతో పోల్చవచ్చు. గ్రామ రక్షణ కోసం ఈ దేవతలు తమ పాత్రను నిర్వర్తించే విధంగా బంజారా దేవతలు తండాను రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ విధంగా తెలుగు సమాజంతో పాటుగా బంజారా ప్రజలు వారి స్త్రీ దేవతలను భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తూ పండుగలను నిర్వహిస్తూ మంచి ఆధ్యాత్మిక చింతనను, భావనలను కలిగి ఉండి జీవనం కొనసాగిస్తున్నారు.

## ఉద్దేశ్యం :

బంజార ప్రజలు సంస్కృతి సాంప్రదాయాలల్లో పండుగలు చాలా ప్రధానమైనవి వారు నిత్యం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించే మోరమ్మ, తీజ్, సీత్ల, పండుగల యొక్క చరిత్రను, ఆ పండుగలను నిర్వహించే విధానాన్ని ఆ ఏడుగురు బంజారా దేవతల యొక్క గొప్పతనాన్ని వెలికి తీసి నేటి సాహితీ ప్రపంచానికి పాఠకులకు అందించడమే ఈ పత్రం యొక్క ముఖ్య ఉద్ధేశ్యం.

## లంబాడీల సీత్లా భవాని పండుగ :

### సీత్లా భవానీర్ పూజ :

లంబాడీలకు జీవనాధారం పశుసంపద కోసం వారు, పశువుల ఆరోగ్యం కోసం, తండా సౌభాగ్యం కోసం సీత్లా దేవిని పూజిస్తారు. తమకు మశూచి, కలరా వంటి మహమ్మారులు సోకకుండా, పశువులకు రోగాలు రాకుండా ఆ దేవత కాపాడుతుందని వారి నమ్మకం, దేవికి కోపం కలిగితే పశువులనూ, మనుషులనూ నాశనం చేస్తుందని వారి విశ్వాసం.

బంజారాలు ఏడుగురు శక్తి దేవతలను కొలుస్తారు. మోరామ్మ, హింగళ, తోల్జా, ధ్వాలంగన్, కంకాలి, మసూరి, తీజ్ వారు తొల్జా భవాని, మత్రాల్ భవాని, హింగళా భవాని, కంకాళి భవాని, దండి (మేరామా) భవాని, హింగళానీలు వీరు సాతీ భవానీలు (ఏడుగురు శక్తిదేవతల)ను అక్క చెల్లెళ్లుగా పేర్కొంటారు. సాతీ భవానీలు వారిని అన్ని అపదల నుండి రక్షిస్తారనే నమ్మకంతో వారికి ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో తండా పొలిమేరల్లో మేకపోతులను కూడా బలి ఇచ్చి భక్తితో పూజలు చేస్తారు.

## పూజా వృత్తాంతం :

శక్తి దేవతలలో తోల్జభవాని, హింగళా భవాన్ని, కంకాళి భవాని, దండి (మేరామా) భవానీలను బంజారాలు,

హిందువులు జరుపుకునే దసరా, దీపావళి, ఉగాది పండుగల సందర్భల్లో ప్రత్యేకంగా పూజిస్తారు. కొత్తగా తండాను స్థాపించినప్పుడు తండాకు తూర్పు దిక్కుల్లో సీత్లా భవానీని ప్రతిష్టిస్తారు. ఎప్పటికీ అలాగే ఉండనిచ్చి సంవత్సరంలో ఒకసారి పూజను ఆచరిస్తారు.

శక్తి దేవతలైన సాతీ భవానీలు నదిలో స్నానమాడు తుండగా ఒక అపరిచిత వ్యక్తి అందరికంటే చిన్నదైన సీత్లా భవానీ బట్టల్ని తీసుకొని చెట్టుమీద కూర్చుంటాడట బట్టలను ఎంతకీ ఇవ్వకపోయేసరికి సీత్లా భవాని ఆకులను చుట్టుకొని బయటికి వచ్చి తన మంత్రశక్తితో అతన్ని చెట్టు నుంచి కిందికి దింపి ఇక నుంచి ఆ ఏడుగురు శక్తి దేవతలను కాపలాగా కూర్చుంటున్నాడట. ఆ కాపలా కాసే అతన్ని, లూంకడియా (పోతులింగం) అని అంటారు. బంజారాలు సాతీ భవానీలను తండా పొలిమేరల్లో రాగిచెట్టు లేదా వేపచెట్టు కింద ప్రతిష్ఠిస్తారు. మధ్యలో ఒక పెద్ద పొడుగాటి రాయినీ, ఇరుపక్కలా మూడు మూడు చొప్పున ఆరు చిన్న రాళ్ళను సాతీ భవానీలకు ప్రతీకలుగా ప్రతిష్ఠిస్తారు. ఎదురుగా కొంత దూరంలో ఒక పెద్ద బండరాయిని లూంకడియా (పోతు లింగం)కు ప్రతిరూపంగా ప్రతిష్ఠిస్తారు.

బోనాల పండుగ సందర్భంగా విచిత్ర వేషధారిగానే కాక, బోనాలకు రక్షకుడిగా పోతురాజు ఉండడం మన ఎరుకలోని విషయమే. పార్వతీదేవి ఏడుగురు శక్తి దేవతలకు ముందు భాగంలో బంజారాలచే ప్రతిష్ఠింప బడిన, లూంకడియాకు సామ్యం ఉన్నట్లు భావించవచ్చు. ఒక ఇత్తడి పళ్లెంలో పెట్టుకొని, పులియగొణ్ణో అని ప్రత్యేకంగా కుట్టబడిన గుడ్డను కప్పి, తలపై పెట్టుకొని కన్యలు నడుస్తారు. అందరూ కలిసి పాటలు పాడుకుంటూ బయలుదేరుతారు ఈ సందర్భంలో స్త్రీలు పాడే పాటలు శ్రవణానందకంగా ఉంటాయి.

తంగేడి ఆకులను పరుస్తారు. ఆ తంగేడు ఆకుల మీద స్త్రీలు తెచ్చిన పాచి గుగ్గిళ్లు లాప్సి, పసుపు, కుంకుమ మొదలైన పూజా ద్రవ్యాలను నైవేద్యంగా సమర్పిస్తారు. తరువాత అప్పటికే సిద్ధపరిచిన మేకపోతును, ధడ్, ధడ్ తెప్పించుమని ప్రార్థిస్తారు. నీళ్లు పోసినప్పుడు మేకపోతు తన శరీరాన్ని విదిలించడం జరుగుతుంది. మేకపోతు శరీరాన్ని ఒకసారి విదిలించినట్లయితే భవాని మెచ్చిందని భావించి ఆ వెంటనే దాన్ని దేవికి బలిస్తారు. మేకపోతును కోయగా వచ్చిన రక్తాన్ని ఒక పళ్లెంలో పడ్తారు. తలను దేవి ముందుంచుతారు. పొట్ట పేగులను తీసి దేవి నుండి లుంకడియా వరకు పరుస్తారు. సీత్లా భవానికి పాచి గుగ్గిళ్లు, మేకపోతు రక్తం, వండిన మాంసం నైవేద్యంగా సమర్పిస్తారు. పొట్టలోని పేగులను తీసి దాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు.

## పూజవిధానం :

లంబాడీలు సాధారణంగా శ్రావణ మాసంలో తండా నాయకుని అనుమతితో ఏదో ఒక మంగళవారం ఈ పండుగను జరుపుకొంటారు. ఉదాహరణకు తెలంగాణ ప్రజలు బోనాల పండుగను శ్రావణమాసంలో జరుపు కుంటారు. వారు కూడా అనుకూలతను బట్టి ఏదో ఒక ఆదివారం జరుపుకోవడం సర్వసాధారణం. పండుగ ముందు రోజు అనగా సోమవారం రాత్రి తండా నాయకుని ఆదేశం మేరకు ఒకరు తండాలోని ఇంటింటికీ డప్పు కొట్టుకుంటూ తిరుగుతూ, వాంషీడో, అని కేకలు వేస్తూ పండుగ ప్రత్యేకతగా అందరూ గుగ్గిళ్లు వండుకోవాలని కూడా తెలియజేస్తాడు.

మంగళవారం రోజు ఉదయమే పిల్లలు, పెద్దలు అందరు స్నానమాడి సీత్లాదేవి కోసం లాప్సి (బియ్యం, బెల్లం, పాలతో వండిన పాయసం) వండుకుంటారు. సీత్లా భవానీని ప్రతిష్టించిన ప్రదేశానికి అందరూ ఊరేగింపుగా వెళ్లి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తండా నుండి సీత్లా భవానీని పూజించడానికి బయలుదేరే సందర్భంలో మహిళలు పాడే మరొక్క పాట కూడా వినిపిస్తుంది. ఈ పాట ఎంతో వినసొంపుగా ఉండి వారి భక్తిని తేటతెల్లం చేస్తుంది.

సీత్లా యాడీ నికళి మలక దేకేన
జగజగ నందియా ఝాంకరేచయ్
ఓన యాలే మ దనియా ధారేచ
సీత్లా యాడీ నికళి మలక దేకేన

**భావం :** సీత్లా దేవి తాను సృష్టించిన ఈ ప్రపంచాన్ని చూద్దామని బయలుదేరింది. అప్పుడు ఎక్కడా చూసినా నందీశ్వరులు ధగ ధగ మెరుస్తున్నారు. దేవి ప్రకాశానికి అందరూ అశ్చర్యచకితులై వెన్నలో పొగిడారు అని ఈ పాటలోని అర్థం సీత్లా దేవి అంటే చల్లని తల్లి. అందరి కోర్కెలు తీర్చే కల్పవల్లి.

అందరూ పూజా ప్రదేశానికి చేరుకున్నాక లుంకడియా ముందు గుంతను తవ్వి కన్యలు తెచ్చిన ఐదు బిందెల నీళ్లు ఆ గుంతలో పోస్తారు. సాతీ భవానీలను వారు తెచ్చిన నెయ్యి, గేరు (జాజు)లను సప్త మాత్రుకల ప్రతిరూపాలైన రాతి ప్రతిమలకు పూసి వాటిని అలంకరిస్తారు. దేవతా ప్రతిమల ముందు అలికి, చ్వాకో (ముగ్గు) వేస్తారు. నేతితో దీపాన్ని వెలిగిస్తారు. అలికి ముగ్గు వేసిన స్థలం (చ్వాకో) పైన ఐదుగురు కన్యలు పాంచ్ బేడో (ఐదు దొంతరలు)లలో నీటిని తీసుకొని రాగా మిగతా చిన్నా పెద్దా అంతా కలిసి బయలుదేరుతారు. ఒక రోజు ముందుగా వండుకున్న పాచి గుగ్గిళ్ళను ఉదయం వండిన లాప్సి పాయసంని (పాచి గుగ్గిళ్ళ) తోనూ, రక్తం తోనూ కలుపుతారు. దీనినే 'వాంసీడో' అంటారు. తరువాత పశువులను పరిచిన పొట్టపేగులపై నుంచి దాటిస్తూ 'వాంసీడో' చల్లుకుంటూ కేకలు వేస్తారు. కోళ్లను కోసి పశు వుల మందలోకి విసిరేస్తారు. ఆ తరువాత పొట్టపేగులు, ఏడు ఉడకబెట్టిన పెద్ద ఎముకలను దేవి ముందు నైవేద్యంగా పెట్టి తమను చల్లగా చూడాలని దేవిని ప్రార్థిస్తారు. తద్వారా సీత్లాదేవి కరుణకు పాత్రులైనట్లు భావిస్తారు. తెలుగు జానపదులు కూడా ఈ విధంగా ఊరు చుట్టూరు పొలాలపైన చల్లుతుంటారు. దీన్ని 'సరపు' వేయడం అంటారు.

ఈ సందర్భంలో దేవిని ఈ కింది విధంగా ప్రార్థిస్తారు.

ఏసీత్లా, సాతీ భవానీ యాడీ,
వర్షే మా ఏక్ దాడ తార్ పాంథ్గ కర్రేచా యాడీ,
గాప్డీ, గోదా, దూద్, ఘీ సే వేణూ యాడీ,
కుడీవెలేర్ నై వదారేస్ యాడీ,
కోత్లీ మా పీసా రకాడేస్ యాడీ
వాళ్ ఉంగ్ఫో హజార్ కోస్ దూర్ ర కాడేస్ యాడీ
సాయివేన్ సవారో కేరస్ యాడీ

**భావం :** దేవి! మా పూజను స్వీకరించు. సంవత్సరానికి ఒక రోజు నీ పూజను జరుపుతున్నాం. మాకు గోసంపద, ధాన్య సంపద సమృద్ధిగా ఇవ్వు, మా ఇళ్లలో పాలు, నెయ్యి సమృద్ధిగా కలిగేట్టు చూడు, మాకు ధనాన్ని ఇవ్వు, వినాశనాన్ని మా నుంచి వంద కోసుల దూరంలో ఉంచు, మమ్మల్ని కాపాడి మమ్మేలుకో జననీ! అని సీత్లా దేవిని ప్రార్థిస్తారు.

నైవేద్యంగా పెట్టిన లాప్సిని, ఉడకబెట్టిన మాంసాన్ని అందరికీ పంచుతారు. ఆ తర్వాత సాతీ భవానిలపై పాటలు పాడుకుంటూ నృత్యం చేసుకుంటూ ఇళ్లకు చేరుకుంటారు.

## బంజారాల పవిత్ర పండుగ 'తీజ్' తండలో తీజ్ సందడి :

### తీజ్ పండుగ :

తీజ్ పండుగనే మొలకల పండుగ అంటారు. ఇది పెళ్లి కాని ఆడపిల్లలు జరుపుకునే పండుగ, తీజ్ పండుగ. తెలంగాణలోని బతుకమ్మ పండుగను పోలి ఉంటుంది. తీజ్ పండుగలో పూలకు బదులు గోధుమ మొలకలను పూజించడం విశేషం. తెలంగాణ తెలుగు ఆడపడుచులు బతుకమ్మను పూజించి తొమ్మిదవ రోజు నిమజ్జనం చేసినట్లే, లంబాడి యువతులు కూడా గోధుమల మొలకల బుట్టలను ఎనిమిది రోజులు పూజించి తొమ్మిదవ రోజున నిమజ్జనం చేస్తారు.

సీత్లా భవాని పూజ ముగిసిన రోజు సాయంత్రం

పెళ్లికాని ఆడపిల్లలు అందరూ కలిసి పాటలు పాడుతూ ఇంటింటికీ తిరిగి వారి పెద్దవాళ్లను కలుస్తారు.

**తీజ్ పండుగ ప్రత్యేకత :**

ఆ రోజు రాత్రి కన్నె పిల్లలు తండా నాయకుని ఇంటి ముంగిట్లో వారం రోజులపాటు ఆనందోత్సావాలతో ఆటలు, పాటలు నృత్యం చేస్తూ గడుపుతారు. ఆ తరువాత పెళ్ళికాని అమ్మాయిలు ప్రతి ఇంటికి సోలెడు అరకిలో బియ్యం చొప్పున పోగుచేసుకొని ఆ బియ్యం మొత్తాన్ని తండా నాయకునికి ఇస్తారు. అప్పుడు ఆ నాయకుడు తన తోటి నాయకుణ్ణి పిలిపించి బియ్యాన్ని అతనికిచ్చి ఇవి అమ్ముకొని గోధుమలు, శనిగలు తీసుకుని రమ్మంటాడు. తెప్పించిన గోధుమలను కన్నెపిల్లలు, స్త్రీలు తండా నాయకునితో పాటు తండా పెద్దల సమక్షంలో పాటలు పాడుకుంటూ ఇత్తడి బిందెలో నానబెడతారు.

తరువాత రోజు సాయంకాలం కన్నెపిల్లలు అందరు కలిసి ఇంటింటికీ పోయి గోధుమలు చల్లుదామని చెప్పి వచ్చేస్తారు. అప్పుడు తండా ప్రజలంతా ప్రతి ఇంటి నుంచి ఒక బుట్టను తయారు చేసుకొని ఆవు ఎరువును తమ తమ బుట్టలలో వేసుకొని కుటుంబ సమేతంగా నాయకుని ఇంటి ముందు వస్తారు. ఆ బుట్టలను ఒకే చోట వరుస క్రమంలో పెట్టి నానబెట్టి గోధుమలను, శనిగలను బుట్టల్లో చల్లుతారు. అతను గోధుమలు చల్లుతున్నప్పుడు చుట్టూ కూర్చున్న అమ్మాయిలు, స్త్రీలు పాటలు పాడుతారు.

ఈ కార్యక్రమాలన్నింటికి ఒక అమ్మాయి నాయకురాలిగా వ్యవహరిస్తుంది. ఆ నాయకురాలు తొమ్మిది రోజులపాటు ఆకు కూరలు తింటూ శుచిగా ఉంటుంది. నాయకురాలి సమక్షంలో అందరూ కన్నె పిల్లలు కలిసి బావి దగ్గరికి వెళ్ళి పరిశుభ్రమైన ఇత్తడి బిందెల్లో నీళ్ళు తెచ్చి పాటలు పాడుతారు. తరువాత గోధుమలు చల్లిన బుట్టలను తండా నాయకుని ఇంటి ముంగిట్లో ఏర్పాటు చేసిన వేదికపై (పందిరి) పెడతారు. తరువాత నగారా వాయిస్తూ నృత్యం చేస్తారు. మరుసటి రోజు నుంచి తొమ్మిది రోజులపాటు రోజుకు మూడుసార్లు అమ్మాయిలు బుట్టల్లో నీళ్ళు పోస్తారు. బుట్టలో నీళ్ళు పోసేటప్పుడు పాటలు పాడుతారు.

తీజ్ పండుగను సేవాభాయ దండియాడి (మేరా మా భవాని) జరిపిస్తుందని ఆ దేవత ఈ పండుగతో రాజీ పడిందని, తీజ్ బుట్టలను పెట్టించి దేవతనే స్వయంగా ఈ పండుగను జరిపిస్తుందని విశ్వసిస్తారు. ఏడవ రోజు ఢమోళి అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతి ఇంట్లో బియ్యం పిండితో 'చుర్మో' రొట్టెలు చేసి వాటిని బెల్లంతో కలిపి ముద్దలు చేస్తారు. మరోవైపు తీజ్‌వున్న ఇంటి ఆవరణలో సేవాభాయ, మెరామ్మల పూజలు నిర్వహిస్తారు. ఇంటి ముందు జొన్నలు నింపిన గోనే సంచులు దాని ముందు పెట్టి ఒక చిన్న కడవలో నీళ్ళు పోసి అందులో 'లీంబెర్‌పాన్' (వేపమండలు వేసి పెడతారు). ఆ కడవకు మూడు పసుపు బొట్టు పెడతారు. కడవ ముందు జారెర్ ఆటో (జొన్నపిండితో) ముగ్గు వేసి ముగ్గు మధ్యలో దీపం పెడతారు. మేకపోతులను తెచ్చి గోనె సంచులకు ఎదురుగా నిలబెట్టి దాని తలకు కాళ్ళకు పసుపు రాస్తారు. నోటిలో నీళ్ళు పోస్తారు. మెరామ్మతల్లికి బలి ఇవ్వడం లంబాడీల ఆచారం. వెండితో చేసిన మేరామ్మ భవానీ విగ్రహాన్ని కాని లేదా ఏక్ రఫియా ఆచరిస్తారు. (ఒక రూపాయి బిళ్ళను కాని పెట్టి దాని ముందు మేకపోతును బలి ఇస్తారు.)

మేరామ్మ పూజ జరిగిన కొంచెం దూరంలో సేవాభాయ పూజ చేస్తారు. ఈ పూజను 'కడావో' అంటారు. సేవాభాయ శాకాహారి అందుకే అతనికి శకాహార పదార్ధాన్ని నైవేద్యంగా ఇస్తారు. దీర్ఘ చతురస్రాకారములో గొయ్యి తీసి అందులో కట్టెలు పెట్టి మంట చేసి ఒక పెద్ద గిన్నెలో 'కడావ్' వండుతారు. కడావ్ సిద్ధమైన తరువాత తమ తమ ఇండ్లలో తయారు చేసిన బెల్లం, రొట్టెలు కలిపిన సాత్ (ఏడు) చూర్మో ముద్దలను మహిళలు ఒక పల్లెంలో పెట్టుకొని వచ్చి తండా నాయకుని ఒడిలో పెడతారు. అప్పుడే సేవ బాయకు కడావ్ నైవేద్యాన్ని సమర్పిస్తారు.

ఎనిమిదవ రోజు సాయంత్రం గణగోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తండాలో నాయకుని అనుమతితో కన్నెపిల్లలు అందరూ కలిసి చెరువు దగ్గరికి వెళతారు. అక్కడ నల్లరేగడి మట్టిని తీసుకొని తండాలోని ఒక అనుభవజ్ఞురాలు దగ్గరకు వెళతారు. ఆమె చెరువు మట్టితో ఒక ఆడ  బొమ్మను మరొక మగ బొమ్మను తయారు చేస్తుంది. ఆడబొమ్మకు లంబాడి వివాహిత వేసుకొనే సంప్రదాయ వస్త్రాల్లాంటి (పేట్య, చాంకలి, టుక్రి) వస్త్రాలను చిన్నవిగా తయారు చేసి ఆడబొమ్మకు తొడిగిస్తుంది. లంబాడి పురుషుడు ధరించే వస్త్రాల వంటివి తయారు చేసి మగ బొమ్మకు తొడిగిస్తుంది. ఆడ బొమ్మ పేరు గణ్ అంటే మేరామ్మ దేవత, మగ బొమ్మపేరు గోర్ అంటు సేవాభాయ.

అదే రోజు హాస్యభరితమైన గేయాలను పాడుతూ, ఆడుతూ పెళ్ళికాని యువకుల చేతుల్లో ఉన్నదొనా అంటే (చెట్టుకు ఆకు) దండియాడి సేవాభాయ బుట్టలో నుంచి తీసి తీజ్ నారును ఇవ్వమని కన్యలు పాటలు పాడుతూ బ్రతిమాలుతారు. యువకులు ఇవ్వరు అలా చాలాసేపు ఆట పాటలతో గడిపిన తరువాత ఆ ఆకును తొమ్మిది రోజులు దీక్షలో ఉన్న అమ్మాయిని దొనా ఇచ్చేస్తారు.

**ఉయ్యాల ఆట పాటలు :**

తొమ్మిదవ రోజు కన్నెపిల్లలు ఉదయం అందరు కలిసి ప్రతి ఇంటింటికి వెళ్ళి ఉయ్యాల ఆట పాటలు పాడుతారు. అందరు రావాలని నగారా మోగిస్తారు. ఆదేవిధంగా కన్నె పిల్లలు అందరు కలిసి ఇంటింటికి వెళ్ళి ఉయ్యాలకు సరిపడు తాళ్ళు సేకరించి, అన్నయ్య లను, బాబాయిలను, తమ్ముళ్ళను పిలిపించి తండాలో ఉన్నటువంటి ఒక పెద్ద వేపచెట్టు కొమ్మల మీద తాళ్ళతో హింజళో చాంద్ ఉయ్యాలను కడతారు. అమ్మాయి గణ్‌గోర్ ఆడబొమ్మలను ఉయ్యాలను ఊపుతారు. పాటలు పాడుతూ ఆ రెండు బొమ్మలను ఉయ్యాలలో కూర్చోబెట్టుకొని ఉయ్యాలలో ఊగుతూ పాటలు పాడుతారు.

**బోరడి :**

బోరడి అంటే రేగుముళ్ళనీ, అంటే గుచ్చడం అని అర్థం. కన్యలు రేగు ముళ్ళను నానబెట్టిన శనిగల్ని (గుచ్చడం) యువకులు కర్రలతో రాల్చేటపుడు కన్యలు మా ఆశల రేకుల విప్పే ఓ శనిగల్లారా భయపడకు ధైర్యంతో యువకులు కొట్టినా మీరు రాలవద్దని హితవు చెబుతారు. దీక్షతో రేగుముళ్లకు గుచ్చిన శనగల్ని యువకులు రాల్చడంతో ఆ కార్యక్రమం ముగుస్తుంది. దాని తర్వాత దోనా కార్యక్రమం మొదలవుతుంది. కన్యలో ఒక నాయకురాలు ఒక రోజు మొత్తం కూడా ఉపవాసం ఉంటుంది.

తొమ్మిదవ రోజు సాయంత్రం అయిదు, ఆరు ప్రాంతంలో తీజ్‌వున్న చోట తాతలు, అన్నలు, తమ్ముళ్ళు తల పాగలు కట్టుకొని వరుసగా కూర్చుంటారు. తాము పెంచిన బుట్టల నుంచి గోధుమ నారును తుంచి తాతలు అన్నదమ్ముల తలపాగల్లో పెడతారు.

**యువతుల ఆవేదన :**

తీజ్ నిమజ్జనం సందర్భంగా యువతులు తీవ్ర ఆవేదనకు లోనవుతారు. చెరువు సమీపిస్తున్న కొద్దీ వారు కన్నీటి పర్యంతమవుతారు. ప్రాణం కన్నామిన్నగా తొమ్మిది రోజుల పాటు పెంచిన మొలకలను పెద్దల ఒత్తిడితో, బాధతో చెరువు నీటిలో వదులుతారు. తమకు ఎంతో ఆప్తులైన వారు దూరమవుతున్న భావనను వ్యక్తం చేస్తారు. సోదరులు యువతులకు కానుకలు సమర్పించి ఓదార్చుతారు. దేవి నవరాత్రి ఉత్సవాలను పోలిన విధంగా గిరిజనులు ఈ తీజ్ వేడుకలు నిర్వహిస్తారు.

**శివపార్వతుల ప్రేమకు గుర్తుగా :**

పురాణాల్లో పేర్కొన్న కథల ప్రకారం శివపార్వతుల ప్రేమకు గుర్తుగా జరుపుకొనేదే తీజ్ పండుగ శివుడిని ప్రసన్నం చేసుకోవటానికి పార్వతి 108 సంవత్సరాలు ఉపవాస దీక్ష చేపట్టింది. శివుడు తనను వివాహం చేసుకుంటానని చెప్పిన తరువాతనే పార్వతి దీక్షను విరమించింది. ఈ విధంగా సాధన ద్వారా లక్ష్యసిద్ధి

గావించినందున పార్వతిని భవానీగా కొలుస్తారు. భవానీ మాతకు చేయటాన్నే తీజ్ వేడుకగా వ్యవహరిస్తున్నారు. ఈ వేడుకలను నిర్వహిస్తే కోరికలు ఫలిస్తాయని నమ్ముతారు.

**తీజ్ నిమజ్జనం :**

తీజ్ బుట్టల్ని నీళ్ళలో వదిలే ఆచారం ప్రకారం తండా నాయకుని ఆజ్ఞ మేరకు నది లేదా చెరువు సమీపానికి డప్పులు వాయిస్తూ పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ ఊరేగింపుగా బయలుదేరుతారు. కొంత మంది యువకులు తీజ్ తెంచిన బుట్టలను 'జల్లా' (పెద్దగంపా) తీసుకొస్తారు. చెరువును సమీపిస్తున్న కొలది కన్యలు ముఖార విందాలు కాంతి విహీనమవుతాయి. తమ ఆప్తులు దూరమవుతున్న విధంగా బాధ, విచారం వీరి ముఖాల్లో కనిపిస్తుంది. ప్రాణం కన్న మిన్నగా పెంచి పోషించిన వాటిని నీళ్లలో వదిలేందుకు విచారం వ్యక్తం చేస్తూ శోకిస్తారు. శిల్పాలవలె నిల్చున్న వీరి పాదాలను వీరి సోదరులు కడుగుతారు. తోచిన విధంగా డబ్బులు చేతుల్లో పెట్టి ఓదార్చుతారు. ఆ తర్వాత మళ్ళీ డప్పులు వాయిస్తూ ఆటలు పాటలు పాడుతూ తీజ్ వేదిక దగ్గరికి వెళ్ళి ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోతారు. దీనితో తీజ్ పండుగ ముగుస్తుంది.

**ముగింపు :**

ఈ "లంబాడీల పండుగలు - సామాజిక సంస్కృతి" అనే పత్రంలో బంజారా ప్రజలు తమ సంస్కృతి, సాంప్రదాయాలల్లో భాగంగా నిర్వహించే పండుగలు మోరమ్మ, తీజ్, సీత్ల పండుగల యొక్క గొప్పతనాన్ని వారు ఆచరించే విధానాన్ని వివరించడం జరిగింది. బంజారాలు (లంబాడీలు) నివసించే తండాలలోని ప్రజలను వారి పిల్లలను పాడి పంటలను ఆ దేవతలు ఏ విధంగా కాపాడుతున్నారనే చరిత్రను ఆ ఏడుగురు దేవతల పట్ల బంజారా ప్రజలు పెట్టుకున్న భక్తి శ్రద్ధలతో కూడిన ఆధ్యాత్మికమైన నమ్మకాలను, భావనలను ఈ పత్రంలో చిత్రీకరించడం జరిగింది. బంజారా ఆడ బిడ్డల పండుగల యొక్క ఆధ్యాత్మిక స్ఫూర్తిని ఔన్నత్యాన్ని వివరించడం జరిగింది. అదే విధంగా భవిష్యత్తులో బంజారా ప్రజల యొక్క జీవన శైలిని, వారి సంస్కృతి, సాంప్రదాయాలను ఇంకా వెలికి తీయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మరీ ముఖ్యంగా బంజారా ప్రజలు, గిరిజన జాతుల యొక్క జీవన శైలిని లిపి, భాషలను వెలికి తీసి సాహితీ ప్రపంచానికి పాఠకులకు అందించవలసిన బాధ్యత. బంజారా గిరిజన ప్రజల యొక్క సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడవలసిన బాధ్యత మనందరిపై ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. సుగాలి సంస్కృతి, భాషా సాహిత్యాలు, సిద్ధాంత గ్రంథం - ఆచార్య ఎం. గోనానాయక్
2. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రణ - ఆచార్య సూర్యాధనంజయ్

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 02, February 2024

భావవీణ

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# గిరిజన స్ఫూర్తిప్రదాతలు - సమ్మక్క, సారక్క

– డా॥. బి. భీమమ్మ, తెలుగు అధ్యాపకులు, ఇందిరా ప్రియదర్శిని మహిళల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నాంపల్లి, హైదరాబాద్.

## పరిచయం :

తెలంగాణ సంస్కృతికి ప్రతీక మైడారం జాతర, గిరిజన స్త్రీ శక్తిని నిరూపిస్తూ అమరం పొందిన ఆదిపరాశక్తి స్వరూపాలు సమ్మక్క సారక్క. వీరత్వానికి గుర్తుగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ జాతరను జరుపుకోవడం ఒక ఆనవాయితీ. ఈ జాతర సమస్త గిరిజనుల ఆత్మగౌరవం. గిరిజనులతో పాటుగా తెలుగు ప్రాంతాల నుండి కాకుండా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఒరిషా, ఛత్తీస్‌ఘడ్ ఝార్ఖండ్ రాష్ట్రాల నుండి కూడా లక్షలకొద్ది భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇంతటి ప్రతిష్ఠకు పారవశ్యానికి పవిత్రతకి మూలకారకులైన సమ్మక్క సారలమ్మల గురించి గిరిజనులు అనేక జానపద కథలను చెప్పుకుంటూ చారిత్రకంగా మాత్రం సమ్మక్క సారలమ్మ స్ఫూర్తి కాకతీయ చరిత్రలో ముడిపడి ఉన్నది.

## సమ్మక్క సారలమ్మ త్యాగాల చరిత్ర :

ప్రస్తుతం నేటి జగిత్యాల ప్రాంతములో 'పొలవానను' గిరిజనరాజు మేడరాజు పాలించేవాడు. రాజువేటకోసం అడవికి వెళ్తాడు. ఒక పుట్టమీద ఒక పసికందు కేరింతలు కొడుతూ కనిపిస్తుంది. చుట్టూ పులులు, పాపకు రక్షణగా నిలబడి ఉంటాయి. అది చూసి ఆ పాప దైవాంశ సంభూతురాలిగా రాజు భావిస్తాడు. రాజుని చూడగానే పులులు వెనుదిరిగి అడవిలోకి వెళ్లిపోతారు. రాజు ఎత్తయిన విల్లు కూడా క్రిందికి దిగుతుంది. పాపను గూడెంకు తీసుకువెళ్తాడు. రాజు కరువుతో అల్లాడుతున్న పొలవాసరాజ్యంలో తమకు తోడుగా నిలిచేందుకు వచ్చిన దేవతగా దొరికిన పాపను భావిస్తారు గిరిజనులు. ఆ పాపకు సమ్మక్క అని నామకరణం చేసుకుంటారు.

గూడెంలో పులులతో పాములతో ఆడుకుంటూ పెరిగి పెద్దది అవుతుంది సమ్మక్క. ఇదే క్రమంలో కొన్ని మహిమలను చూపేది. ఎవ్వరికైనా ఏదైనా అనారోగ్యం పొడచూపితే చేత్తో ఆకురసంను ఇస్తే ఎలాంటటి రోగమైనా ఇట్టే నయమైపోయేది. పులులు, ఎలుగుబంట్లు పాముల భయం పూర్తిగా గూడెంకి దూరమయ్యింది. ఈ క్రమంగా ప్రజలకు పశువులకు సమ్మక్క వల్ల సంరక్షణ దొరికేది. సమ్మక్క ఆటవిక విద్యలు అన్నింటిలో ఆరి తేరుతుంది. యుక్త వయసు రాగానే మేనత్త కుమారుడు మేడారం పాలకుడు. పగిడిద్ద రాజుతో వివాహము జరుగుతుంది. ఈ దంపతులకు సారలమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానము కలుగుతారు.

## సమ్మక్క - యుద్ధభూమిలో వీరోచిత పోరాటం :

ఓరుగల్లు రాజధాని క్రీ.శ. 1283 నుండి క్రీ.శ. 1323 వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని ప్రతాపరుద్రుడు పాలించేవాడు. మేడారాన్ని పాలించే కోయరాజు పగిడిద్దరాజు కాకతీయుల సామంతరాజు. కాలక్రమంలో మేడారం కరువు కాటకాలు దాపురిస్తాయి. ఈ పరిస్థితుల్లో రాజ్యానికి కప్పము కట్టలేకపోతాడు పగిడిద్దరాజు. మరోవైపు రాజ్య విస్తరణలో భాగంగా రాజ్యకాకాయీ ప్రభువు పొలవాసుపై దండెత్తాడు. యుద్ధం దాడికి తట్టుకోలేక మేడారాజు పారిపోయి అల్లుడు పగిడిద్దరాజు ఆశ్రమం పొందుతూ అజ్ఞాతవాసం గడుపుతాడు.

తన సామంతరాజు పగిడిద్దరాజు వైఖరిపై ప్రతాప రుద్రుడికి కోపం వస్తుంది. ఒకవైపు కప్పం కట్టకపోవడం, మరోవైపు మేడరాజు ఆశ్రయం కల్పించడం ఈ రెండు పద్ధతులు కోయ గిరిజనులపై తన ప్రధాన కర్తవ్యంగా భావించి పగిడిద్దరాజుపై తన ప్రధానమంత్రితో కలిసి మాఘశుద్ధ పౌర్ణమిరోజున దండెత్తుతాడు.

పగిడిద్దరాజు సమ్మక్క, సారక్క, నాగులు, జంపన్న, గోవిందరాజులు వేర్వేరు ప్రాంతాలనుండి యుద్ధాన్ని

ప్రారంభించి వీరోచితంగా పోరాటం చేస్తాడు. కాని కాకతీయుల సేనల ధాటికి తట్టుకోలేక మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు యుద్ధంలో మరణిస్తారు. తన వాళ్లు యుద్ధంలో మరణించారనే వార్త జంపన్న తట్టుకోలేకపోతాడు. అవమానాన్ని తట్టుకోలేక సంపెంగవాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడుతాడు. అప్పటి నుండి సంపెంగ వాగు జంపన్నవాగుగా ప్రసిద్ధి చెందినది.

## సమ్మక్క శివంగిలా విజృంభణ :

కాకతీయుల సైన్యం గిరిజన మహిళ యుద్ధ పటిమకు చెల్లాచెదురు అవుతుంది. చివరకు ప్రతాపరుద్రుడే ఆశ్చర్యపోతాడు. ఇటువంటి తరుణంలో కాకతీయ సైనికుడు సమ్మక్కను దొంగచాటుగా దెబ్బతీస్తాడు. రక్తప్రధారలతోనే యుద్ధభూమి నుండి సమ్మక్క చిలుకల గుట్టవైపు బయలుదేరుతుంది. సమ్మక్కను వెదుక్కుంటూ వెళ్ళిన గిరిజనులు కూడా బయలుదేరుతారు. ఎంత వెదికిన సమ్మక్క జాడ కన్పించలేదు. అలసిన అనుచరులు ఒక పుట దగ్గర పసుపు, కుంకుమలు గల భరిగె గమనిస్తారు. కీకారణ్యంలో ఆ భరిణె ఎక్కడినుండి వచ్చింది? అంటూ గమనింగా ఆ భరణిలో పసుపు, కుంకుమ చెట్ల మూలికలు కన్పించాయి. సమ్మక్క తల్లి దేవతారూపం పొందిందని గిరిజనులకు ఆకాశవాణి పలుకుతుంది. ఆ వార్త విన్న గిరిజనులు కుంకుమభరణను దేవతారూపంగా భావిస్తారు. అప్పటి నుండి ప్రతి రెండేళ్లకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క పేరు మీద జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం మొదలుపెట్టారు. ఇలా గూడెంలో ఆరంభమైన జాతర ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందినది.

## జానపద గాథ - సమ్మక్క :

సమ్మక్క - సారలమ్మలకు ఒక ప్రత్యేకమైన ఆకాశం లేదు. గద్దెలు నిర్మించి, వాటికి ఒక కర్రనాటి పూజిస్తారు. వీటికి 'సమ్మక్క సారలమ్మ'ల గద్దెలు అంటారు. ఈ సమ్మక్క సారక్క చుట్టూ అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. మొదటి భాగంలో కథ ఏ విధంగా ఉన్నా రెండవ భాగంలో మాత్రం కాకతీయ రాజు కథ యథావిధిగా ఉండటం గమనించాల్సిన విషయం. అట్లాగే చాలా జానపద కథల్లో సమ్మక్క, సారక్క నాగులమ్మలు అక్కాచెల్లెళ్లుగా చెప్పుకుంటారు. పెళ్ళి విషయంలో స్వార్థంతో నాగులమ్మ సమ్మక్కను మోసం చేయాలి అనుకుంటుంది. పగిడిద్దరాజును నాగులమ్మ పెళ్ళి చేసుకోవాలనే ఆశతో సమ్మక్కకు నమ్మక ద్రోహం చేసే ప్రయత్నంను సారక్కకు తెలిసి, నాగులమ్మ చేసే మోసానికి సమ్మక్కకు అండగా నిలుస్తుంది. అందుకే అక్కాచెల్లళ్ళు ఇద్దరూ దేవతలుగా నిలబడ్డారు అనేది కథ.

## సమ్మక్క - సారక్కల గిరిజన పాటలు :

కోయ గిరిజనులు సమ్మక్క సారక్కలను తలచు కుంటూ ఎన్నో పాటలు పాడుకుంటారు. తమ పొలాల్లో పని చేస్తున్నప్పుడు, పిల్లలను నిద్రపుచ్చుతున్నప్పుడు ప్రకృతి శక్తులను పొలాల్లో పూజిస్తున్నప్పుడు సమ్మక్క సారలక్కలను పాటలుగా పాడుకుంటూ తలుచు కుంటారు.

అవ్వనీవే ఉయ్యాలా
ఇయ్యా నీవే ఉయ్యాలా
ఉసికల్లో పుట్టింది ఉయ్యాలా
సమ్మక్క సారక్క ఉయ్యాలా
అవ్వ నీవే ఉయ్యాలో
ఇయ్యా నీవే ఉయ్యాలో
పసుల్లో పుట్టింది ఉయ్యాలో
సమ్మక్క సారక్క ఉయ్యాలో
అవ్వ నీవే ఉయ్యాలో
ఇయ్యానీవే ఉయ్యాలో
వనంలో పుట్టింది ఉయ్యాలో
వనదేవత అయింది ఉయ్యాలో
సమ్మక్క సారక్క ఉయ్యాలో
.............................................

ఇలా తమ జీవితంలో ప్రతి అణువు సమ్మక్క సారలక్కలదే అనే భావనతో పాటలు పాడుకుంటారు.

**సమ్మక్క - సారక్కల జాతర :**

తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా, తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో జరిగే ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఈ జాతర తెలంగాణ ప్రభుత్వం 2014లో రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ జాతర 4 రోజులు భక్తిశ్రద్ధలతో సాగుతుంది.

**మొదటి రోజు :**

జాతర మొదటిరోజున ఎదురుకోళ్ళు ఉత్సవం ఉంటుంది. ఈ వేడుకలో ముందురోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకువస్తారు.

**రెండవ రోజు :**

ఈ రోజున చిలుకల గుట్ట నుండి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెకు తీసుకువస్తారు. దేవతలు ఇద్దరిని గద్దెలపై ప్రతిష్టించే ఘట్టం అత్యంత భక్తిశ్రద్ధలతో కూడి ఉంటుంది. ఈ రోజే పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. భక్తులు పూనకాలతో ఊగిపోతారు.

**మూడవ రోజు :**

గద్దెలపై కొలువుతీరిన అమ్మవార్లు భక్తులను కాస్తారు. నిలువెత్తు బంగారంగా బెల్లంముద్దలను భక్తులు అమ్మవార్లకు సమర్పించుకుంటారు.

**నాలుగవ రోజు :**

నాలుగవ రోజు సాయంత్రము అవాహాన పలుకుతారు. దేవతలను ఇద్దరినీ తిరిగి యుద్ధస్థానానికి తరలిస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న గిరిజనులే సమ్మక్క సారక్కల పూజారులుగా కొనసాగుతున్నారు. గిరిజనులు మాత్రమే కాకుండా అన్ని మతాలకు చెందిన ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొంటారు. సుమారు కోటికి పైగా జనం పాల్గొనే మహాగొప్ప జాతరగా రికార్డుకి ఎక్కింది.

**ముగింపు :**

సమస్త గిరిజనుల జాతరగా ప్రసిద్ధి చెండదం అనేది జాతికే గర్వకారణం. గిరిజన అసాధారన స్త్రీ శక్తికి నిదర్శనం. ఆసియాలోనే పెద్ద జాతర అయినప్పటికీ ఇక్కడ గుడి లేదు. అందుకే గుండెల్లో కొలువైన గుడిలేని దేవతలుగా అమ్మవార్లను చెప్పుకుంటారు.

**ఆధార గ్రంథాలు :**

1. కోయ సంస్కృతి - సాహిత్యం - డా॥. అరుణ.
2. గిరిజన సంస్కృతి - సాహిత్యం, గిరిజన సంక్షేమశాఖ, తెలంగాణ ప్రభుత్వం.
3. మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర, గిరిజన విజ్ఞానపీఠం, వరంగల్లు.

❖❖❖

# జానపద సాహిత్యంలో పొడుపు కథలు - విశిష్టత

– కె. అమృతజ్యోత్స్న, తెలుగు విభాగం, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు, నెల్లూరు జిల్లా.

**ఉపోద్ఘాతం :**

జానపద సాహిత్యంలో పొడుపు కథకు ఒక ప్రత్యేక స్థానం కలదు. కసిరెడ్డి వెంకటరెడ్డి గారు పొడుపు కథలపై సిద్ధాంత వ్యాస గ్రంథం రాశారు. సాహిత్యంలో పొడుపు కథ అనేది ఒక వినోదాత్మక ప్రక్రియ. దీనినే సంస్కృతంలో ప్రహేళిక అని కూడా అంటారు.

**పొడుపు కథ లక్షణాలు :**

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు పొడుపు కథలపై చక్కని పరిశోధన చేసి తన సిద్ధాంత గ్రంథంలో ఈ క్రింది లక్షణాలను పేర్కొన్నారు.

1. సంక్షిప్తత, 2. నిగూఢత, 3. అపార్ధ ద్యోతకథ, 4. కథాత్మకత, 5. కథా రహితాత్మకత, 6. ప్రతికాత్మకత, 7. ఘటన విశిష్టత, 8. లోకోక్తి రమణీయకత, 9. చమత్కారికత, 10. దృశ్యాత్మకత, 11. అలంకారిత, 12. సమస్యాత్మకత, 13. రసాత్మకత, 14. ధన్యాత్మకత, 15. సంప్రదాయ కత, 16. కవితాత్మకత.

**పొడుపు కథల పరిచయం :**

తెలుగు సాహిత్యంలో పొడుపు కథలకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. కథలు చెప్పవచ్చు, వినవచ్చు, వినిపించవచ్చు. కథలోని అన్ని సొంపులూ, మెలకువలూ వినేవాడు తెలుసుకున్నాడా అనే ఆలోచన రాదు. కాని వినేవాడి నుండి సమాధానం రాబట్టడంలోనే పొడుపు కథలో చమత్కారం ఉంది. స్ఫూర్తి ఉంది. కథ కాని కథ పొడుపు కథ. ప్రాచీన కాలం నుండి పొడుపు కథలు ప్రచారంలో ఉన్నవి. క్రీస్తుకు పూర్వం నాటి వేదాలలో వీటి ప్రసక్తి ఉంది.

**భాషలలో పొడుపు కథలను ఏమని పిలుస్తారు అంటే:**

| | | |
|---|---|---|
| ప్రాకృతం | : | వహేళీ, హిమాలయా |
| హిందీ | : | వహేళీ, ఖుల్ ఖులైయా |
| సంస్కృతం | : | బ్రహ్మోదయం, ప్రశ్నలేక ప్రత్యుత్తర కూట, ప్రహేళిక, వివాద, సమస్యా గూఢ హృదయాలికా, ఇత్యాది. |
| తమిళం | : | విడకటై, వుడుర్. |
| మళయాళం | : | విడకద, కటకద. |
| కన్నడం | : | ఒగటు లేక పగటు, ఒంటు, ఒడకతె, బిడ్డకతె, ఒగణు. |
| బెంగాలీ | : | ప్రహేళీ, దంథా, పెయ్. |
| మరాఠీ | : | ఉఖాణా, ఆహణా, ఉమణా, కులం గాదె కోడె, బయాణా. |
| గుజరాతీ | : | ఉఖాణో. |
| పంజాబీ | : | పహెదీ, ఖుజాతౌ |
| బీహారీ | : | చిహా, పహెళీ. |
| ఆంగ్లం | : | రిడిల్. |

**పొడుప కథల విభజన :**

వాస్తవానికి పొడుపు కథలు అల్పాక్షరాలతో అనల్పార్ధ రచనలు. హెచ్చుగా ఇందు హాస్యరచనలున్నాయి. "Riddles are probably the oldest extent forms of humour" అని బ్రిటానికా చెప్పడంలో వీటి ప్రాచీనత దేశ దేశాల వ్యాప్తి వ్యక్తమౌతుంది. ఇవి హరివిల్లులాగ వింత హోయలు ఒలకపోస్తాయి.

**1. సాధారణాలు :**

అంబులో పుట్టింది, జంబులో పెరిగింది
అరచేతి కొచ్చింది అంతరించి పోయింది. (పేను)

ఆ రాజు కూతురు అధిక చక్కనిదట
గోరంత కొప్పుబెట్టి గొలుసులు దిగవేసింది (వరివెన్ను)

**1. వృత్తులు :**

చలిలేక నిప్పులో కాలేవాడు, తాపంలేక చెరువలో

నానేవాడు
బతికుండి గోతిలో కూర్చునేవాడు
(కంసాలి, చాకలి, సాలె)

ఇంఇకి వెనుక కుప్ప వేసి కుప్పకు నిప్పుపెట్టి
కుప్ప కాలిపోతే అప్పు తీరిపోయె దాని పేరే...
(కుమ్మరావం)

**3. ప్రకృతి :**

అంతులేని కొమ్మకు అరవై కొమ్మలు
కొమ్మ కొమ్మకు కోటి పువ్వులు
అన్ని పువ్వుల్లో రెండే కాయలు
(ఆకాశం, చుక్కలు, సూర్యచంద్రులు)

నల్లచీర చిన్నది, నాజూకు ఉన్నది
ముగ్గుపెట్టుతున్నది, ముద్దులాడుతున్నది (ఆకాశం)

**4. చిక్కు ప్రశ్నలు :**

పిల్లికి ముందు రెండు పిల్లులు, పిల్లికి వెనుక రెండు పిల్లులు
పిల్లికి పిల్లికి మధ్య ఒక పిల్లి మొత్తం పిల్లులెన్ని
(తొమ్మిది)

టెన్‌కాయలో వన్ కాయపోతే ఎంత? (తొమ్మిది)

**5. శాస్త్ర విషయాలు :**

మనుజుడేమిగాదు మాటలాడగ నేర్చు, కథలు
పెక్కు జెప్పు. కాదు జేజి మామయ్య (రేడియో)

రా రండని పిలిచేది పో పొండని తరిమేది (సైరన్)

**6. దాగిన పదాలు :**

అంతా బేలుకోసం, ఎదురుచూస్తున్నారు (తాబేలు)

ఆ వుత్తరం నీకా నాకా (ఆవు)

**7. కాని పదాలు :**

కారు కాని కారు (షికారు)

పతి కాని పతి (భూపతి)

యంత్రం గాని యంత్రం (సాయంత్రం)

**8. అర్థంలేని పదాలు :**

ఉరవ పట్నం (ఉటంగీ)
రాణీ పట్నం (రటంగీ)
పెనుగొండ (పెటంగీ)
నాలుగు కాళ్ల (నటంగీ)

**9. శబ్ద చిత్రాలు :**

పామేల దుముకు (కప్పకై)

గుడినేల కురియు (కప్పకై)

కొంగేల పొంచు (చేపకై)

వంకర టింకర సొ (శొంఠి)

వాని తమ్ముడు అ (అల్లం)

నల్లని మిల్లా మి (మిరియాలు)

నాలు కాళ్ళు మె మె (మెంతులు)

నాకేమిస్తావు తే (తేనె)

**10. గొలుసు కథలు :**

విసనగౌరి పట్నాన వీధెంత సక్కన
వీధిలో వుండే పాపెంత నక్కన (ఆముదపు చెక్క)

పాప తొడిగిన పావడెంత సక్కన (కాయ)

**11. తాత్వికమైనవి :**

ఉదయం నాలుగు కాళ్ళతో నడిచేది (పసితనం)

మధ్యాహ్నం రెండు కళ్ళతో నడిచేది (మధ్యవయసు)

సాయంత్రం మూడు కాళ్ళతో నడిచేది
(ముసలి వయసు)

**12. వింత ప్రశ్నలు :**

పిఠాపురం చిన్నవాడా, పిట్టల వేటగాడా
బతికిన పిట్టను తేనూ వద్దు
కూరలేకుండా రానూ వద్దు (కోడి గుడ్డు)

**13. ఆలోచన రేకెత్తించేది :**

కొండనుండు, పెండెనుండు,
రాజుగారి శిరసునుండు, రంభ ముక్కునుండు
(పులి, పాము, కిరీటం, సత్తు)

**14. వ్యతిరేకార్థాలతో :**

తలనుంచి పొగలు చిమ్ముచుండు భూతము గాదు
కను లెఱ్ఱగా నుండు రాకాసి కాదు
పాకి పోవుచుండు పాము కాదు (రైలు)

**15. ప్రశ్నలోనే సమాధానం :**

వంగ 'తోట' నుండు
వరి 'మళ్ల' నుండు
తలుపు 'మూల' నుండు
తల 'మీద' నుండు

**16. హిందీ తెలుగు మిశ్రమాలు :**

ఎక్ దో కొట్టండీ, తీన్ చార్ రాణీ
వన్ మే భీ హై చంపారాణి (దానిమ్మ పండు)

**17. యక్ష ప్రశ్నలు :**

భూమి కంటె బరువైనది ఏది (తల్లి)
ఆకాశం కంటె పొడవైనది ఏది (తండ్రి)
గాలి కంటె వేగం కలది (మనసు)

**18. పద్య రూపంలో :**

కములు మూడు గలవుకాదు త్రినేత్రుండు
పక్షికాదు చెట్టుపైన నుండు
జలము దాల్చి యుండు నీలమేఘుండు గాడు
దీని భావమేమి తిరుమలేశ (టెంకాయ)

**19. సినిమాల్లో :**

ఒంటి కాలిపై నుండే, హఠయోగ ముద్రలో నుండే
గట్టుగ పని సాధించినది వివరిస్తావా? చిన్నదానా!
(కొంగ)

ఇలాగ తరచినకొద్దీ యివి పెరుగుతూ ఉంటాయి. ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటాయి.

## వర్గీకరణ



**పొడుపు కథల స్వరూపం :**

పొడుపు కథల స్వరూప స్వభావాలను గురించే రోగర్ డి అబ్రహమ్ "సమాధానం తెలియని వారిని సందిగ్ధ పరిస్థితిలో ఉంచే నిమిత్తం లేదా ప్రశ్నించే నిమిత్తం వేసే వినోద ప్రశ్నలే పొడుపు కథలు" అన్నారు.

**పొడుపు కథలు పర్యాయ పదాలు :**

అడ్డుక (త)థలు, ఎదురు కతలు, ఒడ్డు కతలు, కథ కట్టు పద్యాలు, చిక్కుముళ్ళు, చిట్కాలు, చిటుకలు, చిటుకుల, పొడుపు కథలు, మారుతట్లు, యక్షప్రశ్నలు, విడుపు కథలు, శాత్రాలు, శాస్త్రాలు, సమచ్చలు, సమస్యలు.

**పొడుపు కథలు వాటి ప్రయోజనాలు :**

పొడుపు కథలకు ఉన్న గొప్ప సుగుణం ఏమిటంటే, ఇవి విన్న వెంటనే మనసుకి ఆలోచనలు కలిగించి, వివేచన పెంపొందించి వాటి విడుపు ఎలాగయినా విప్పాలి అనే జిగ్నాస పుట్టిస్తాయి. పొడుపు కథల చరిత్రకి వస్తే వీటిలో కొన్ని అతి ప్రాచీనకాలం నుంచి, మన కావ్యాల్లో ఇమిడిపోయి ఉన్నాయి. ఉదాహరణకి కాశీ మజిలీ కథలే తీసుకోండి. అందులో మనకు కావలసినన్ని పొడుపు కథలు ఉన్నాయి. మన తేట తెలుగులో లెక్కకు మిక్కిలిగా ఉన్న పొడుపు కథలు భాష, బావం ఒకదాని వెంట ఒక పోటీ పడి పరుగులు పెడుతున్నట్టుగా ప్రశ్నించే విషయాన్ని, బహుపసందుగా రూపకల్పన చేసి, కొసమెరుపుగా వాటి విడుపు తెలుపుతూ ఉంటాయి.

**ఋగ్వేదంలో సైతం జీవితం విలువను తెలియజేసే పొడుపు కథ ఉంది. ఆ పొడుపు కథ గురించి తెలుసుకుందామా?**

ద్వా సుపర్ణా సయుజా సఖయా సమానం వృక్షం పరిషస్వజాతే।

తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్ అన్యో అభిచాకశీతి ॥

ఒకే చెట్టుపైన రెండు పక్షలు ఉన్నాయి. క్రింద కొమ్మ మీద ఉన్న పక్షి పళ్ళను తింటున్నది. అది తియ్యని పళ్ళను తిన్నప్పుడు సుఖాన్ని, చేదుపళ్ళను తిన్నప్పుడు దుఃఖాన్ని పొందుతున్నది. రెండవ పక్షి ఏమీ తినకుండా ప్రశాంతంగా కూర్చొని సుఖదుఃఖాలకు అతీతమైన ఆత్మానందాన్ని అనుభవిస్తూ ఉంది.

శరీరం - చెట్టు, పళ్ళు తింటున్న పక్షి - జీవాత్మ.

పళ్ళు తినకుండా ఉన్న పక్షి - పరమాత్మ.

విషయ వాంఛలను అనుభవిస్తున్న వ్యక్తి సుఖ దుఃఖాలను పొందుతాడు. వీటికి అతీతంగా ఉన్న వ్యక్తి ఆత్మానుభూతిని పొందుతాడు. జీవాత్మ పరమాత్మతో ఏకమవ్వాలంటే ఆధ్యాత్మిక సాధనల ద్వారా శుద్ధ మనస్సును పొంది వాంఛారహిత స్థితిని చేరి సర్వత్రా ఉన్నది ఒకే ఆత్మ అను అనుభవము పొందడం ఒక్కటే మార్గం.

**ముగింపు :**

ఆలోచనా శక్తిని పదును పెట్టే పొడుపు కథలంటే పిల్లలు ఎక్కువ ఇష్టపడతారు. పిల్లలకు రకరకాల పొడుపు కథళు చేసి వారి మెదడును పదును పెట్టాలి. సాంప్రదాయకంగా వస్తున్న పొడుపు కథలనే కాకుండా ఆధునిక కాలానికి సంబంధించిన విషయాలనైన పొడుపు కథలు తయారు చేసి పిల్లల్లో ప్రచారం చేయాలి. పిల్లల చేత వారి సృజనాత్మకత పెంచుటకు కొన్ని పొడుపు కథలు తయారు చేయించాలి.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. చమత్కార పొడుపు కథలు, రాజమండ్రి గొల్లపూడి వీరాస్వామి అండ్ సన్స్, సీతారామ బుక్ డిపో, 1951.
2. నేదునూరి గంగాధరం - పొడుపు కథలు - జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి, రాజమండ్రి విశ్వ సాహిత్య మాల, 1961.

3. వెంకటప్పయ్య పొడుపు కథళు, ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ, నవరత్న బుక్ హౌస్, విజయవాడ, 2017.
4. డాక్టర్ ఎం.కె. మద్దిలేటి, తెలుగజు సాహిత్య దీపిక, విశ్వవాణి పబ్లికేషన్స్, కర్నూల్, 2015.
5. ఆర్.వి.ఎస్. సుందరం పొడుపు కథళు, తెలుగు జానపద సాహిత్య స్వరూపం, బెంగుళూరు, జానపద విజ్ఞాన సమితి, 1976.
6. బట్టు వెంకటేశ్వర్లు, జానపద విజ్ఞానం, పల్నాడు పబ్లికేషన్స్, గుంటూరు.
7. తెలుగు పొడుపు కథలు (సిద్ధాంత వ్యాసం), కసిరెడ్డి వెంకటరెడ్డి, 1990.

❖❖❖

# డబ్బు తయారు చేస్తున్న కొత్త సమాజం చిత్రీకరణే 'బ్రిడ్జీకింద'

– డా॥. పొదిలి నాగరాజు, తెలుగు అధ్యాపకులు, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాల, కడప.

''ఈ కొత్త పద్ధతిలో మనుషులు లేరు డబ్బు వుంది. డబ్బే దేవుడు. అది ఎవరి దగ్గరుంటే వాళ్ళే గొప్పవాళ్ళు. మనిషి మంచితనం, నీతి, నిజాయితీ యివన్నీ లేవు. డబ్బు సంపాదించాలి. ఇంకా ఇంకా సంపాదించాలి. అదే ఈ కొత్త సమాజపు లక్షణం, లక్ష్యం''. ఆర్. వసుంధరాదేవి రచించిన 'బ్రిడ్జీకింద' కథ ఈ మాటల చట్రం చుట్టూ కదులుతూ కనిపిస్తుంది. రచయిత్రి ఈ కథను యాభై సంవత్సరాల ముందు రచించింది. డబ్బు మనిషిని తనకు అనుకూలంగా మార్చుకుంటున్న కాలంలో వచ్చిన కథ ఇది. డబ్బు కోరిక సమాజానికి ప్రమాదకారిగా మారుతుందని వసుంధరాదేవి యాభైయేళ్ల ముందే గుర్తించింది. ఈనాడు సమాజం చుట్టూరా విచ్చలవిడిగా అన్యాయంతో డబ్బును దోచుకొనే మనుషులు పాటించే విధానాలను రచయిత్రి కథలో యాభైయేళ్లప్పుడే చిత్రించింది. ఈ రకంగా 'బ్రిడ్జీకింద' కథ గొప్ప కథే. కథలో సామాజిక పెత్తందారు డబ్బు. కథలోని ప్రతి పాత్రా డబ్బుతో ముడిపడే దర్శనమిస్తుంది. డబ్బు సంపాదించటానికి వచ్చే వారంతా 'బ్రిడ్జీకిందికే' చేరుకుంటారు. చిన్నా పెద్దా ఎవరి స్థాయికి తగినట్లు వారు డబ్బెలా సంపాదిస్తారో, వారిచేత డబ్బు చేయించే విన్యాసాలు మానవత్వాన్ని ఎలా మరుగుపరుస్తాయో? కథ చక్కగా చిత్రించింది. మానవ సమాజాన్ని పట్టిపీడించే మహమ్మారి డబ్బని ఈ కథ నిరూపించింది. డబ్బు తప్ప వేరే అంశం గురించి ఆలోచించిన నేటి సామాజిక మనుగడకు ఈ కథ అవసరం ఎంతో వుంది. సామాజిక అభివృద్ధి డబ్బులో లేదని చెప్పటమే కథా విశేషం. అయ్య చేసిన అప్పు తీర్చడానికి మానాభిమానాలతో పట్నానికొచ్చిన పోతప్ప డబ్బు వ్యామోహంలో పడి సంపాదనకు బానిసై బాంధవ్యాన్ని, స్నేహాన్ని చిన్నచూపు చూసి, అహంకారంతో ప్రవర్తించి జైలుపాలై చివరికి డబ్బుతోపాటు అన్నీ పోగొట్టుకొని, మళ్ళీ అప్పు మిగిల్చుకొని అనామకంగా అయోమయ స్థితిలోకి వెళ్ళిపోవటమే కథా ఇతివృత్తం.

''కొనముడి దాన్ని చేత్తే బొమ్మిడీలు గొట్టక పోవలసిందే'' అని పోతప్ప చెబుతున్నా వినకుండా పోతప్ప తండ్రి ఎనిమిదెకరాల పొలాన్ని కౌలు తీసుకొని పద్దెనిమిది నూర్లు అప్పుజేసి దాన్ని తీర్చలేక ఆత్మహత్య చేసుకొని చనిపోతాడు. అయ్య చేసిన అప్పు తీర్చటానికి పోతప్ప యర్రాయపాలెం నుండి అనంతపుమొచ్చి కొత్తపేట చేరి రిక్షాతొక్కి అప్పుతీర్చాలని బ్రిడ్జీకింద చేరిపోతాడు. వారానికే భార్యాపిల్లల్ని పట్నం తెచ్చుకొని అయిదురూపాయిల అద్దెతో కొట్టంలో కాపురం పెడతాడు. అదే బ్రిడ్జీకింద భార్య లచ్చుముకు తమలపాకు గంప పెట్టిస్తాడు.

బ్రిడ్జీకింద పోతప్ప కన్నా ఆర్నెల్లు ముందొచ్చి బతకటానికి రిక్షాతొక్కుతున్న చలపతి పోతప్పకు పరిచయమవుతాడు. పరిచయం స్నేహంగా మారుతుంది. డబ్బు సమాజానికి ప్రమాదకారిగా మారుతోందని చలపతి పోతప్పకు ప్రతిసారీ చెబుతూనే వుంటాడు. ఇది వింటూ వుంటున్న పోతప్ప చలపతికి రోంత తిక్కుందని అనుకునేవాడు. ఆర్నెలల్లో డబ్బు సంపాదించటం తెలుసుకొని పోతప్ప మూడుసార్లు పల్లెకుపోయి అప్పులో ఎనిమిది నూర్లు జమ చేసి వస్తాడు. పోతప్ప సంపాదన సంతృప్తికరంగా సాగుతున్న సమయంలో పోతప్ప చెల్లెలు బేరమ్మ మొగుడు పిల్లోల్లతో కలిసి అదే బ్రిడ్జీకిందకు చేరుతుంది. పోతప్ప బేరమ్మకు కూరగాయాలంగడి పెట్టిస్తే బేరమ్మ కూరగాలతోపాటు బజ్జీలు పోసి అమ్ముకుంటూ డబ్బును సంపాదిస్తూ ఇంటిల్లిపాదినీ పోషిస్తుంటుంది. బేరమ్మ మొగుడు అంజినప్ప తాగుబోతు, తిరుగుబోతు, జూదగాడు. కష్టపడి కుటుంబాన్ని పోషించే రకం కాదు. అంజినప్ప ఎప్పుడైనా కూలికెళ్తే వచ్చిన డబ్బుతో తాగి జూదమాడతాడే కానీ ఇంట్లో రూపాయి ఇవ్వడు.

పోతప్ప రెండు పొట్టేలు పిల్లల్ని కొనితెచ్చి బ్రిడ్జికింద మైదానంలో వదిలిపెడతాడు. పోతప్పలేని వేళ అంజినప్ప ఆ రెండింటిలో ఒకదాన్ని అమ్మేసి సారాయితాగి దారిలో మత్తుగా పడిపోయి దొర్లాడుతూ వుంటాడు. ఈ విషయం పసిగట్టిన పోతప్ప అంజినప్పను రక్తమొచ్చేలా కొడతాడు. ఇంతలో పోలీసులొచ్చి పోతప్పను, అంజినప్పను పట్టుకెళ్లి జైల్లో పెడతారు. తప్పు చేసిన అంజినప్పను సాయంత్రానికి వదిలేసి పోతప్పను మాత్రం రెండురోజులు జైల్లోనే వుంచుతారు. లచ్చుము వున్న పొట్టేలు పిల్లను కూడా అమ్మేసి, దాచిన సొమ్మును దానికి జతచేసి పోలీసులకు లంచమిచ్చి పోతప్పను విడించుకుంటుంది. బయటి కొచ్చిన పోతప్పకు ఇదంతా తెలిసి బాధతో రెండు సీసాల సారాయి తాగి బ్రిడ్జికి ఎదురుగా వున్న ఆర్.టి.ఓ. శంకరరెడ్డి కారు షెడ్డును ఊడపెరికి గొడవ చేస్తాడు. దీనికి కారణం బేరమ్మ వచ్చిన కొత్తలో ఆడనే తడికెల ఇంటిని ఏర్పాటు చేసుకుంటే శంకర్‌రెడ్డి దాన్ని పెరికేసి తనకు కారు షెడ్డును ఏర్పాటు చేసుకోవటమే. శంకరరెడ్డి పోలీసులతో అక్కడి కొస్తాడు. పోతప్ప పోలీసులకు చిక్కకుండా బంకాయన పోతప్పను తనబంకు వెనకాల దాచిపెడతాడు. పోలీసుల నుంచి పోతప్పను మళ్ళీ కాపాడటానికి ఇంట్లో వున్న చెంబు, చేట, తపేలా అన్నీ అమ్మి, ఆడాఈడా కొంత అప్పు చేసి పోలీసులకు మళ్ళీ లంచమిచ్చి లచ్చుము పోతప్పను కాపాడుకుంటుంది. పోతప్ప ఇల్లు అన్ని విధాలుగా ఖాళీ అవుతుంది. తిరిగి అప్పే మిగులుతుంది. అన్ని పోగొట్టుకొని అయోమయంలో పడిపోయి అనామకంగా మిగిలిపోతాడు. “తను ఎందుకు తాగాడో, ఎందుకు రౌడీతనం చేశాడో, ఎందుకు జైలుకెళ్ళాడో పోతప్పకి తెలియలేదు. ఇంతవరకు ఎందుకు కష్టపడి కండలు కరిగించుకున్నాడో, ఎందుకు షావుకారికి అప్పుగట్టాడో, దేన్ని మానం మర్యాద అన్నాడో కూడా అర్థం కాకుండా పోయింది” అన్న రచయిత్రి మాటలతో కథ ముగుస్తుంది.

“నీవు కూడా పోతప్ప! నీవూ నీలాంటి గొర్రెలూను, తాము ఏం చేస్తున్నారో తమకే తెలియని గొర్రెలు; డబ్బూ, అధికారం ఎక్కడుంటే వాళ్ళకు దణ్ణాలు పెట్టే గొర్రెలు: ఒక మంత్రి అరవై లక్షలు కట్నమిచ్చి కూతురు పెళ్ళి చేశాడు. ఒక ఆఫీసరు ఆరొందల జీతగాడు నెలకు రెండువేలు ఖర్చుపెడుతూ రెండొందల ఎకరాలు సంపాదించాడు. ఒక మామూలు పోలీసు అంతటి మేడ కట్టాడు అంటే ఆహా ఓహో అని ఆనందపడిపోయే గొర్రెలు...” కథలో రచయిత్రి చలపతి చేత చెప్పించిన మాటలివి. కథా కాలానికి నాయకుల, ఉద్యోగుల మన:ప్రవర్తులను డబ్బు లంచాలరూపంలో కొనేసి వారిని సమాజానికి కొరకరాని కొయ్యలుగా మార్చేస్తుందన్న ఆవేదన ఇక్కడ వ్యక్తమవుతుంది. ప్రజాసేవ పేరుతో కోట్లు సంపాదిస్తున్న మంత్రులు, ప్రభుత్వమిచ్చే నెలజీతం కన్నా పదిరెట్లు సంపాదించే ప్రభుత్వాధికారులు, సాధారణ జీతం తీసుకుంటూ రాచమేడల్లాంటి నిర్మాణాలు చేసే పోలీసులు కథా కాలానికి పేట్రేగిపోయినట్లు పై మాటలు చెబుతున్నాయి. ఇది సాధారణ విషయమే. ఇదేమీ కొత్తది కాదు. ఇలా సంపాదించే వారందరినీ ప్రశ్నించాల్సిన ప్రజలు వాళ్ళు చూపించే డబ్బుకో, అధికారానికో లొంగి పోయి సమాజాన్ని నిలువుగా దోచుకొనే వారికే వత్తాసు పలుకుతూ ఇంకా దోచుకోవటానికి వాళ్ళకు మరింత ప్రోత్సాహకమందించే ప్రజానికమొకటి తయారవుతోందనీ, అదే డబ్బు తయారు చేస్తున్న కొత్త సమాజమని కథా అంతరార్థం. ఇది రాజకీయ నాయకులకో, ప్రభుత్వ ఉద్యోగులకో పరిమితం కాకుండా సమాజంలోని సామాన్య, అతిసామాన్య ప్రజల వరకూ దిగజారి వారినీ ధనేష్టులుగా తయారు చేసి సమాజాన్ని అతి వేగంగా జనారణ్యంగా మార్చే దిశగా డబ్బు ప్రయత్నం సాగుతుందనే ఆవేదన కథ మొత్తం కనిపిస్తుంది. కథాంతర్భాగంగా రచయిత్రి మారుతున్న సమాజం గురించి చలపతితో ఇలా చెప్పిస్తుంది. పాలవమ్మే ఒంటికంటి గంగమ్మ ఒక ఎనుముని వాకిట ముందు కట్టేసుకొని పాలపాడి పాలు రోజుకు పదిహేను లీటర్లు

అమ్ముతూ పది రూపాయిల వడ్డీకి ఆరువేలు తిప్పుతాంది. పాలపొడి ప్యాకెట్లను దొంగతనంగా అమ్మిన పంతులమ్మ కొడుకు డాక్టరు సీటుకు ఐదువేల లంచమిచ్చింది. ఈ పాలుతాగి జబ్బు చేసిన బక్కపిల్లోని తండ్రి ఆసుపత్రికెళ్తే చికిత్స కోసం యాభైరూపాయలు లంచమడిగిన డాక్టరు బాతురూం గోడల్లో మూడు లక్షలు దాచుంటాడు. ఆసుపత్రి నుంచి బాగుపడి బయటపడిన బక్కపిల్లోడు పరీక్షల్లో కాపీరాస్తూ పంతులకు చిక్కి పంతుల్ని కొట్టి పారిపోయి దొంగనోట్లు, దొంగసారా కాచేవాళ్లతో చేరి పోతాడు. సారా తాగటానికి డబ్బుల్లేని పదిమంది పొరుగూరు మనిషిని చంపి డబ్బు దోచుకొని తాగి చీకటిలో ఒంటరిగా వెళ్తున్న ఆడపిల్లని చెరిచి చంపేస్తారు. కథా కాలానికి డబ్బు చేయిస్తున్న పనులివి. డబ్బు వ్యామోహంలో పడి మనిషి తన మూలాలను మరచి పోతున్నాడనటానికి ఈ మాటలే నిదర్శనం. పట్నం ఈ రకంగా తయారౌతున్న పరిస్థితుల్లో పోతప్ప కొత్తపేట బ్రిడ్జీకిందకి రిక్షాతొక్కి అప్పు కట్టాలని వస్తాడు. డబ్బు సంపాదించాలనే ఆరాటంతో బ్రిడ్జీ కిందికి చేరిన వాళ్లల్లో పోతప్ప ఒకడు.

పోతప్ప బ్రిడ్జీకిందికి వచ్చేటప్పటికి బ్రిడ్జీకిందున్న వ్యవహారమంతా డబ్బు మీదనే నడుస్తూ వుంటుంది. బ్రిడ్జీకిందున్న గోడగోడకీ పదడుగుల సందు. అక్కడికి "ఇల్లూ వాకిలీ లేని బీదా బిక్కి జనం ఆ సందుల్లో తడికలడ్డం పెట్టుకొని చదలపురుగుల్లా చేరిపోతారు". పగలంతా బంకులు, తడికెల ద్వారా వ్యాపారాలు చేసుకొని రాత్రివేళల్లో వాటి వెనకాల ఎవరికి తోచిన పనులు వారు చేసుకుంటూ డబ్బు సంపాదించటమే పరమావధిగా జీవిస్తుంటారు. వీళ్ళే కాదు కొంతమంది నెల, పదైదు, పదిరోజులు బ్రిడ్జీకిందకి వచ్చిపోతుంటారు. మరికొంతమంది అగస్మాత్తుగా వచ్చిపోతుంటారు. బ్రిడ్జీకింద చేరే జనం ఎందుకు వస్తారో? వెళ్ళిపోతారో? ఎవ్వరికీ తెలీదు. ఎవరూ ఎవర్నీ పట్టించుకోరు. డబ్బు మాత్రమే చూసే జనానికి మనుషుల ముఖాలతో పనుండదు అనటానికి బ్రిడ్జీకింద వాతావరణం సరితూగు తుంది. వీళ్ళే కాకుండా పనీపాట లేకుండా జూదంతో, తాగుడుతో ఏ పూటకాపూట సరదాగా జీవితాన్ని గడిపే కాటావాళ్ల వ్యవస్థొకటి అక్కడే తయారౌతూ వుంటుంది. డబ్బు వల్ల మారిపోతున్న సమాజమంతా బ్రిడ్జీకిందనే దర్శనమిస్తుంది. డబ్బు మోజుతో జనం పరుగులు తీస్తున్న రోజులవి. "న్యాయము తప్పక విద్యాధనములు గడించ వలెను" అనే చిన్నయసూరి మాటలకు ఈ కథ వికృత రూపం. డబ్బు కోసం మనుషుల్ని చంపటానికి కూడా వెనుకాడని మనుషులు తయారవుతున్న పరిస్థితులు అన్ని రంగాలలో సాలీడు గూళ్లలా సమాజమంతా అల్లుకపోయే సజీవ చిత్రాలను తెలుగు ప్రజలకు తెలియచేయటానికి వసుంధరాదేవి కథలో రెండు పాత్రలను సృష్టి చేసింది.

పల్లె వాతావరణంలో పుట్టిపెరిగి పట్నానికొచ్చిన చదువురాని పాత్ర పోతప్పది ఒకటైతే, పట్నంలో పుట్టి పెరిగి, పదవతరగతి వరకూ చదువుకొని స్వీపరు ఉద్యో గాన్ని వదిలేసొచ్చిన చలపతి పాత్ర రెండవది. జీవిత నేపథ్యాలు వేరైనా పోతప్ప, చలపతులు రిక్షాతొక్కి జీవించ టానికి బ్రిడ్జీకిందనే కలుసుకుంటారు. ఇద్దరి గురి డబ్బు సంపాదించటమే. అయితే పోతప్ప అప్పు కట్టాలని సంపాదిస్తే, చలపతి పెళ్లాం పిల్లోల్లని పోషించటానికి సంపాదిస్తుంటాడు. కాలం మారుతోందన్న విషయాన్ని గుర్తించలేని వ్యక్తులకు కనువిప్పు కలిగించటానికి రచయిత్రి పోతప్ప పాత్రను ఎంచుకొంది. కథలో ఇది ప్రధానపాత్ర. కథను నడిపిస్తూ కనిపిస్తుంది. కథలో పోతప్ప మూడు రకాలైన మానసిక మార్పులతో కనిపిస్తాడు. డబ్బు లోకాన్ని చెడగొడుతుందనే విషయాల్ని ఈ మూడు పరిణామ మూడు పరిణామదశల్లో మనం తడముకోవచ్చు.

"ఎరువుల కోసం, కూలోల్ల కోసం చేసిన అప్పులు తలచుకొని ఉరిపోసుక చచ్చిపోయాడు పెద్దాయన". తండ్రి చేసిన అప్పు చెల్లించి ఊర్లో తలెత్తుకుని బతకాలని పల్లె నుంచి పట్నం వచ్చి రిక్షాతొక్కటానికి బ్రిడ్జీకిందకు

చేరుకుంటాడు పోతప్ప. రక్తం ధారపోసి కండలు కరిగించైనా మానాభిమానాలతో డబ్బు సంపాదించి అప్పు కట్టాలనే దృఢచిత్తం పోతప్పలో కనిపిస్తుంది. ఇది మొదటి దశ. "బ్రిడ్జీకింది"కి చేరిన ఆర్నెళ్ల తర్వాత పోతప్పలో కనిపించేది రెండవ దశ. ఈ దశలో ఆర్నెలల్లో డబ్బును సులభంగా సంపాదించటం ఎలాగో తెలుసుకుంటాడు. "స్టోరువాళ్ళు రేషను కార్డులకివ్వకుండా దొంగగా అందించిన చక్కెర, గోదుమరవ్వా, మైదా, బియ్యం చురుగ్గా అమ్మిపారేసి లాభంలో వాటా పుచ్చుకుంటాడు. కాలనీలో వాళ్ళకి ఎన్నో విధాలా చిన్న సహాయాలు చేస్తూ మంచి నమ్మకస్తుడని పేరు తెచ్చుకున్నాడు. లాడ్జీలకి ఆడవాళ్ళను తీసుకెళ్తే ఎంత డబ్బు గుంజవచ్చో, బేరం అడగడం నామోషీ అయి ఎక్కువ డబ్బులు పారేసే మా రాజులెవరో కనిపెట్టాడు". ఇలాంటి పద్ధతులన్నింటినీ ఆర్నెల్లలోనే తెలుసుకొని డబ్బు సంపాదించి మూడుసార్లు పల్లెకెళ్లి ఎనిమిదినూర్లు అప్పులో జమచేసి వస్తాడు. "మాకు మానం మరేదా వుండేటోల్లవే" అనే అభిప్రాయంలో పట్నంపై వాలిని పోతప్ప డబ్బు కోసం అసాంఘిక కార్యక్రమాలు చేసే వారికి సహాయపడుతూ డబ్బును సంపాదించే స్థాయికి మారిపోతాడు. ఇలా సంపాదించటం తప్పని చెప్పిన చలపతిపై పోతప్ప "నువ్వు బతకలేవు. ఎవరన్నా బతుకుతుంటే ఊరుకోలేవు" అని నిష్ఠూరపడతాడు. తాను సంపాదించే తీరు మంచిదేనని సమర్థించుకుంటాడు. డబ్బు ప్రభావంలో మునిగి తేలుతున్న పోతప్పకు చలపతి ప్రతిసారీ చెప్పే నీతి మాటలు భరించలేక "ఎవరి తెలివి వారిది. ఎవరి బ్రతుకు వారిది. పేపరు చదివేవోల్లంతా వూరోల్లకి నేట్టులేదని అగుడుజేత్తాన్నారా? ఈయప్ప సావాసం చాలు సామియా" అనుకోని వారంరోజులపాటు చలపతికి ముఖం కూడా చూపంచడు. తన సంపాదనకు అడ్డుపడతాడనో, అప్పులు చేయటం అలవాటైన చలపతి తననెక్కడ డబ్బు అడుగుతాడేమోననో భయపడి పోతప్ప చలపతికి దూరమయినట్లు మనకు అర్థమవుతుంది. కొత్తపేటలో చేసిన అప్పులు చెల్లించలేక చలపతి అర్థరాత్రి అక్కడ నుంచి మకాం ఎత్తేస్తాడు. ఇది తెలిసిన పోతప్ప "లోకమంతా సెడిపోయిందని, మామ్మతు సెయ్యాలన్న కబుర్లు సెప్తాడు. ఆకరికి అప్పులు ముంచేసి వుపిచ్చికొని పోయినాడు" అంటూ తనను తమ్ముడిలా ఆదరించిన చలపతిని అర్థం చేసుకోకుండా ఎగతాళిగా మాట్లాడతాడు. తన వద్ద నాలుగు రూపాయి మిగిలుండటం వల్ల పోతప్ప చలపతి చేసిన మేలును, స్నేహాన్ని మరిచిపోయి గర్వంతో మాట్లాడతాడు. డబ్బు పోతప్ప చేత మాట్లాడించిన మాటలివి.

పోతప్ప రెండు పొట్టేలు పిల్లల్ని కొంటాడు. అందులో ఒకదాన్ని పోతప్ప చెల్లెలు మొగుడు అంజినప్ప అమ్మేసి సారాయి తాగొచ్చి వీధిలో పడి దొర్లుతుంటాడు. ఇది పసిగట్టిన పోతప్ప బేరమ్మ పాయికాడున్న కట్టెందుకొని "దరమరాజు వూర్కేయిచ్చినాడేమిరా...? పొట్టేలు పిల్లేదీ...? యాభై రూపాయిల కుర్రని పదిరూపాయిలకు ధార పోసినావురా....." అంటూ రక్తమొచ్చేలా చావబాదుతాడు. పోతప్ప డబ్బు మీద ఎంత మమకారాన్ని పెంచుకున్నాడో కథలో ఈ సంఘటనే ఋజువు చేస్తుంది. పోతప్పకు అంజినప్ప మీదున్న కోపం పొట్టేలు పిల్లని అమ్మినందుకు కాదు. యాభై రూపాయిలకు కొన్న పిల్లను పది రూపాయిలకే అమ్మినందుకు కోపం. పోతప్ప యాభై రూపాయలకు కొన్నపిల్లను పెద్దచేసి నూటాయాభైకి అమ్మాలనుకున్నాడు. ఈ లెక్క ప్రకారం పోతప్పకు నూటానలభై రూపాయిలు నష్టమొచ్చింది. ఈ ఉద్దేశ్యంతో పోతప్ప బావమరిదన్న బాంధవ్యాన్ని మరిచిపోయి జాలీ దయా లేకుండా, అంతా చూస్తుండగా, చెల్లెలు బతిమలాడుతున్నా అంజినప్పను చావచాదుతాడు. డబ్బు పిచ్చిలో వున్న ఏ మనిషికైనా మనాతనా, కన్నూమిన్నూ కనపరావనటానికి ఈ సంఘటనొక తార్కాణం. ఈ విధమైన పోతప్పను రెండవ దశలో చూస్తాం.

"కర్మాటపు ముండాకొడుకులు బాగుపడుతున్నారు; మానం మరేద అనుకునేవాళ్లంతా అడుక్కుపోతున్నారు. అవునా కాదా? ఎందుకు యిట్లా జరుగుతున్నదంటావు?

మీరు కాలం మారుతుందన్న విషయం అర్థం చేసుకోలేదు అందుకు". అన్న చలపతి మాటలు పోతప్పకు అర్థమైన దశ మూడవదశ. ఈ దశలో పోతప్పకు చలపతే ఆదర్శం. మిగిలిన పొట్టేలు పిల్ల, దాచుకున్న డబ్బు పోలీసులకిస్తే రెండురోజుల తర్వాత పోతప్ప జైలు నుంచి బయట పడతాడు. ఈ బాధను దిగమింగలేక రెండు సీసాల సారాయి తాగి ఆర్.టి.ఓ శంకరరెడ్డి కారుషెడ్డు పీకేస్తాడు. ఈ సందర్భంగా ఆచోద్యాన్ని చూడడానికొచ్చిన జనంతో పోతప్ప మాట్లాడిన మాటలు కథకు కొస మెరుపు. తాగిన మత్తులో బ్రిడ్జీని చూస్తాడు. మొదటది గొప్పగా కనిపించినా తర్వాత పేదలందరినీ చంపే భూతంలా కనిపిస్తుంది. పోతప్ప శంకరరెడ్డి కారుషెడ్డు పీకేస్తుంటే తన చుట్టూ చేరిన జనంలో నుంచి ఒక మనిషి "షెడ్డు వాళ్లది నీదెట్లా అవుతుంది" అన్న మాటలకు పోతప్ప "ఓరి ఎర్రి నాయలా నీదేంది? నాదేంది? ఆళ్ళదేంది? ఎవడిచేతికొత్తే ఆడిది సొమ్ము". కళ్లల్లోని నీళ్లు తుడుచుకున్నాడు. 'నేను రిచ్చాదొక్కి కట్టపడి సంపాయించుకున్న దుడ్లెయ్యి? నా పొట్టేలు పిల్లలెయ్యి? సెప్పు.... ముక్కు తుడుచుకున్నాడు. తన తెలివితేటలకి ఆశ్చర్యం, ఆనందం కలిగాయి పోతప్పకి. చలపతి జ్ఞాపకం వచ్చాడు. 'సాపకింద బురద నీల్లల్లె పరమారతా వుందిరా కొత్త పద్ధతి. నీ సాప నానిపోయి కుల్లుకంపు గొడతావుందిరా....నాయం నాయం అని నాయాలు సెప్తావుండావె. యాడిందిరా నాయం" అంటాడు. చలపతి తనకు చెప్పిన ఎన్నో మాటల సారాంశాన్ని పోతప్ప ఇలా చెబుతాడు. చలపతి తనకు చెబితే తాను సమాజానికి చెబుతాడు. కథలో రచయిత్రి చలపతిని అదృశ్యం చేసి ఆ లక్షణాలను పోతప్పకి ఆపాదించి ఇలా మాట్లాడిస్తుంది. పోతప్ప మారుతున్న సమాజాన్ని అర్థం చేసుకొన్న విధానం మూడవదశలో చూస్తాం. పోతప్పలోని ఈ దశలు మూడు విధాలైన సందేశాల్ని పాఠకులకందిస్తాయి. మనిషి డబ్బు కోరిక నుంచి బయటపడటానికి గొప్ప ప్రయత్నం చేసిన ఈ మూడు పరిణామ దశలు కథలను ఎంతో ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయి.

కథలో చలపతిది వైతాళిక పాత్ర. మనిషిని వేటాడే మనుషుల్ని డబ్బు తయారు చేస్తుందని గుర్తించిన పాత్ర. ఇతను యస్.యస్.యల్.సి. వరకు చదివింటాడు. చలపతి "సొంతభాష చదువుకున్న వాళ్ల పుస్తకాల భాషే. రాజకీయాల గురించీ, సమాజంలోని స్థితిగతుల గురించి ఉపన్యాస ధోరణిలో మాట్లాడటం అతనికి అలవాటు". అందుకే చలపతి సమకాలీన సామాజిక స్థితిగతుల గురించి పోతప్ప లాంటి వాళ్లకు చెబుతూ వుంటాడు. తాను నమ్ముకున్న సిద్ధాంతాల ద్వారా అమాయకుల్ని ప్రేరేపించి వాళ్లను సమకాలీన సమాజానికి అభ్యుదయవాదులుగా తయారు చేయాలన్న సంకల్పమే చలపతి జీవిత యాత్రగా కథ చెబుతుంది. చలపతి తండ్రి కళాశాలలో స్వీపరు కావటంతో ప్రిన్సిపాల్ కాళ్లా వేళ్లాపడి చలపతికీ అదే ఉద్యోగాన్ని ఇప్పిస్తాడు. చలపతి ఉద్యోగానికి వెళ్లిన ఐదు నెలల్లో రెండు ప్యూను ఉద్యోగాలు ఖాళీ పడితే ప్రిన్సిపాల్ వాటిని తన "ద్రాక్ష తోటలో ఆర్నెల్లనుండే ఉచితంగా పని చేస్తున్న వాడికి ఒకటి ఇచ్చేరు. మూడు వందలు లంచమిచ్చిన వాళ్ళకు రెండోది యిచ్చారు". ఇది నచ్చని చలపతి ప్రిన్సిపాల్‌ను ఘాటుగానే ప్రశ్నిస్తాడు. ఇద్దరికీ మాటామాటా పెరిగి ఉద్యోగానికి రాజీనామా ఇస్తాడు. అన్యాయం సహించలేని అభ్యుదయ భావజాలాలు చలపతిలో ఈ సందర్భంగా స్పష్టమౌతాయి. డబ్బు వ్యామోహంతో సమాజం నాణ్యతను కోల్పో తుందనీ, మేధావులను, కష్టపడేవారిని దూరం చేసు కుంటుందని పోతప్ప వద్ద వాపోతాడు. సమకాలీన పరిస్థితులను మన కళ్లముందుంచుతూ "ఇప్పటి పరిస్థితుల్లో నిజంగా పని చేసేవాడికి గుర్తింపులేదు. సమాజం వాళ్ళ మీద ఆధారపడి నడవటం లేదు. పని చేసేవాడు బ్రతకలేక బాధపడుతూ వుంటే, సోమరులూ మోసగాళ్ళు అవినీతిపరులూ యింకా యింకా సంపాదించేద్దామన్న మోసాల కుమ్ములాటలో కష్టపడే వాళ్ళని పురుగులకంటే హీనంగా నలిపేస్తున్నారు". ఈ విషయాల్నే చలపతి పోతప్పతో మార్చి మార్చి కథలో తాను

కనిపించేంత వరకూ చెబుతూనే వుంటాడు. కథలో మరోచోట సామాన్యుల జీవితం గురించి చెబుతూ "సామాన్య మానవులు అవినీతి చేతిలో ఆటబొమ్మలై ఆత్మావిశ్వాసం కోల్పోయి బియ్యం మూటలోని తుట్ట పురుగుల్లాగ దొంగ బతుకులు బతికేస్తున్నారు" అంటాడు. ఈ డబ్బు పిచ్చి పాలనలో సామాన్యుల జీవితం మరీ దుర్భరంగా మారిపోతుందన్న ఆవేదనను ఎల్లకక్కుతాడు. ఇలాంటి భావజాలాలున్న చలపతి డబ్బు దాడికి తట్టుకోలేక, అడ్డదిడ్డంగా డబ్బు సంపాదించలేక, జీవితంతో రాజీపడలేక నిలపరమున్న చోటల్లా అప్పులు చేసి ఆర్నెల్లకొకసారి అర్థరాత్రి ఎవరికీ చెప్పకుండా అక్కడ నుండి పారిపోతూ వుంటాడు. శృతిమించిపోతున్న డబ్బు పిచ్చి వల్ల సామాజిక వ్యవస్థలో ఆదర్శభావజాలాలతో సమాజాన్ని ఉద్ధరించాలనే వ్యక్తులకు, సిద్ధాంతాలకు కాలం చెల్లుతోందని చెప్పటానికి చలపతి పాత్ర ఒక నిదర్శనం. కథలో చలపతి పాత్ర వేసే ప్రతి అడుగులో, మాటలో ఆర్. వసుంధరాదేవి భావజాల ప్రతిరూపమే పాఠకులకు కనిపిస్తుంది.

"మానవుడే ధనమన్నది సృజియించెనురా. దానికి తానే తెలియని దాసుడాయరా" అన్న ఆరుద్ర మాటల్ని అక్షరబద్ధం చేసిన కథ 'బ్రిడ్జీకింద'. డబ్బు మానవ సమాజంలోకి అడుగుపెట్టి, వ్యాపించి అతివేగంగా మనిషిని రూపాత్మపరంగా నాశనం చేసేలా తయారవుతోంది. ఈ దుస్థితినే మనిషి ప్రోత్సహిస్తున్న కొత్త పద్ధతిని దృశ్యీకరించే ప్రయత్నమే ఈ కథా సారాంశం. పోతప్ప, చలపతుల జీవిత గమనాలే దీనికి సాక్షీభూతాలు. మహోన్నతమైన మనిషి జీవన విధానం డబ్బు వ్యామోహంలో పడి తన అస్తిత్వాన్ని కోల్పోకుండా వుండాలన్నదే రచయిత్రి ఆశయం. డబ్బు తప్ప మనిషి అవసరమే అనవసరం అనే డబ్బు పిచ్చోల్లను చెప్పుదెబ్బ కొట్టిన కథ ఇది. నిర్భయంగా చెప్పాలంటే కాలాన్ని మించిన కథ కూడా.

**ఆధార గ్రంథాలు :**

1. చిన్నయసూరి - నీతి చంద్రిక.
2. ఆరుద్ర - లక్ష్మీనివాసం సినిమా పాట.
3. బ్రిడ్జీకింద - ఆర్. వసుంధరాదేవి.

❖❖❖

# రంగాచార్య సంప్రదాయ రచనల్లో అభ్యుదయ దృక్పథం

- డా॥. కె.డి.డి మృణాళిని

డా॥ దాశరథి రంగాచార్య మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో జన్మించాడు. ప్రముఖ కవి డా॥ దాశరథి కృష్ణమాచార్య ఈయన సోదరుడు. రంగాచార్య తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొన్నాడు. ఉపాధ్యాయునిగా, గ్రంథాలయ నిర్వాహకునిగా, సికింద్రాబాద్ పురపాలక శాఖలో పనిచేశాడు. ఈయన విశిష్టమైన నవలలు రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు. నాలుగు వేదాలను, పది ఉపనిషత్తులను తెలుగులోకి అనువదించాడు. రామాయణ, భారత, భాగవతాలను సరళ వచనంలో రాశాడు. తెలంగాణ జనజీవనం, రైతాంగ పోరాటం వంటి అంశాల నేపథ్యంగా ఈయన రచనలు ఉన్నాయి. తెలుగు నవలలో 'పాత్రోచితయాస'ను మొదటగా ప్రవేశపెట్టాడు. వీరి రచనలు ఇతర భారతీయ భాషలలోకి అనువదింపబడ్డాయి, చలన చిత్రాలుగా వచ్చాయి. ఈయన రాసిన 'చిల్లర దేవుళ్ళు' నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈయన రచనాశైలి పాఠకుడిని ఆకట్టుకొంటుంది.

సుప్రసిద్ధ నవలా రచయిత వచన రామాయణ, భాగవతాల గ్రంథకర్త, మహాకవి దాశరథి సోదరులు శ్రీ రంగాచార్య ఖమ్మంజిల్లా గార్ల గ్రామానికి చెందినవారు. ప్రాథమిక విద్యాభ్యాసం ఖమ్మంలో జరిగింది. నైజాం నిరంకుశ పాలనలో ప్రజలకండగండ్లను యథాతథంగా చిత్రిస్తూ అనేక పత్రికలకు వ్యాసాలు వ్రాసారు. తెలంగాణ విముక్తి పోరాటంలో పాల్గొని జైలు శిక్షను అనుభవించారు. స్వాతంత్ర్య సమరయోధులు.

తెలంగాణలో అప్పటి దొరలకాలం నాటి జీవితాన్ని చిత్రిస్తూ శ్రీ రంగాచార్య వ్రాసిన "చిల్లర దేవుళ్లు" నవల అనేక బహుమతులు పొందింది. అనేక ఇతర భాషల్లోకి అనువదించబడింది. చలనచిత్రంగా రూపొంది బహుళ జనాదరణకు పాత్రమైంది. ఈ సినిమాకు స్క్రిప్టు కూడా శ్రీ రంగాచార్య వ్రాసారు.

"మోదుగుపూలు", "జనపదం", "రానున్నది ఏది నిజం", "మానవత", "పావని" వీరి ప్రసిద్ధ నవలలు. శ్రీ రంగాచార్య బహు భాషావేత్త. ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలనుండి పెక్కు గ్రంధాలను తెలుగులోకి అనువదించారు. 40కి పైగా గ్రంథాలు రచించారు. ఆకాశవాణిలో వీరి అనేక నాటికలు ప్రసంగాలు ప్రసారమయ్యాయి. సంస్కృత రామాయణ, భాగవతాలకు వీరు చేసిన అధికారిక సరళ వచనానువాదాలు పెక్కు ముద్రణలు పొందాయి.

శ్రీ రంగాచార్య రచించిన సాహిత్య వ్యాసాలసంపుటి, కులతత్వ విషపరిణామాలను చిత్రించిన "శరతల్పం" నవల, ప్రేమ చంద్ జీవిత సాహిత్యం అనే విమర్శనాత్మక గ్రంథం ఆయన నిశిత పరిశీలనా దృష్టికి నిదర్శనంగా ఉన్నాయి.

శ్రీ రంగాచార్య ఈ దేశ భవిష్యత్తును ఊహిస్తూ వ్రాసిన "రానున్నది ఏది నిజం?. విమర్శకుల ప్రశంసలు పొందింది. వీరి కలం నుంచి జాలువారిన "జీవన యానం". వేదం - జీవనాదం, అమృతంగమయ, ఆంధ్ర సాహితీ ప్రియులను విశేషంగా ఆకర్షించాయి. వీరు 2015లో కీర్తిశేషులైనారు.ఇంతవరకూ ఎవరూ వేదాలను సామాన్యప్రజలకు అందించాలని సంకల్పించలేదు.

'ప్రజలకు వేదం' అనే నినాదంతో సాహసించిన అద్వితీయుడు అక్షరవాచస్పతి. సాంప్రదాయ సంకెలలు త్రెంచి నాలుగు వేదాలను తెలుగు వెన్నెల వచనంలో అనుసృజించిన ఆద్యుడు దాశరథి.

ఇంకనూ రెండు బ్రాహ్మణాలు-పది ఉపనిషత్తులు-రెండు రామాయణాలు-భారతం-హరివంశం-భాగవతం సవ్యాఖ్యానంగా అనుసృజించిన అక్షరశిల్పి రంగాచార్య.

సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలతో సన్నిహిత పరిచయం గల అక్షరవాచస్పతి అన్ని భాషల నుండి అనుసృజించారు. సాహిత్య ప్రక్రియలన్నింటిలో వీరి ముద్ర కనిపిస్తుంది. దాపరికంలేని నిరాడంబర జీవితం, అక్షరమే వారి సంపద. దాశరథి రంగాచార్య ప్రస్థానం విప్లవం నుంచి వేదం వరకు సాగుతున్నది.

రంగాచార్య మార్క్సిస్టు దృక్పథం కలిగిన రచయిత. సమాజ గమనాన్ని సునిశితంగా పరిశీలిస్తుంటారు. దేశాల ఆర్థిక గమనం, ప్రజల జీవిత విధానం, అవి వెళుతున్న దారులు ఆయన నిశితంగా గమనిస్తారు. 1990ల తర్వాత ప్రబలిన ప్రపంచీకరణ సంస్కృతి భారతదేశానికి కూడా పాకడం ఆయన గమనించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ బ్యాంకులు దేశాలను చావనివ్వవు, బతకనివ్వవు. దేశాలు కట్టుబానిసలుగా, నిర్జీవంగా జీవిస్తున్నాయి అంటారు రంగాచార్య. ఆ విష సంస్కృతి యమవేగంతో పరుగెత్తుతున్నది. బోర్లపడక తప్పదు. అది నిశ్చయం. అప్పుడు వెన్ను తట్టవలిసింది, చేయూత నివ్వాల్సింది, లేపాల్సింది, మానవామృతం మానవామృతం చిలకవలిసింది భారత తాత్త్వికతయే అంటారు. ప్రపంచీకరణ పరిణామాలవల్ల మేలు కన్నా కీడే ఎక్కువగా ఉంటుందని గ్రహించారు. ఆ రాక్షస సంస్కృతి వెంట మృత్యు ముఖంలోకి పయనించే మనుషులను అమృతం వైపు నడిపించగల శక్తి, సర్వకాలికమైన సత్యాలను, విశ్వజనీనమైన మానవతా వాదాన్ని ప్రతిపాదించిన ఒక్క భారతీయ ఆధ్యాత్మికతకే ఉందని గ్రహించారు. ఈ నేపథ్యంలో ఆయన దృష్టి వేద సాహిత్యం వైపు మళ్లింది. 'ప్రజలకు వేదం' అన్న నినాదంతో ముందుకు సాగారు. యుగాలుగా కొందరికే పరిమితమైన వేదాన్ని సులభశైలిలో, తేటతెలుగు వచనంలో అందించారు.

వేద సాహిత్యం.. అది అందించే విలువల గురించి రంగచార్యగారికి నిశ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. వేద వాఙ్మయం, సంప్రదాయ సాహిత్యసారం అంతా ఒక్కటే. అది మనిషిని మనీషిగా మలుస్తుంది. 'వసుధైక కుటుంబ భావనను ప్రచారం చేస్తుంది. భారతజాతి వేల సంవత్సరాలుగా ఇదే నాగరికతతో వర్ధిల్లింది. భారతీయ నాగరికత ఔన్నత్యాన్ని విదేశీ పండితులు సైతం కొనియాడారు. అయితే ఆధునిక కాలంలో ఆ సంస్కృతి నిర్లక్ష్యానికి గురైంది. పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మనిషి యంత్రంలా మారిపోయాడు. ఈ పరిస్థితుల్లో మానవతకు చోటే లేకుండా పోయింది. సర్వమానవ అభ్యుదయాన్ని కాంక్షించే వేద సాహిత్యాన్ని ఒక వర్గం వారికీ పరిమితం చేశారు. అభ్యుదయ దృక్పథం కలిగిన రంగాచార్య వేద సాహిత్యానికి అంటుకున్న వర్ణత్వాన్ని తొలగించి వాస్తవాల్ని అందించారు.

వేదాన్ని దర్శించడానికి వేద దృష్టి కావాలి. హ్రస్వ దృష్టి అన్య దృష్టి చాలవు. పరిమిత దృష్టితో అపరిమిత వేదాన్ని దర్శించడం కువ్యాఖ్యానం అవుతుంది. భారత వేదాన్ని భారత కొలమానంతో కొలవాలి. పాశ్చాత్య కొలమానాలు అందుకు పర్యాప్తములు కావనే రంగాచార్య.. భారతీయ కొలమానంతో విశాలమైన ఆధునిక భావాలతో నాలుగు వేదాలు, పది ఉపనిషత్తులు, రెండు బ్రాహ్మణాలు, రెండు రుగ్వేద పరిచయ గ్రంథాలను వచనానువాదం చేశారు. వేదానువాదంలోనూ నిగూఢార్థాలను విప్పి చెప్పేందుకు, వేద విషయాలను ఆధునిక దృక్పథంతో పాఠకులకు అవగతం చేసేందుకు 'ఆలోచనామృతం' పేరుతో వ్యాఖ్యానం అందించారు. వేదాల వ్యాఖ్యానంలోనూ ఆయనల్లోని ఆధునికత దర్శనమిస్తుంది. "జలముల మధ్య అమృతము ఉన్నది. జలముల మధ్య ఔషధములున్నవి. ఋత్విజులారా.. జలప్రాశస్త్యము చాటండి. (ఋ.1.23సూ) అంటుంది వేదం. నీటికి సంబంధించి అద్భుతమైన వివరాలు వెల్లడించింది. ఈ మధ్య ప్రచారం పొందిన జలచికిత్స (వాటర్ థెరపి) ఋగ్వేదంలో కనిపిస్తుంది అంటారు. ఋగ్వేదం ప్రథమ మండలం 116వ సూక్తి నుంచి మంత్రాల్లో కథాకథన విధానం ప్రారంభం అయింది. అది కథకు బీజం వంటిది.

అక్కడ ప్రారంభమైన కథ పాయలు, నదులు, మహానదులుమారి ఇప్పుడు సముద్రమంతా అయినది అంటారు. వ్యాఖ్యానం నిండా ఇలాంటి అంశాలు కోకొల్లలుగా ఉంటాయి. అవన్నీ ఆయన ఆధునిక దృక్పథానికి మచ్చుతునకలు.

వేద చతుష్టయంలో ఋగ్వేదం ప్రధానమైనది. సంహితా సర్వస్వంలో ఋగ్వేదమే సగభాగం ఆక్ర మిస్తుంది. సామవేదంలోని సూక్తాలన్నీ ఇంచుమించుగా ఋగ్వేదంలోవే. అథర్వ వేదంలో సుమారు 1200 వరకు ఋగ్వేద సూక్తాలే మరల వినిపిస్తాయి. యజుర్వేదంలో కూడా ఋగ్వేద మంత్రాలెన్నో గోచరిస్తాయి.

సామవేద మంత్రాలు కేవలం దేవతలను స్తుతిస్తాయి. వారి గుణగణాలను వర్ణిస్తాయి. ఉపాసకులకు శాంతి సౌభాగ్యాలను అర్థిస్తాయి. సామవేదంలో యజ్ఞయాగాది క్రతు నిర్వహణ విధి పశుహింస మొదలైనవి కనిపించవు. ఇది అసింహావిధిగా, కేవలం ఉపాసనగా కనిపిస్తుంది. నాలుగు వేదాల్లోనూ పరిమాణంలో అతి చిన్నది సామవేదం. పరిమాణంలో చిన్నదైనా ప్రభావంలో ఉత్కృష్ట మైనదే. "అథో సర్వేషాం ఏష వేదానాం రసోయత్ సామ"- సామవేదంలోని మంత్రాలు నూటికి 95 పాళ్ల వరకు ఋగ్వేదం నుండి గ్రహించినవే.

"అనంతావై వేదా:" అన్న వాక్యం ప్రకారం వేదం అనంతమైనది. మొదట ఒకే రాశిగాఉన్న వేదాలను వ్యాస మహర్షి నాలుగు వేద సంహితలుగా కూర్చాడు. ఛందోబద్ధాలైన మంత్రాలను ఋగ్వేదంగా, గద్యాత్మక మైన మంత్రాలతో కొన్ని ఛందోబద్ధాలైన పద్యాత్మకంగా ఉన్న మంత్రాలను చేర్చి యజుర్వేదంగా, గేయాత్మకమైన మంత్రాలను సామవేదంగా, ఈ త్రయీ భిన్నమైన మంత్రాలన్నింటిని అథర్వ వేదంలో చేర్చాడు. వ్యాసుడు ఈ నాలుగు వేదాలను వరుసగా తన శిష్యులైన పైల, వైశంపాయన, జైమిని, సుమంతులనవారిచే చదివిం చాడు. తిరిగి వారి శిష్య ప్రశిష్యులచేత పఠించబడినవి. కాలాంతరంలో ఈ అధ్యాతృభేదముచేత వేదం వేలాది శాఖలుగా విస్తరించింది. పతంజలిని అనుసరించి ఋగ్వేదానికి 21, యజుర్వేదానికి 100, సామవేదానికి 1000, అథర్వ వేదానికి 9 శాఖలు వెలిశాయి. కాని నేడు మనకు ఋగ్వేదశాఖ ఒకటి, యజుశ్శాఖలు ఐదు, సామవేద శాఖలు మూడు, అథర్వశాఖలు రెండు, మొత్తం కలిసి 11 శాఖలు మాత్రమే లభ్యం. ''మంత్ర బ్రాహ్మణాత్మకో వేద:" ఇత్యాది వాక్యాలను అనుసరించి ప్రతి వేదం, సంహిత, బ్రాహ్మణము, అరణ్యకము, ఉపనిషత్తులు అను నాలుగు అంగాలుగా గ్రహించబడు తుంది. వీటితోపాటు ప్రతి వేద శాఖకు ప్రత్యేకంగా ప్రాతిశాఖ్యలు, శ్రోతసూత్రాలు, గృహ్యసూత్రాలు మొదలైన వాఙ్మయం ఉంటుంది.

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం ఇవి కేవలం మంత్ర సంహితలు మాత్రమే. అంటే ఇందులో మూల మంత్రాలే ఉంటాయి. మూల మంత్రాల వ్యాఖ్యానం, యజ్ఞ యాగాలలో వాటి విని యోగం బ్రాహ్మణాలలో తెల్పబడింది. మంత్రాత్మకమైన వేదం బ్రహ్మ అనబడుతుంది. దానికి సంబంధించిందే బ్రాహ్మణం.

రంగాచార్య సంప్రదాయ సాహిత్య సృజన ఉబుసు పోక, పారాయణం కోసం మాత్రం చేసింది కాదు. ఆయన రాసిన అన్ని గ్రంథాలు ఉద్గ్రంథాలే. అవి ఆయా కథలను అందిస్తూనే పాఠకుల మెదడుకు పదును పెట్టే ఆలోచనలు రెకెత్తిస్తాయి. అన్ని గ్రంథాలకు "ఆలోచనా మృతం" పేర ఆయన రాసిన వ్యాఖ్య, ఆయా గ్రంథాలను నూతన దృక్పథంతో పాఠకులకు పరిచయం చేస్తుంది. మానవత, మానవ సంబంధాలు కనుమరుగై పోతున్న నేటి రోజుల్లో ఆ గ్రంథాల అవసరం, అవి బోధించే విలువలు, వాటి నుంచి నేటి తరం నేర్చుకోవాల్సింది, ముందు తరాలకు అందించాల్సింది, ఇలా అన్ని అంశా లను కథానుగుణంగా చెప్తారు. రంగాచార్య సంప్ర దాయాన్ని అభిమానించినా, అదే సమస్తం అని భావించరాదు అంటారు. ''నాకు సంప్రదాయ

సాహిత్యంతో అనుబంధం ఉంది. అభిమానం ఉంది. అది అభ్యుదయానికి - విప్లవానికి-ఆధునికతకు వ్యతిరేకం అని నేను భావించను. మన వారసత్వాన్ని మనం గౌరవించాలి. అంతేగానీ, అదే సమస్తం అని భావించ రాదు. సంప్రదాయ సాహిత్యంతో ఎవరినో సాధించగలం అనుకోవడం బూటకం" (జీ.459) అంటారు. వేదాల్లో చెప్పిన కర్మకాండకు ప్రాధాన్యత కల్పించి, మూల సూత్రాలను మృగ్యం చేసేందుకు నాటి నుంచి నేటి వరకు నిరంతర ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయం టారు రంగాచార్య. ఆ ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు, సంప్రదాయాన్ని అభ్యుదయ దృక్పథంతో ఆవిష్కరించి ఒక నూతన సంప్రదయానికి నాంది పలికారు రంగాచార్య. సంప్రదాయ సాహిత్యం, మార్క్సిస్టు దృక్పథాలను మేళవించి తనదైన మానవతా దృక్పథంతో, భారత నాగరికత బోధించే 'వసుధైక కుటుంబం' భావన లక్ష్యంగా రచనా యాత్ర సాగించారు రంగాచార్య.

దాశరథి రంగాచార్య అనగానే 'చిల్లరదేవుళ్లు' నవల గుర్తుకు వస్తుంది. కాని వారు నవలా రచనకు పూను కోవడానికి చాలా కాలం ముందే రామాయణం రాశారు. రామాయణం గురించిన అధ్యయన పరిశీలనలు వారి కుటుంబంలో చాలా జరిగాయి. అంతచిన్నతనంలోనూ రామాయణ కథ వారిపై ఎంతో ప్రభావం వేసింది. వారి తల్లిగారు మరణించిన తర్వాత మరో సారి రామాయణాన్ని ధ్యానంగా చదివారు. భాగవతం తెలుసుకోవడానికి భక్తి, భారతం తెలుసుకోవడానికి యుక్తి, రామాయాణం తెలుసుకోవడానికి భక్తి, యుక్తులతోపాటు శక్తి కూడా ఉండాలంటారు రంగాచార్య. అంతటి శక్తి ఆయనలో ఉంది కాబట్టే, వారు రాసిన రామమాయణం.. విశ్వనాథ సత్యనారాయణలాంటి ఉద్ధండులు, విమర్శకుల మన్ననలు పొందింది. వారు రాస్తున్నది భారతీయ తాత్త్వికతకు ప్రతిబింబమైన రామాయణ గ్రంథమే అయినా.. రచనలో ఆధ్యాత్మిక దృష్టికన్నా, విమర్శనాత్మక దృష్టి అధికంగా కనిపిస్తుంది. వాల్మీకి రామాయణాన్ని అనుసరిస్తూ.. తర్వాత కాలంలో చేరిన కల్పనల గురించి వివరిస్తూ.. ఆయా ఘట్టాలకు వ్యాఖ్యానం అందిస్తూ రచన సాగించారు. ఆయన వ్యాఖ్యానం పాఠకుడిలో విమర్శ నాత్మక పరిశీలనాదృష్టిని పెంపొందిస్తుంది.

రామాయణం తర్వాత 'శ్రీమద్భాగవతము' రాశారు. సంస్కృత భాగవతాన్ని అనుసరించి రాసినా.. చాలా చోట్ల పోతన పద్యమాధుర్యాన్ని పాఠకులకు యథాతథంగా అందించారు.

మనిషి ఒక చోటునుంచి వచ్చినాడు. మరల అచ్చటికే చేరుచున్నాడు. అందరను అచటికి చేరుకొనవవలసినవారే. పోయినవారి కొరకు ఏడ్చుట ఎందులకు?. (పే.250) ఇలాంటి ఉదాహరణలు భాగవతం నిండా కనిపిస్తాయి. సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్ర, నృసింహావతారం, అష్టమస్కంధంలోని గజేంద్రమోక్షం, శ్రీకృష్ణుని లీలల వర్ణించే దశమ స్కంధం పూర్వోత్తర భాగాలలో రంగా చార్యపై పోతన భాగవత ప్రభావం కనిపిస్తుంది.

కథలో అత్యంత ముఖ్యమైన భావాలను పాత్రలచేత చెప్పిస్తారు రచయితలు. అయితే శ్రీమద్భాగవతంలో పాత్రల సంభాషణలు ఆద్యంతం అనేకం ఉంటాయి. రంగాచార్య ప్రత్యేకతల్లో ఇది కూడ ఒకటి. రచయిత కథ చెప్పడం వల్ల, పాఠకుడికి, కథకు మధ్య రచయిత ఉంటాడు. అలా కాకుండా స్వయంగా పాత్రలచేత మాట్లాడించడం వల్ల పాఠకుడు కథలో లీనం అవుతాడు. దీనివల్ల పాఠకుడు మరింత ఆనందానుభూతికి లోనవు తాడు. ముఖ్యమైన సన్నివేశాలు, ధార్మికమైన విషయాలు, సందేశాత్మకంగా ఉండే సంభాషణలు, ఉపన్యాస ధోరణిలో ఉండే సంభాషణలు, తదితర సందర్భాల్లో రంగాచార్య తాను పక్కక తప్పుకుని పాత్రలను ప్రవేశ పెడతాడు. అలా పాత్రల సంభాషణలు, ఉపదేశాలు, బోధనలు చదివినప్పుడు కథార్థాన్ని ఇస్తూనే, పాఠకులకు ప్రత్యేకమై సందేశాన్ని అందిస్తాయి.

రంగాచార్య రచించిన శ్రీమద్భాగవతం, భక్తి కావాలను కునేవారికి భక్తిని, ముక్తిని కోరుకునేవారికి ముక్తిని,

రసజ్ఞులకు రసానందకరంగా, విమర్శనాత్మకంగా అధ్యయనం చేయాలనుకునేవారికి ఆయువుపట్టుగా, ఇలా అన్ని రకాలవారికి అనువుగా ఉంటుంది.

రామాయణాన్ని 'సీతాచరితం' పేరుతో మరోసారి అందించారు. సీతాయాశ్చరితం.. అంటే రామాయణం సీత కథ. వాల్మీకికి సీత పాత్ర అంటే మహా ఇష్టం అంటారు రంగాచార్య. అందుకే వాల్మీకి రాముడు లేకుండా కేవలం సీతతోనే సుందరకాండ తీర్చిదిద్దారు అంటారు. "వాల్మీకి రామాయణం ఎందుకు రాశాడు పెద్ద ప్రశ్న?" అంటూ తానే ప్రశ్న వేసుకుని సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. ఆనాడు సమాజం అస్తవ్యస్తమైంది. భార్యాభర్తల మధ్య అనురాగ బంధం లేదు. బహుభార్యత్వంతో అది తెగేలా ఉంది. తండ్రీ కొడుకుల మధ్య వాత్సల్యం తరిగింది. అధికార దాహం వారిని క్రూరులను చేసింది. వారిలోవారికి వైరం తెచ్చింది. కుటుంబ వ్యవస్థకు చెడు దాపురించింది. ఈ నేపథ్యంలో ఒక ఆదర్శవంతమైన శాంతియుత సమాజాన్ని దర్శింపజేసేందుకు వాల్మీకి రామాయణం రాశాడు అంటారు. రంగాచార్య దృష్టిలో రాముడు దేవుడు కాదు మనిషే. అందుకే రామాయణం మనిషి కథ. మనకథ. మనందరి కథ అంటారు.

రంగాచార్య రచనా శైలి పాఠకులను ఆకట్టు కుంటుంది. ఏది చెప్పినా హృదయానికి హత్తుకునేలా చెప్తారు. కిష్కింధకాండలో వాలీ సుగ్రీవుల కథను వ్యాఖ్యానిస్తూ.. "తన్ను వరించిన రాజ్యాన్ని కాదని మునివేషంలో నందిగ్రామంలో ఉంటున్నాడు ఒక తమ్ముడు - భరతుడు. శత్రు రూపంలో ఉన్న అన్నను వధించమంటున్నాడు ఒక తమ్ముడు - సుగ్రీవుడు. రాజ్యం ఇస్తామన్న వద్దని అడవుల్లో ఇడుములపాలు అవుతున్నాడు ఒక అన్న రాముడు. తమ్ముడి రాజ్యాన్ని, పెళ్ళాన్ని లాక్కుని కులుకుతున్నాడు ఒక అన్న వాలి" ఇలా ఆలోచనాత్మకంగా సాగుతుంది.రంగాచార్య వ్యాఖ్యానం.

రామాయణం తర్వాత మహాభారతము రాసేందుకు ఉపక్రమించారు. రచన ప్రారంభించిన కొద్ది కాలంలోనే కుటుంబం కష్టాలపాలయింది. భారత రచన ఒక్కరే పూర్తి చేయలేరనే అపవాదు ఒకటి ఉంది. దాంతో రంగాచార్య భారత రచన పక్కన పెట్టారు. చాలా రోజుల తర్వాత మళ్లీ రచన ప్రారంభించి హరివంశ సహితంగా మహా భారతం పూర్తి చేశారు. ఆలోచానమృతం పేరుతో వ్యాఖ్యానం అందించారు.

మానవతకు పెద్దపీట వేసే రంగాచార్య వేద విజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులో ఉంచేందుకు కంకణం కట్టుకున్నారు. వేద సారస్వతాన్ని ఒకటి తర్వాత ఒకటిగా తేట తెలుగు వచనంలో అందించారు. వేద సారాన్ని గ్రంథాలుగా మలిచారు. రాక్షస సంస్కృతివైపు పరుగులు తీస్తున్న ప్రపంచం, భారతీయ జ్ఞాన చింతనకు మోకరిల్లే కాలం అతిదగ్గరలో ఉందని అభిలషించారు.

**ఆధార గ్రంథాలు :**

1. దాశరథి రంగాచార్యులు - రచనలు - విశాలాంధ్ర ప్రచురణలు హైదరాబాదు - 2001.
2. కొడాలి లక్ష్మి నారాయణ - వాల్మీకి రామాయణ విమర్శనం -1999.
3. శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత - ప్రథమ సంపుటం తిరుమల తిరుపతి దేవస్థానం, 1981.

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 02, February 2024
భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# జి. మేరీకృపాబాయి కథానీరాజనం - సామాజికత

- యలమర్తి సునీత,
తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
బుట్టాయిగూడెం, ఏలూరు జిల్లా.

- డా॥. కె . బలరాం,
అతిథి అధ్యాపకులు, తెలుగు మరియు ప్రాచ్య భాషా
విభాగం,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

**పరిచయం :**

ఏ భాషలో వున్నా ఏ రూపంలో వున్నా సాహిత్యం వల్ల సామాజిక ప్రయోజనం చేకూరిందా లేదా అన్నదే మన ముందున్న చర్చ. సాహిత్యమనేది కథ, కవిత్వం, గేయం, నవల, నాటిక, నాటకం, గల్పిక, ఏకాంకిక, ఏకపాత్ర, గద్యం, పద్యం మొదలైన రూపాల్లో ఉం టుంది. ఏ రూపంలో ఉన్నా దానివల్ల సామాజిక ప్రయోజనం జరిగిందా లేదా అన్నదే ప్రశ్న. సాహిత్యమనేది సమాజంలోని అన్ని పార్శ్వాల్నీ స్పృశించగలగాలి. సమాజంలోని అసమానతల్నీ, వైకల్యాల్నీ పాఠకులది మనోఫలకంపై ఆవిష్కరింపచేయాలి. సమాజం కుళ్ళను ప్రక్షళన చేసేదిగా ఉండాలి. అవసరమైతే సమాజం దశాదిశా మార్చేదిగా ఉండాలి. అటువంటి సాహిత్యం ద్వారానే సామాజిక ప్రయోజనం చేకూరుతుంది. సాహిత్యం, సమాజం కంటికి కనిపించే వస్తువులు. అయితే ప్రయోజనమనేది సాహిత్యం నుంచి సమాజానికి అంతర్వాహినిగా ప్రవహించి చైతన్యవంతం చేయాలి. తద్వారా సమాజంలోని వ్యక్తులు ఉత్తమ పౌరులుగా జీవించే అవకాశముంది.

**సమాజం - సాహిత్యం :**

ప్రాచీన సాహిత్యమంతా ప్రక ృతి వర్ణన, అష్టవిధ నాయికల వర్ణనే ప్రాతిపదికగా సాగింది. క్రీ.శ. 13, 14, 15 శతాబ్దాల కాలంలో హిందూమతంలోని రెండు ప్రధాన శాఖలైన శైవ, వైష్ణవ మతాల ఆధిపత్య ధోరణి నాటి రచనల్లో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. శివరాత్రి మహత్యం, కాశీఖండము, భీమఖండము, క్రీడాభి రామము లాంటి శైవకావ్యాలతోపాటు గజేంద్ర మోక్షం, క్షీరసాగర మధనం, క ృష్ణలీలలు మొదలైన వైష్ణవ కావ్యాలు కూడా ఈ కాలంలోనే రూపుదిద్దుకోబడ్డాయి. వీటిని రచించినది శ్రీనాధుడు, పోతనలాంటి ఉద్దండ కవులై నందున ఆయా కావ్యాల్ని చదివినవారు రెండుగా చీలి పోయి తమ తమ దైవాల మహత్యాలను ప్రచారం చేసు కుంటూ ఇతర శాఖల వారిపై భౌతిక దాడులకు తెగబడే వారు. ఈ జాడ్యం అంతటితో ఆగక రాజుల దాకా చేరడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ మత మౌఢ్యం వల్ల ఎన్నో దారుణ సంఘటనలు చరిత్ర పుటల్లో నిల్చిపోయాయి. ఇది కచ్చితంగా ఆనాటి సాహితీకారుల సాహిత్య సృజన వల్లనే సంభవించిం దని చెప్పగలం. మేరీకృపాబాయి గారి కథా సంపుటిని పరిశీలిస్తే సమాజం ఎలా ఉందో, సమాజంలోని స్థితి గతులు ఎలా ఉన్నాయో సమాజాన్ని వాస్తవిక దృక్పథంతో పరిశీలన చేసి జనజీవన స్రవంతిని చిత్రించారు. మధ్య తరగతి జీవుల జీవన చిత్రణను అద్దం పట్టారు. అగ్రకులాల మధ్య నలిగిపోతున్న సామాన్యుల జీవిత గాథలు, నిరక్షరాస్యులు, దోపిడికి గురవుతున్న విధానం, సమాజాన్ని దోపిడీ చేస్తున్నారు మోస కార్లను గురించి, కుటుంబ జీవన విధానాన్ని, దాంపత్య జీవితాన్ని, స్త్రీల సమస్యలను, ఆధునిక కాలంలో రాజకీయాలను అడ్డం పెట్టుకొని సమాజాన్ని దోపిడి చేస్తున్న విధానాన్ని ప్రపంచీకరణ నేపథ్యంలో తో ఆధునిక జీవన విధానాన్ని కాటూరి గారు వారి కథా సాహిత్యంలో విశ్లేషించారు. సామాజిక జీవన విధానాన్ని చిత్రించిన కథల్ని వస్తు దృష్ట్యా కింది విధంగా విభజించడమైనది.

**కుటుంబ జీవితం :**

భారతీయ సామాజిక జీవితంలో ప్రధానమైనది

కుటుంబం. ఇది భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు పునాదివంటిది. దేశంలో ఎక్కడ చూసినా కుటుంబ జీవితానికి సంబంధించిన నియమ నబంధనలు ఒకే విధంగా ఉంటాయి. భాషలు, మతాలు రాష్ట్రాలు వేరైనా అందరిలో కనిపించే ఉమ్మడి అంశం కుటుంబం. కుటుంబ జీవితం ఒక వ్యక్తితో పుట్టి అంతం అయ్యేది కాదు. ఒకతరం తరువాత తరాల వారకి సంస్కృతి నాగరికత మొదలగువాటిని కుటుంబం వ్యవస్థ ద్వారా అందిస్తుంది. "లైంగిక సంబంధాన్వయమైన స్త్రీ పురుషులు స్థిరసంబవథ స్వయంప్రతిపత్తి ఫలితమే కుటుంబం"[1]. నేడు ఈ కుటుంబ వ్యవస్థ ఒత్తిడుల వల్ల, నగరీకరణ వల్ల సమస్యల వలయంలో చిక్కుకోక తప్పలేదు.

కుటుంబమంటే ఏమిటి, అది ఎటువంటి వాతావరణంలో ఉండాలి. కుటుంబ జీవితంలో ఆనందం పొందటం కోసం ఒకరొకొకరు ఎలా పాటుపడాలి. ఇద్దరి మధ్య ఆత్మీయత నెలకొనని పక్షంలో తలెత్తే సమస్యలు ఎలా ఉంటాయన్న అంశాలు కథల్లో చిత్రించడం జరిగింది. ఉమ్మడి కుటుంబం, భార్యాభర్తలు,స్త్రీల సమస్యలు, కుటుంబంలో పురుషాధిక్యత, తల్లిదండ్రులు పిల్లల మధ్య ప్రేమానురాగాలు తదిర అంశాలు వీరి 'మూడుతరాలు', ఇంకాతెలవారదేమి, గృహప్రవేశం, నరకమదసిద్ధాంతం వంటి కథల్లో ప్రతిబింబించాయి.

### ఉమ్మడి కుటుంబ :

ఉమ్మడి కుటుంబం అంటే తల్లి, తండ్రి, కొడుకులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్ల మొదలైనవారు కలసి ఉండేవాళ్లు. ఈ ఉమ్మడి వ్యవస్థలోకి ఆర్థికపరమైన విషయాలు రావడం వల్ల సమాజంలో చోటుచేసుకున్న మార్పుల వలన ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైతున్నాయి. కాటూరు గారి కథల్లో ఉమ్మడి కుటుంబాలలోని ప్రేమానురాగాలు, అప్యాయతలు, ఆధునిక కాలంలో ఉమ్మడికుటుంబాలు ఏ రీతిలో విచ్చాన మవుతున్నాయో విశదీకరించారు.

"బంగారు గాజులు" కథలో ఉమ్మడి కుటుంబం ప్రాధాన్యాని తెలుపుతూ, ఆ కుటంబంలోని వ్యక్తుల మధ్య ఉన్న ఆత్మీయతను ఈ విధంగా చెప్పారు. ఈ కథలో శ్యామల కుటుంబం ఉమ్మడిగా కలసి ఉంటారు. అత్త, మామ, మురుదులు, తోడికోడళ్లతో కలసిమెలసి జీవిస్తుంటారు. మామగారంటే కుటుంబ సభ్యులందరికీ సింహస్వప్నమే. రుచులంటే ప్రాణం తీసుకునే అత్తగారికి అల్సర్లురావడంతో కారం తగులకుండా మజ్జిగతో జీవించాలని డాక్టర్లు చెపుతారు. ప్రతి సంవత్సరం నవంబర్ ఒకటవ తేదీ తెలుగు దినోత్సవం సరుపటం, పిల్లలకు స్వీట్లు, పండ్లు పంచి పెట్టే అలవాటు మామగారికి. ఆ సందర్భంలో పైవేద్యంగా గోంగూర పచ్చడి చేయమని శ్యామలకు చెబుతుంది అత్తగారు. అది తెలుసుకుని మామగారు అత్తగారికి తినిపించాలని ప్రయత్నిస్తాడు. అప్పటికే దొంగలా తింటున్న భార్యని చూచి బిత్తరపోతాడు మామగారు. ఈ విధంగా సంతోషాలతో, ఒకరికొకరు ఆప్యాయతలను పంచుకుంటూ ఒకరికోసం మరొకరు సహాయసహకారాలు అందించుకుంటూ ఆనందాల హరివిల్లులా సాగుతుంది ఈ కథ.

### భార్యా - భర్తలు :

"పరుగు " కథలో దాంపత్య జీవిత ఔనత్యాన్ని చిత్రించారు. విశ్వనాథం, పార్వతి భార్యాభర్తలు. పెద్దలు కుదిర్చిన సంబంధం. ఒకరికోసం ఒకరు పుట్టినట్లు వారి దాంపత్య జీవితం అన్యోన్యంగా ఉంటుంది. విశ్వనాథం చిన్న ఉద్యోగం. పిల్లల చదువులు, కుటంబ పోషణ చేస్తూ అతికష్టం మీద కుటుంబభారాన్ని మోస్తుంటాడు. ఒక రోజు రాత్రి ఇంటికి వచ్చి చేతిలో ప్యాకెట్ విప్పదీసాడు. అది ఒక అందమైన దుప్పటి. ఆ దుప్పటిని చూస్తూ ఆమె కళ్ళు మరింత పెద్దవి అయ్యాయి. "పరుగు బాగుందికదూ...! ఇక నుంచి పిల్లలకి చలి భయంలేదు. అంటూ విశ్వం మొహం తృప్తితో నిండిపోయింది. భర్త శ్రమను అర్థంచేసుకొని జీవించే స్త్రీలు చాలా అరుదుగా ఉంటారు. అటువంటి వారితో ఏ పురుషుడికి ఎటువంటి ఇబ్బంది కలుగదు. భర్త ఎంత శ్రమించిన ఇంటికి రాగానే

ఆప్యాయంగా పలకరించే భార్య ఉంటే ఆ భర్తకు అదే పదిలక్షల ఆస్తితో సమానం. ధనం ముఖ్యం కాదని ప్రేమాభిమానాలు ఎంతో ముఖ్యమని, భర్తకు చేదోడు వాదోడుగా భార్యలుంటే అది ఆత్మీయానురాగాల హరి విల్లు వంటి కుంటుంబం అవుతుందని తెలిపారు.

### తల్లిదండ్రులు - పిల్లలు :

పిల్లలు, వారి ఆలనాపాలనా చూసేబాధ్యత తల్లి దండ్రలది. "కష్టసుఖాల్లో, ముద్దుముచ్చటల్లో ఒకరినొకరు తోడుగా, నీడగా నిలిచే ఆలుమగలే మానవజాతికి ఆధారభూతులు, వారి నడుమనడయాడే పిల్లలే 'చిలిపి దేవుళ్ళు' వాళ్లతోగాని ఇంటికి నిండుతనంరాదు. పిల్లలు లేని ఆలుమగలు 'జంట' అనిపించుకుంటారేగానీ 'కుటుంబం' అనిపుంచుకోరు[4]" అని పోరంకి దక్షిణామూర్తి అన్నారు. తల్లిదండ్రులు, పిల్లఉ ఉండే సంబంధాల్ని కాటూరుగారు వారికథల్లో ఈ విధంగా చూపించారు.

"వంకాయకూర" కథలో తల్లీకూతుళ్ల ప్రేమను చిత్రించటం జరిగింది. ఈ కథలో మాతృహృదయాన్ని ఆవిష్కరించారు రచయిత. ఈ కథలో పద్మ కూతురు కమల. కమల స్కూలు విడిచి పెట్టే సమయానికి వర్షం పడుతుంది. మాటలలో మరచిపోయి కూతురును తీసుకు రావడానికి ఆలస్యంగా పాఠశాలకు వెళ్ళింది పద్మ. అప్పటికే అక్కడి నుండి కమల వెళ్ళిపోయింది. పద్మ దారిలో వెతుకుతూ వచ్చింది. కూతురు ఎక్కడ కనిపించదు. దారిలో వర్షపు నీరు ఎరులా ప్రవహిస్తుంది. మధ్యలో డ్రైనేజి మ్యాన్ హోల్స్ యమదూతల తెరుచుకుని ఉన్నాయి. అవన్నీ చూసిన పద్మలో మరింత ఒత్తిడి పెరిగింది. నిరాశతో ఇంటికి తిరిగి వచ్చిన పద్మకు మురికి బట్టలతో ఎదురైనా కూతురిని చూసి తన మాతృ హృదయం అతలాకుతలం అవుతుంది. ఈ సందర్భంగా తల్లిహృదయానికి కథలో అద్దంపట్టారు. తల్లికూతుళ్ళ బాంధాన్ని చక్కగా ఆవిష్కరించారు.

### ప్రేమ - పెళ్లిల్లు :

ప్రేమ పెళ్లికి సంబంధిచి కథ. ఈ కథలో ఆనంద్, స్వప్న ఒకే సామాజిక స్థాయికి చెందినవారు. ఆనంద్ తండ్రి కాంట్రాక్టరు. అనుకోని ప్రమాదంలో చనిపోయాడు. ఈ పరిస్థితులలో గల్ఫ్ దేశాలకు వెళ్లి ఉద్యోగం చేసి తండ్రి చేసిన అప్పులు తీర్చాలనే ఆలోచనలో ఉంటాడు. ఈ సమయం తన ఇంటిలో జీతగడుగా ఉన్న అక్బర్ కనిపించి తను కొత్తవ్యాపారం చేస్తున్నానని, అందులో అధిక లాభాలుంటాయని, మీరు ఇష్టపడితే భాగస్వామ్యం ఉంటుందని చెబుతాడు. అది స్మగ్లింగ్ వ్యాపారం. ఇదే విషయాన్ని తను ప్రేమించిన స్వప్నకు చెబుతాడు. ఇరువురు కారులో ప్రయాణిస్తుంటారు. అదే సమయంలో వేగంగా నడుస్తున్న కారును మలుపులో బ్రేకులు వేయకుండా తిప్పాలని ప్రయత్నిస్తుంది. అతికష్టం మీద ప్రాణాలతో బయటపడతారు. ఏమిటి? స్వప్న అలా చేశావు? అని అడిగిన ఆనంద్‌తో స్వప్న "మలుపు తిప్పేటపుడు బ్రేకులు వేయకపోతే ఏమవుతుందో చూడాలనిపించింది..." "చూడు ఆనంద్! జీవితంలో గొప్పమార్పు వచ్చి మనం చాలాగొప్పవాళ్లు కావాలనుకోవటం తప్పుకాదు. కానీ జీవితాన్ని మలుపు తిప్పుకునే ముందు ఎంతో నిగ్రహం అవసరం. ఇందాక చూశావ్‌గా.. కారుని వేగంగా మలుపు తిప్పేటప్పుడు బ్రేకులు వేయకపోతే ఏమవుతుందో" అని స్వప్న మృదువుగా మనసు మళిస్తుంది. వారి ప్రేమ తల్లిదండ్రుల అమోదంతో పెళ్లి జరుగుతుంది.

### నమ్మకాలు - విశ్వాసాలు :

భారతీయ సంస్కృతీ సాంప్రదాయంలో బాగంగా ఉన్నవే నమ్మకాలు విశ్వసాలు. అది దేవుడి మీద కావచ్చు, సంస్కృతిలో ఉన్న విశ్వాసాలకు వీటిపట్ల మానవుడికి మక్కువ ఎక్కువ. కాటూరుగారు వారి కథల్లో నమ్మకాలు, విశ్వాసాలకు చెందిన కథల్ని రచయిత చిత్రించారు. హిందూమతంలో ఉన్న నమ్మకాలు విశ్వాసాలని రచయితలు చిత్రించారు.

"ఆచార్య దేవోభం" కథలో దేవుని పట్ల గల నమ్మకాన్ని తెలుపుతుంది. సుదర్శనాచార్యులు స్వామి భక్తి

పరాయణుడు. తండ్రి నుండి వారసత్వంగా లభించిన స్వామివారి సేవను ఆరాధిస్తూ జీవిస్తుంటాడు. స్వామి సేవకంటే మరో సేవ లేదని నమ్మేవాడు. ఈ పరిస్థితిలో తన భార్యకు స్వయాన తొడబుట్టిన సోదరుడు కృష్ణమాచార్యులు అమెరికాలో గొప్ప దేవాలయం నిర్మించారని అందులో పూజాది కార్యక్రమాలకు అమెరికా రమ్మని ఆహ్వానించాడు. కానీ లాను నమ్మిన దైవాన్ని విడిచి ఎన్ని కోట్లిచ్చిన రానని తెల్చిచెప్పాడు. తనకు తాను నమ్మిన దైవమంటే అంతనమ్మకం. ఇది భారతీయ హృదయాలలో దాగియున్న సత్యమని రచయిత వివరించారు.

"జీవనసంధ్య" కథల్లో భారతీయ ఇతిహాసాలపై నమ్మకం ఈ కథలో తెటతెల్లమౌతుంది.

## స్త్రీ సమస్యలు :

1940, 1945 ప్రాంతంలో తెలుగు సాహిత్యంలో భావకవిత్వపు గాలులు ముమ్మరంగా వీచి , కొందరు ఆ ప్రభావానికి లోనయి ఊహా సుందరులు, ఊహా ప్రణయినులూ అంటూ ఒక అమ్మాయిని ప్రేమించి, ఆమెకి పెళ్లి అయిపోయాక కూడా ఆమెను ఇంకా ప్రేమిస్తూ 'మాది అమలిన ప్రేమ' అనడం ఒక అంటూ వ్యాధిలా వ్యాపించింది. వాస్తవాన్ని విస్మరించి అమలిన శృంగారం, అమలిన ప్రేమ, అంటూ వెర్రెక్కి, కాపురాలు పోగొట్టుకొన్న అమ్మాయిలు ఉండేవారు. అటువంటి వాళ్ళకి కను విప్పుకలిగిస్తూ, ప్రేమ జీవితం వేరూ, నిజ జీవితం వేరూ, అంటూ తెలియజెప్పాడు గోపీచంద్. 'కార్య శూరుడు' కథలో మనిషికి అన్నీ ఉన్నా ఏదో తెలియని అసంతృప్తి వేదనా అందనిది, అందుకోవాలని, లేనిది సంపాదించాలనీ - అది అప్పుడూ ఇప్పుడూ కాదు ఎప్పుడూ ఉంటుంది. ఈ ఆరాటాన్ని విశదీకరించారు బుచ్చిబాబు, ' తనని గురించిన నిజం' అనే కథలో. ప్రతి కథలో కృపాబాయి గారు వాస్తవ దృష్టిని కనబరచాలని సంఘంలోని వ్యక్తులు వారి ప్రవర్తనను వాస్తవికదృష్టితో చాలని ప్రయత్నించారని ప్రయత్నిస్తూ ప్రయత్నించటం అనిపిస్తుంది. స్త్రీలను ఒక భోగవస్తువుగా చూస్తూ సభ్యత సంస్కారం విడిచి స్త్రీల అవసరాలను గుర్తెరిగి వారిని లోబర్చుకోవడం ఏ కోవాలని దృక్పథంతో కొందరు పురుషులు ఉంటారని అటువంటి నీచ ప్రవృత్తి గల వారికి ఇలా గుణపాఠం చెప్పారు.

## అభ్యుదయ కామన :

"సామాజిక స్థితిగతుల్లో , ఆశయాల్లో, ఆలోచనల్లో, ఆచార వ్యవహారాల్లో పరస్పర సంబంధాల్లో ఒకప్పుడున్న పరిస్థితి, సమిష్టి శ్రేయోన్ముఖంగా చెందే వికాసాన్ని 'అభ్యుదయం' అంటాం". దీన్ని సాధించాలన్న కాంక్ష అభ్యుదయకామన. దీన్ని వ్యక్తం చేసే రచయితలు, కళాకారులు, రాజకీయవేత్తలు మొదలైనవారు 'అభ్యుదయకాములు'. ఈ విధమైన అభ్యుదయ కామన తెలుగు కథానిక సాహిత్యంలో ఎలా ప్రతిబింబిస్తోదన్నది. అదే విధంగా రచయిత కాటూరు రవీంద్రత్రివిక్రమ్ గారు వారి కథాసాహిత్యంలో కూడా 'అభ్యుదయ కామన' ను తేటతెల్లమయ్యే రీతిలో కథలు సృష్టించారు. ఆ కథలను పరిశీలిదాం. "అంకురం" కథలో నిరాక్షరాస్యత వలన ఏ రీతిలో మోసగించబడేవారో తెలియజేయడమే, కాక అక్షరాస్యత ఆవస్యకతను చూపించారు. "ఇక్కడ వేలి ముద్రవెయ్యి" చూపుడు వేలితో కాగితం మీద చూసుతూ అన్నాడు చంగయ్య. 'సరిపోద్దా?' వేలిముద్రని పరిథీలనగా చూస్తూ అడిగాడు ఎంకటేశు. అద్సరేగానీ... దేవుడుకి దయకలిగి నిన్ను మళ్ళీ పడుసోణ్ణి సేశాడనుకో. "అహు... ఊరకే అనుకో..." "పదిమంది కుర్రాళ్ళను కలుపుకుని పంట కాల్వకీ వంతెన కటతా" , 'నీ కాడ అంత డబ్బేడది?' తాటిదుంగలతో కట్టే వంతెనకి డబ్బులతో పనేంది? ఆలోచన మంచిదేగానీ, కుర్రనాయాళ్లు కూలామనుకుని నీకు సాయం వత్తారా? ఎందుకు రారూ? ఇదేమన్నా నా ఇంట్లోపెళ్ళీ పేరంటమా? ఊరిపని. ఇలా మాటల్లో చెంగయ్య చేయాల్సింది చేశాడు. సరే పైసలు సరి పోయినయా? నాకు లెక్క డొక్క తెలిసిస్తే ఏలిముద్ర ఎంకేస్తాను. ఆ పాపం పున్నెం అన్నీ నీవె. కాంతమ్మ మళ్ళీ లెక్కబెట్టింది. రెండొందలు తేడా కన్పిస్తోంది. మొగుణ్ణి

తిట్టిన తిట్టు తిట్టకుండా గంటసేపు తిట్టింది. ఎంకటేశం అలిగి అన్నం తినకుండా పడుకున్నాడు. భార్య కాంతమ్మ దగ్గరకు వచ్చి నేనన్నదాంట్లో తప్పుముంది? చదువు నేర్చుకుంటే నీ కష్టార్జితం ఒకరు దోచుకోకుండా ఉంటారనే కదా అంటుంది. ఎంకటేశం లేచి అన్నం తిని చేయి కడుక్కోని భార్యను పలకా బలపం అడుగుతాడు. తిన్నగా రాత్రిబడికి చేరాడు.. అక్షరాల బలంతో ప్రపంచాన్ని గెలుస్తాడు.

**ముగింపు :**

ఈ విధంగా కృపాబాయిగారు వారి కథల్లో సంస్కృతి - సంప్రదాయాలను, ఆర్థికవ్యవస్థ సంబంధించిన అంశాలను, విద్యవిషయాక అంశాలను, సమాజంలోనిరంతరం పెరిగిపోతున్న కాలుష్య సమస్యలను వివరించడమే కాక, పాఠకులను నైతిక రపబోధాన్ని అందించి, స్త్రీ సమస్యలను వివరించారు. వారి కథల్లో సామాజికతను వెల్లివిరిచి యువతకు తగిన దిశానిర్దేశాలను చేశారు.

**ఆధార గ్రంథాలు :**

1. మునిరత్నం రెడ్డి, కుటుంబ రూపు రేఖలు.
2. పోరంకి దక్షిణామూర్తి, కథానిక స్వరూప స్వభావాలు.
3. జి. మేరీ కృపాబాయి కథా నీరాజనం.

❖❖❖

# స్త్రీవాద, బాల కార్మికుల కథలు - సామాజికత

– రెబ్బ మల్లికార్జున్, పరిశోధక విద్యార్థి.

బండారు అచ్చమాంబ నుండి నేటి వరకు ఎందరో మహిళామణులు తమ కథా కథనంతో ఆ కాలం నాటి సామాజిక జన జీవన చిత్రణను చేస్తూ తమ ఉనికిని సుస్థిరం చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో రాబోయే తరాల వారికి దిశా నిర్దేశనం చేస్తున్నారు. తెలంగాణ నుంచి రావలసినంత కావలసినంత స్త్రీవాద సాహిత్యం రాలేదని అంటారు. తెలంగాణలో రాడికల్ ఫెమినిజం చోటు చేసుకోలేదు. కాని స్త్రీ స్వేచ్ఛ సమానతలు సమానావ కాశాలను కోరుతూ, స్త్రీల వ్యథలను శ్రమ దోపిడీని చిత్రిస్తూ గీతాంజలి, ముదిగంటి సుజాతారెడ్డి, అని శెట్టి రజిత కథలు రాశారు. బచ్చేదాని, విసుర్రాయి, మట్టి బంధం వంటి కథల సంపుటాలు వచ్చాయి. ఇంకో విశేషమేమిటంటె దళిత స్త్రీవాదంలో స్త్రీ స్పృహను, వ్యథలను చిత్రిస్తూ జాజుల గౌరి, గోగుశ్యామల, జె.సుభద్ర వంటి రచయిత్రులు తెలంగాణ మాండలికంలో బలమైన కథలు రాశారు. జాజుల గౌరి దళిత స్త్రీ జీవితాలను చిత్రిస్తూ 'మన్ను బువ్వ' అనే కథల సంపుటిని ప్రచురించింది. స్త్రీ దళిత స్పృహను చిత్రిస్తూ ఇతర ప్రాంతాల నుంచి సాహిత్యం ముఖ్యంగా కథలు రాలేదు. తెలంగాణా నుంచే వచ్చాయి. అదే విధంగా ముస్లిం స్త్రీవాదంలో స్త్రీల వ్యథలను షాజహానా కవిత్వంలోనే కాక కథల్లోనూ చిత్రించింది. ఇట్లా ముస్లిం స్త్రీల వ్యథను చిత్రించే కథా సాహిత్యం ఇతర ప్రాంతాల నుంచి రాలేదు.

స్త్రీ విద్యావంతురాలైనప్పటికీ నాలుగ్గోడల మధ్య బందీగా పరిగణించబడుతూనే ఉంది. విద్య ద్వారా వచ్చిన ఉద్యోగం కొద్దిపాటి స్వేచ్ఛను ఇవ్వగలిగినప్పటికీ ఇంటి చాకిరీ స్త్రీల జీవితాలను వేధిస్తూనే ఉంది. ఆంక్షలు స్త్రీ స్వేచ్ఛకు అడ్డొస్తూనే ఉన్నాయి. ఉద్యోగం స్త్రీకి ఇంటిచాకిరీతో పాటు అదనపు శ్రమ అనే మరో నూతన బానిసత్వంలోకి నెట్టివేసింది. రాజ్యాంగం పౌరులందరికీ గౌరవంగా బతికే హక్కును కల్పించినప్పటికీ అధిక శాతం స్త్రీలు కనీస పౌరులుగా కూడా గుర్తించే పరిస్థితులు సమాజంలో లేవు. స్త్రీల పనికి గుర్తింపు ఇవ్వకుండా విలువను నిరాకరిస్తున్న సమాజం మన ఎదుట ఉంది. ఇటువంటి పరిస్థితులను నిర్మూలించే లక్ష్యంతోనే చలం రచన ప్రారంభమైంది.

పెట్టుబడిదారి వ్యవస్థలో స్త్రీ ఒక విలాస వస్తువు. 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత', 'కార్యేసు దాసి, కరణేషు మంత్రి, శయనేషు రంభ, భోజ్యేషు మాత, క్షమయా ధరిత్రి' అంటూ వివిధ పాత్రల్లో స్త్రీ నిర్వహించాల్సిన బాధ్యతతో పాటు చేయాల్సిన వెట్టి చాకిరీని బలవంతంగా ఆమెపై రుద్దుతుంటే శారీరకంగా, మానసికంగా అనాదిగా ఎన్నో ఇబ్బందులకు గురవుతుంది. 'స్త్రీకి స్త్రీయే శత్రువు' అన్న నానుడిలో నిజం లేకపోలేదు. స్త్రీల గురించి ఎన్ని పోరాటాలు చేసినా, చట్టాలెన్ని అమల్లోకి వచ్చినా వారిపై రోజురోజు జరిగే అత్యాచారాలకు, అరాచకాలకు అంతులేకుండా పోతుంది. ఒక్క సోషలిస్టు వ్యవస్థలో మాత్రం స్త్రీని పురుషుడితో సమానంగా చూడటం జరుగుతుంది. మూడు దశాబ్దాల్లో ఉత్తర తెలంగాణా కథల్లో స్త్రీ సమస్యల్లోకి వెళ్తే 'స్త్రీ తన మానాన్ని రక్షించుకోవడానికి ఎమైన చేయగలదు' అనే వాస్తవాన్ని విప్పి చెప్పిన కథ అఫ్జల్ రాసిన 'కలిసొచ్చినవేళ'.

### ఊరికి పోదాం భూదేవి- గీతాంజలి :

అస్తమానం డబ్బు సంపాదించాలనే భర్త, వంతపాడే అత్తయ్య, కంప్యూటర్ గేమ్సుకు డబ్బులడిగే కొడుకు విశాల్, హైహీల్ షూస్... లిప్‌స్టిక్, నెయిల్‌పేయింట్స్ కావాలని మారాం చేసే కూతురు రిధిమ... రెండ్రోజులకో సారి తన దర్జా చూపి పోవడానికొచ్చే ఆడపడచు మృదుల,

డబ్బునే తింటూ తాగుతూ బతికే ఆమె భర్త సతీష్, అతన్ని చూసి ఆత్మన్యూనతకి లోనవుతూ పోటిపడే తన భర్త దినకర్, అతని కోరికలకు బలయ్యే తాను. బాల్యపు సుఖానుభూతుల్ని తల్చుకుంటూ కలలు కనడం మాత్రమే శివాని చేయగలిగేది. తనింట్లో పనిమనిషికున్న మనోవేదనను తీర్చుకునే స్వేచ్ఛ తనకు లేదుకదా అని వాపోతుంది.

### పైతృకం- సుజాతారెడ్డి :

వారసులకు తండ్రినుండి వచ్చే ఆస్తిని పైతృకం అంటారని అందులో కూతురికి ఆస్తి హక్కు లేకపోవడం అనే వంచన జరుగుతుందని నిరూపించిన కథ. తల్లి సావిత్రిని చిన్నప్పటి నుండి తండ్రి పీడించడమే చూస్తుంది. తనింట్లో తనే బానిసగా భావిస్తూ సహనం, ఓర్పు, అణకువ, భర్త కెదురు తిరిగి మాట్లాడకూడదనే జీవితాదర్శంతో పరాయికరణకు లోనైన ఇల్లాలు. తల్లిలాగే అమ్మమ్మ కూడా తండ్రి ఆస్తి, కట్న కానుకల విషయంలో వంచితురాలైనట్లు గ్రహిస్తుంది. తనూ అంతేనా అని ఓ సారి భయపడిన విజయ తాను చదువకున్నది! తల్లిలాగా, అమ్మమ్మలాగా ఆస్తి కట్నకానుకల సంకెళ్ళలో చిక్కుకొని అత్తింటికి బానిన కాకూడదు అని దృఢనిశ్చయం చేసుకుంటుంది. స్త్రీకి ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాల్సిన అవసరాన్ని చాటిన కథ.

### మాతృమూర్తి - కాలువ మల్లయ్య :

శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన వసంతకు తండ్రి భూషణరావు ఆడపిల్లకు పెద్దగా చదువు అవసరం లేదని పదోతరగతి పూర్తి కాగానే పెళ్ళి చేయగా ప్రమాదంలో భర్త చనిపోతాడు. అన్న స్నేహితుడైన గోపి మాయమాటలు నమ్మి గర్భవతి అవుతుంది. మాతృమూర్తి కావాలనే బలీయమైన కోరికను తీర్చుకోకుండానే తండ్రి కఠినమైన మాటలను తట్టుకోలేక తనువు చాలించడంతో ముగిసిన విషాదగాథ. 'చిందొర్సాని' దొర కూతురు సుజాత వయో: క్రమంలో ప్రవర్తనా మార్పుల్ని తెల్పిన కథ. దొరల ఇళ్ళలో భార్యలు, కూతుళ్ళు, కోడళ్ళు వారిళ్ళలో పనిచేసే వారికన్నా హీనంగా మానసిక బానిసత్వాన్ని భరిస్తూ గడిపే తీరును ప్రత్యక్షంగా చిత్రించిన కథ. 'పాపం దొర్సాని' సునందాదేవి దయనీయస్థితికి అద్దం పట్టిన కథ.

### తొందరపడి ఒక కోయిల- నరేందర్ :

పెళ్ళి చూపుల పేర సంతలో పశువులా మారిన ఆమె, తల్లిదండ్రులకు గుండెలపై కుంపటిలా ఉండటం ఇష్టంలేక మానసిక క్షోభ అనుభవిస్తుంటుంది. ఆమె బాధను అర్థం చేసుకున్న పోస్ట్ మాన్ చేయందిస్తానంటూ ఆమెలో ఆత్మవిశ్వాసం కలిగిస్తాడు. తల్లిదండ్రులకు తన నిర్ణయం తెలిపి వారిని సంతోషపెట్టి అతనిలో వెళ్ళడంతో సుకాంతమైన కథ.

### వైరుధ్యాలు- బి.ఎస్.రాములు :

భూమయ్య ఉద్యమ కార్యకర్త తన భార్య సుశీలను కూడా ఉద్యమంలోకి రమ్మంటాడు. అందుకామె అడవుల్లోకి వెళ్ళడమే ఉద్యమం కాదని జనంలో ఉం టూనే, ఆవరిని ఉద్యమంవైపు వెళ్ళేలా చైతన్యపరుస్తా నంటుంది. అంతేగాక ఇద్దరము బయట తిరిగితే పిల్లల బాధ్యత ఎట్లా అని ప్రశ్నించడం ఇల్లాలిగా ఆమెతీరు మరియు ఉద్యమం పట్ల ఆమె అభిప్రాయాన్ని చక్కగా వెల్లడి చేసినట్లయింది. ఉద్యమ నిర్మాణాన్ని సవరించాలని కోరుతుంది. ఈ కథ దంపతుల మధ్య ఉద్యమంలోకి వెళ్ళడం వల్ల కుటుంబంలో జరిగే సంఘర్షణను వాస్తవీకరించింది.

### కుంపటి - అల్లం రాజయ్య :

దొర ప్రజల సంఘటిత శక్తిని దెబ్బతీయడానికి కాల్పులు జరపగా 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. అక్కడికొచ్చిన ఇన్స్పెక్టర్‌ను ఆ తుపాకీ తీసుకోమని ప్రజలు డిమాండ్ చేస్తారు. అయినా అతను చలించక పోగా, ఒక స్త్రీ 'దొరట్ల కాలుస్తుంటే చూస్తావేమయ్యా అరెస్టు చేయక.... గా బట్టలు నాకీయి, తుపాకి నా

సేతికియ్యి అన్ని అరెస్టు 'సేత్త' అని నిలదీయడం పోలీసుల చాతకానితనాన్ని, తెలంగాణా స్త్రీల ధీరత్వాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించింది.

**రాజులు - అనిశెట్టి రజిత :**

ఈ కథలో ఆడవారు ఆపద సమయంలో తమ గాజులనే ఆయుధాలుగా చేసుకుని మగవారిని పలాయనం చిత్తగించేలా చేసిన వైనాన్ని చక్కగా చిత్రించడం జరిగింది. అతి సామాన్య స్త్రీలు కూడా పోరాటం అనివార్యమైనపుడు ఆయుధాలు లేవని వెనకకు తగ్గేది లేదని నిరూపించడం విశేషం, తెలంగాణా స్త్రీలు గాజులేసుకుని బతుకమ్మ ఆడిన చేతులు ఓ రాత్రి ప్రయాణంలో తాగుబోతుల బారి నుండి సుశీల నాయకత్వంలో పోరాడి గెల్చిన తీరు అద్భుతంగా అన్పిస్తుంది.

**గలుమ :**

ఈ కథలో మల్లీశ్వరీ అనే గృహిణి తన జీవితాన్ని పరాధీనురాలుగా గడిపిన వైనం స్పష్టమవుతుంది. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు సంరక్షణలోనే గడపాలని పెద్దలు నుడివినట్లుగానే సాగిపోతుందని ఈ కథ నిరూపిస్తుంది. యాభైఏళ్ళ జీవితంలో కూతురుగా, భార్యగా, తల్లిగా గలుమలో కూర్చుండి, తండ్రి కోసం, భర్తకోసం, కొడుకుల కోసం ఎదిరి చూడ్డంగా మారిన స్త్రీల జీవితాలు, వాళ్ళ ఆర్తి ఈ కథలో ప్రస్ఫుటమౌతాయి. గలుమల్ని తొలగించుకొని వంటింటి కుందేల్లుగా ఉన్న పేరును తొలగించుకొని సామాజిక జీవన స్రవంతిలో భాగం కావాలనే సందేశం 'గలుమ' కథలో అందించారు. మల్లీశ్వరి కూతురు పలికిన మాటల్ని బట్టి ఇప్పటి తరం స్త్రీలలో బయటి ప్రపంచం లోకి రావాలనే స్పృహ కల్గుతున్నట్లు తోస్తున్నది.

**నిరీక్షణ :**

ఈ కథలో గ్రామీణ స్త్రీలు వాళ్ళ గుండెల్లో గూడు కట్టుకున్న పవిత్రప్రేమ, ఎన్ని కష్టాలు వచ్చిన ఆ ప్రేమను గుండెలో నిలుపుకొని బతకడం, మనసిచ్చిన వ్యక్తికే తనువు అర్పించాలనే భావన ఈ కథలో కన్పిస్తుంది. తెలంగాణలో పద్మశాలీలు కులవృత్తి గిట్టుబాటు లేక బొంబాయి, భీవండి, షోలాపూర్ తదితర ప్రాంతాలకు వలస వెళ్ళారు. అక్కడ మరమగ్గాలపై పని వెతుక్కుని అక్కడే జీవించారు. ఈ కథలో కిష్టయ్య. రుక్కమ్మ బావ మరదళ్ళు. కిష్టయ్య భీవండి వెళ్ళి కొంత సంపాదించుకొని వచ్చాక రుక్కమ్మను పెండ్లి చేసుకుంటానని చెప్పి వెళ్తాడు. అట్లా వెళ్ళినవాడు యేడాదిన్నర పాటు అక్కడే ఉంటాడు. ఇంటివద్ద తన బావరాక కోసం రుక్కమ్మ ఎదురుచూస్తూ గడుపుతుంది. ఇంతలో భీవండిలో మతకలహాలు చెలరేగడంతో అమాయకుడైన కిష్టయ్య మరణిస్తాడు. ఈ వార్త తెలిసిన రుక్కమ్మ మతిచలించి పిచ్చిదవుతుంది. ప్రతిరోజు తలారాస్నానం చేసి ఉతికిన చీర కట్టుకొని, మల్లెపూలు సిగనిండా పెట్టుకొని ముస్తాబై రాని బావకోసం ఎదురుచూస్తూనే ఉంటుంది.

**మురికి :**

కథ సమాజంలో సంపన్న స్త్రీల గాడి తప్పిన హోదాకు సంబంధించింది. ఈ కథకు వేదిక పట్టణం నడిఒడ్డులోని 'స్త్రీల రిక్రియేషన్ క్లబ్'. సాయంత్రాని కల్లా ఆ క్లబ్‌కు సమాజంలో ఉన్నత హోదాల్లో ఉన్న వారి భార్యలు చేరుతుంటారు. వారే ఆ క్లబ్ సభ్యులు. ఖరీదైన కార్లు, బంగ్లాలు, చీరలు, నగల చుట్టే వారి మాటలు సాగుతాయి. స్త్రీల హక్కుల గురించి మాట్లాడటం, ఆచరణలోకి వచ్చేసరికి సాటి స్త్రీల పట్ల అవహేళనగా అవమానకరంగా ముచ్చటించటం, కన్నబిడ్డలకు స్తన్యమిస్తే అందమంతా కరిగిపోతుందని డబ్బాపాలు పెట్టి, ఆయా, దాదీల సంరక్షణలో ఉంచడం, అత్తమామల్ని గుదిబండలా చెప్పుకోవడం ఇవే ఆ క్లబ్బులో జరిగే చర్చలు. కాలక్షేపానికే అంటూ పేకాడటం, ఇంటివద్ద నుండి పిల్లలు ఏడుస్తున్నట్లు ఫోన్ వచ్చినా చలించకపోవడం ఇవ్వన్నీ రోజు వింటూ, చూస్తూ భరించలేనంతా మానసిక ఉ

ద్వేగానికి గురైన ఆఫీస్ బాయ్ ఆనంద్ 'అమ్మో మురికి మురికి... గబ్బు.. గబ్బు వాసనొస్తుంది' అని క్లబ్ సెక్రటరీతో అంటాడు. నవనాగరికపు పోకడలకు పోయే స్త్రీల ప్రవర్తన ఏ రీతిలో ఉందో ఈ 'మురికి' కథ అద్దం పడుతుంది.

**బాలకార్మిక కథలు :**

జీవితంలో బాల్యం అపురూపమైన దశ. భవిష్యత్తుకు పునాది బాల్యమే అవుతుంది. తల్లిదండ్రుల సంరక్షణలో అనురాగ అప్యాయతలను పంచుకుంటూ ఇల్లే ఒక ప్రపంచంగా బాల్యం కొనసాగుతుంది. రోజులు గడిచినా కొద్దీ జ్ఞానం వికసిస్తూ పరిసరాల ప్రభావం వల్ల వ్యక్తిత్వానికి బీజం పడేది బాల్యంలోనే. ఈ బీజమే కుటుంబం అంకురంగా, సమాజం మొక్కగా, ప్రపంచం వృక్షంగా పరిణామం చెందుతుంది. స్వచ్ఛమైన, నిర్మల మనసుతో నిస్వార్థమైన వ్యక్తిగా రూపొందడానికి ప్రాతిపదికగా ఉంటుంది. పిల్లలకు జన్మనివ్వడంతో పాటు వారి భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలంటూ తల్లిదండ్రులు కలలు కనడం సహజమే. తల్లిదండ్రుల కలల్లాగే బిడ్డల జీవితాలు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. నిరక్షరాస్యత, దారిద్ర్యం, నిత్య సంఘర్షణ ఉన్న కుటుంబాల్లో బాల్యం రక్షణ లేని మొక్కలా పెరుగుతుంది. అస్తవ్యస్త పరిస్థితులు, నిత్య అభద్రతాభావంతో ఉన్న పరిసరాల మధ్య బాల్యం సున్నితత్వాన్ని కోల్పోయి మొరటుగా రూపొందవచ్చు. శుచీశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న బాల్యం సంరక్షకుడి సంబాలనలో వికసించిన తోటలా ఉండవచ్చు. ఇవన్నీ నిత్యం మనం చూస్తున్న సమాజంలో కన్పించేవే. సృజనకారులైన కథా రచయితలు సమాజంలో ఉన్న ఈ వాస్తవాన్ని కథావస్తువుగా స్వీకరించారు.

**దేవుని బిడ్డలు - బి.ఎస్. రాములు :**

ఓ ఇంజనీరు కూతురుకు, ఆ ఇంటి పని పిల్లవాడి మధ్య ఏర్పడిన స్నేహం, కూలీల సమ్మె వల్ల ఆ పిల్లవాడు అనాథ ఐన తీరును ఉద్వేగ భరితంగా చిత్రించిన కథ. ఈ కథలో ఇంకా పిల్లల మధ్య ఆర్థిక అంతరాలు తెలియకుండా ఏర్పడే స్నేహం, ప్రేమ, అనాథలుగా మిగిలి బాల్యాన్ని కోల్పోయిన జీవితాలు, పోరాట క్రమంలో విచ్ఛిన్నమయే కుటుంబాల తీరు తెన్నులు, ప్లిలల కలల ప్రపంచం, వారి స్థాయికి మించిన ఆలోచనా ధోరణులు కూడా కనిపిస్తాయి. 'నేటి బాలలే రేపటి పౌరులు' అన్న నానుడి ఈనాటి బాలల విషయంలో మృగ్యమవుతున్నది. చదువుల భారంతో, మానసిక ఘర్షణలతో, బీదరికపు అవమానాలతో అనాథలుగా బిచ్చమెత్తుకుంటూ, తప్పని సరి పరిస్థితుల్లో బాలకార్మికులుగా మారి జీవితాలను గడపాల్సిన దయనీయ పరిస్థితి వారికి ఎదురౌతుంది. నేటి బాలలు నత్తగుల్లలాల్ల, నడక నేర్చిన యంత్రాల్లా, పుట్టుకతోనే, మీద పడిన కష్టాలు, తల్లిదండ్రుల నిరాదరణ, తండ్రుల దుర్వ్యసనాలు, బాధ్యతారహిత ప్రవర్తనల మధ్య బతుకును ఎంతో దీనంగా హృదయాలను కదిలించేలా గడుపుతున్నారు.

**వాడిన మొగ్గలు - జీవన్ :**

తండ్రి చిన్నప్పుడే చనిపోగా హాయిగా ఆటపాటలతో కాలక్షేపం చేయాల్సిన వయసులో అక్బర్ బాల కార్మికుడుగా మారి, ఓ స్కూటర్ రిపేరు షాపులో పని చేస్తుంటాడు. అనారోగ్యంతో తల్లి కూడా మరణించడంతో అక్బర్, అక్క అనాథలవుతారు. కలలు కనడమే కానీ వాటిని సాకారం చేసుకోలేని పరిస్థితని చిత్రించిన కథ. తండ్రులు తరతరాల బాకీ పిల్లల జీవితాలకు ఎలా గుదిబండలా తయారవుతుందో, తద్వారా కన్పించే ఫలితమేమిటో ప్రత్యక్షంగా చూపించింది.

**భూనిర్వాసితులలు - పి.చంద్ :**

గోదావరిఖని ఓపెన్‌కాస్టు బొగ్గుగని ప్రాంతంలోని పరిణామాలను చిత్రించిన కథ. రాజు తండ్రి రాజేశం భూపోరాటంలో కోల్పోగా తాతతో పాటూ హోటల్లో పని చేస్తుంటాడు. తండ్రి లాగే తాత మల్లయ్య పోలీసు లాఠీలకు బలికాగా రాజులో కసి పెరుగుతుంది. దాంతో రాజు ఇరవై లక్షల విలువచేసే డంపర్‌ను తగులబెట్టి

తృప్తి చెందుతాడు. కుటుంబ సమస్యలు, ఆత్మీయులు దూరం కావడం పిల్లలల్లో కసిని పెంచి ఎలాంటి దుష్ప రిణామాలకు దారి తీస్తుందో ప్రత్యక్షంగా చూపిన కథ.

## పురుగు - కాలువ మల్లయ్య :

నేటి పోటీ ప్రపంచంలో చదువుల విషయంలో తల్లిదండ్రుల ఒత్తిడి పిల్లలను పురుగులుగా మారుస్తున్న తీరు, తద్వారా వారనుభవించే హింస, నిస్సహాయతలను వ్యక్తం చేసిన కథ. ప్రభుత్వ ఉద్యోగి, విద్యావంతుడైన వీరేశం తన పిల్లలు కిరణ్, కవితల చదువు పట్ల చండ శాసనుడిలా ప్రవర్తించడం వారిని తీవ్ర భయానికి గురి చేసి చదువుపై తగిన శ్రద్ధ చూపలేకపోతారు. పిల్లలను చదివించాలే గానీ వారిపై తీవ్ర ఒత్తిడి పనికిరాదని గ్రహించేట్లు చేసిన కథ.

## కొలమానం - జాతశ్రీ :

కోయజాతి స్త్రీల మానాలకు రక్షణ లేని తీరును చూపిన కథ. పదమూడేళ్ళ తానంగి కట్టెపుల్లలు ఏరుకోవడానికి అడివికి తండ్రి వెళ్తే వయసున్న చౌకీదారు ఆ పిల్లను రాక్షసంగా చెరుస్తాడు. అన్యాయమని అడగడానికి వెళ్ళిన గూడెం ప్రజలకు పనితో పాటూ పైసలిస్తానని మభ్య పెట్టడంతో పేదరికం వల్ల వారేమీ అనలేకపోతారు. అన్యాయం నోరును డబ్బాశతో నొక్కిన మానవ మృగాన్ని కోయజాతి ప్రజల దీనస్థితిని, స్త్రీల హీన స్థితిని ప్రత్యక్షంగా చూపిన కథ.

## రసగుల్లలు - అమ్మిన శ్రీనివాసరాజు :

గురువు శిష్యులకు ఆదర్శంగా ఉంటూ చెప్పే వాటిని ఆచరించాలని, ఇతరులపై ఆధారపడి జీవించే తత్వం, విద్యార్థులకు గర్వం పనికిరాదని, గురువుముందు రాజకుమారుడైనా, పేదవాడైనా ఒక్కటేనని తెలియచెప్పిన కథ 'అడుగుజాడ'. ఉత్తమ పురుష కథనంలో ఓ డిగ్రీ విద్యార్థి స్వానుభవంలో నడిచిన కథ 'చదువురేఖ'. పొట్టకూటికే కోటి విద్యలు. అందులో జ్యోతిష్యం ఒకటి కానీ ఈ విద్య వల్ల ఎదుటివారిని మోసం చేయ కూడదంటూ ఆ మోసాన్ని నిరూపించి ఆ వ్యక్తిలో (జ్యోతిష్కుని) మార్పు చూపిన చక్కటి కథ. విద్యార్థు లంతా ఇలాంటి మూఢనమ్మకాలను ఖండించాలి. మూర్ఖత్వం వల్ల ప్రజల్లో గౌరవం, విశ్వాసాల్ని కోల్పోవల్సి వస్తుందని, ఎవరితో ఎలా మసలుకోవాలో తెల్సి ఉండటం అన్నివిధాలా మంచిదని రాజైన ఆనందవర్మ పాత్ర ద్వారా చెప్తూ చిరకాలం ప్రజల హృదయాల్లో నిల్చిపోయే మార్పు చూపిన చక్కని కథ 'గౌరవం'. గ్రామదేవతలకు మొక్కుబడిగా ఫలాలనివ్వాలే తప్ప మూగజీవులను అమానుషత్వంగా బలి ఇవ్వడం తగదని నాటకం ద్వారా వాసు ప్రజల నుండి దురాచారాన్ని దూరం చేసిన చక్కని కథ 'దూరమైన ఆచారం'.

తమ పిల్లల గొప్పలను గర్వంగా చెప్పుకునే తల్లి దండ్రులు దాని వెనకనున్న వారి కృషిని గుర్తించాలని, పిల్లలపై తమ ఇష్టాలను బలవంతంగా రుద్దకూడదని, అది వారిని హింసించడం, అత్యాశే అవుతుందని, డబ్బు మయం, లగ్జరీ జీవితాల పట్ల మోజు, ఇద్దరూ పని చేయకుంటే కుటుంబం నడవని పరిస్థితి, ప్రిస్టేజి అంటూ విచ్చలవిడిగా తిరిగే తల్లిదండ్రులు, సంతానం కన్నా బయటి పనులే ముఖ్యమనుకునే తీరు ఇవన్నీ పిల్లల పట్ల నిర్లక్ష్యాన్ని తెలుపుతూ వారిలో మనోవేదనకు, హింసాప్రవృత్తికి, కోపధోరణికి ముఖ్య కారణాలవు తున్నాయని ఈ కథలు తెలుపుతున్నాయి.

## పనిపిల్ల - తుమ్మేటి రఘోత్తమరెడ్డి :

'పనిపిల్ల' కథ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ కథ చదువుతుంటే విభిన్న భావోద్వేగాలకు లోనవుతాం. ఆ రోజు రాత్రి-తాను నిదురించిన గడీలో జరిగిన కరువుదాడిలో 'పనిపిల్ల' కళ్ళలో వెలుగును చూసిన మహేంద్ర మానసిక ఉద్వేగమే' ఈ కథకు ప్రాణం. భార్యను అర్థం చేసుకోవడంలో మహేంద్ర మానసిక స్థితిలోని లోపాలను, జ్ఞాన సముపార్జన ద్వారా జయించాలే తప్ప, మరో మార్గం లేదు. 'పనిపిల్ల' చాలా

వివాదాస్పదమైన కథ. హాలీవుడ్ మూవీ 'దిలా స్ట్ సమురాయ్'లో హీరో టామ్ క్రూజ్ మాదిరిగా 'పనిపిల్ల' కథలో మహేంద్ర నాగరికుడివలె పట్నం నుంచి వచ్చి, అనాగరిక గిరిజనుల కరువుదాడిని చూసి చలించిపోయి, మనసులో మద్దుతునివ్వడం ఈ కథలో కన్పిస్తుంది. మహేంద్ర కోణంలోంచి సాగిన ఈ కథలో అతని అంతరంగాన చెలరేగే అనేకానేక ఆలోచనలు పాఠకుణ్ణి కూడా చుట్టుముడుతాయి. అందుకే కాబోలు ఈ కథ అంతగా చర్చనీయాంశమైంది.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలకు తెలంగాణా జీవభాష ప్రాణం. "వ్యవహారిక భాషావాదులు సృష్టించిన సోకాల్డ ప్రామాణిక భాషలో తప్ప, మాండలిక భాషలో అంటే 'యాస'లో సాహిత్యం పుట్టదని నమ్మబలికి, బాషతో పెత్తనం చెలాయించిన వాళ్ళకు 'రఘోత్తమరెడ్డి కథల పుస్తకం' మంచి సమాధానం. తెలంగాణ భాష సొగసుల్ని అర్థం చేసుకొని, ఆనందించడానికయినా ఇతర ప్రాంతాల వారు, ఈ కథల్ని చదవాలి.

## భూమడు - పెద్దింటి అశోక్‌కుమార్ :

మానవత్వం ఉట్టిపడేలా చిత్రించినారు రచయిత ఈ కథలో. అమాయకుడు భూమడు. వాని తల్లి పిచ్చిది. భూమన్ని చేరదీసి రాములు, ఎంకటి తమ హోటల్లో పెట్టుకున్నారు. వాన్ని ఇంట్లో మనిషిగానే ప్రేమతో చూసేవారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు అధికారులు పకడ్బందీగా అమలుకై సర్పంచ్‌లను ఆదేశించారు. భూమన్ని తీసుకపోయి స్కూల్లో వేఆస్తరు. వాడు తప్పించుకొని రెండు రోజులకే గ్రామం చేరు కుంటాడు. ఇక వానికి ఇల్లు లేదు, వాకిలి లేదు. బీడిలు తాగడం అలవాటు అవుతుంది. ఎవరు బీడి ఇచ్చి ఏ పని చేయమన్నా చేస్తుంటాడు, వానితోటి పని తీసుకునే వారే గాని వాని ఆరోగ్యం గూర్చి పట్టించుకున్న వారు లేరు. రాములు మనసు చివుక్కుమన్నది. వానికి జ్వరమచ్చింది. ఇంటికి రారా ! గోళీ మందు ఇస్తా రారా! అంటే రాలేదు. రాములు మనసు బాధపడ్డది. భూమని కొరకు వెదకడం ప్రారంభించాడు. వాడు ఎక్కడ కన్పించలేదు. ఊరంతా తిరిగాడు, వాడు దొరకలేదు. భార్య ఎంకటితో అబద్ధమాడి వాని గూర్చి ఊరంతా తిరిగినా ప్రయోజనం లేకపోయింది.

చివరికి హోటల్‌కు వచ్చిండు. ఎంకటి కోపగించు కుంది. మన వాగులో ఎవరో సచ్చిపోయిండ్రట పోలీసులు వచ్చిండ్రని ఛాయ తీసుకురమ్మన్నారని చెపుతుంది. ఛాయతీసుక పొమ్మంటుంది. భూమనికేం కాలేదు కదా! అనుకున్నడు రాముడు మానసులో. ఛాయ తీసుకొని సైకిలుకి కట్టి ఎక్కిండు అక్కడ దృశ్యం చూసి ఆశ్చర్య పోయాడు. భూమడు శవాన్ని తీస్తున్నడు. పోలీసులు బీడి ఇస్తం తియ్యరా అంటున్నారు. శవాన్ని తీసి ఏర్పాటు చేసి... అవ్వా అన్నడు గాని ఏడువలేదు. పోలీసులు శవంతో పాటు వెళ్ళిపోయినారు. "భూమడు, రాములు అక్కడ మిగిలినారు. భూమనితో రాములు నీదెంత పాపపు పుట్టుకరా? అవ్వను గుర్తుపడితివి కనీసం ఏడ్వకపోతివి అన్నాడు. భూమన్ని తీసుకొని ఇంటికి వచ్చిండు 'ఇక్కడ బాలకార్మికులు లేరనే' అట్టను తీసి కాల్చేసిండు. ఇక ఎవడైనా రానియ్యి... ఆరు నెలలు వాని ఎవ్వరు పట్టించు కున్నరు. అని కథను రచయిత ముగిస్తాడు. ఈ కథ ద్వారా చట్టాలు కాదు మానవత్వం ముఖ్యమని చెపుతాడు. పెద్దింటి అశోక్ కుమార్ తన కథల్లో తెలంగాణలోని సామాజిక, ఆర్థిక నేపథ్యాలను ఎంతో చక్కగా వివరిం చారు. ఈ ప్రాంతంలో నెలకొన్న అనేక సమస్యలను ఆయన చిత్రించిన తీరు 'వాస్తవం'గా ఉన్నది. ఈ కథనంలో ఆయన తన చుట్టూ తిరగాడే సమస్యలు, తను తిరిగిన గ్రామాల్లోని విషయాలను, ఏర్చి కూర్చారు.

**ఆధార గ్రంథాలు :**

1. బాల కార్మికుల కథలు - సామాజికత ప్రజాశక్తి బుక్ హౌస్ హైదరాబాదు.
2. తెలంగాణ తెలుగు కథ, డా.పంతంగి వెంకటేశ్వర్లు (సంపాదకులు)- 2011 వరంగల్.
3. తెలుగుకథ - ప్రాంతీయ అస్తిత్వం వెల్దండి శ్రీధర్ (సం) 2015 కర్నూలు.
4. తెలుగులో స్త్రీవాద కథలు విశాలాంధ్ర బుక్ హౌస్ హైదరాబాదు- 2013.

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 02, February 2024

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# పోతన భాగవత కథల్లో సమసమాజ నిర్మాణం - భక్తితత్వం

- అంబటి సరిత, పరిశోధక విద్యార్థి.

సమాజంలో సంస్కృతి కూడా ఒక భాగమే. సంస్కృతి మానవుని జీవన సరళని నిర్దేశిస్తుంది. తన బతుకును శోభాయమానం చేసేది సంస్కృతి. ఈ సంస్కృతిలో ఆచార వ్యవహారాలు నియమ నిబంధనలు అన్నీ ఉంటాయి. వీటికి భాష సాహిత్యాలు అంతరభాగంగా ఉంటాయి. ఇవన్నీ ఆదర్శమైన సమాజం కోసం పని చేస్తుంటాయి. సాహిత్యం ప్రజలను చైతన్యవంతులుగా చేయడానికి మానవీయులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తుంది. కవులు సమాజహితం కోసం, సమాజ శ్రేయస్సు కోరి రచనలు చేస్తుంటారు. ఆ కోవలోనివాడే పోతన. పోతన భాగవత రచన భవిష్యత్ తరాలను ఉద్ధరించడానికే చేసినట్టుగా ఉంటుంది. పోతనకు ఉన్న మానవీయ దృక్పథం, సంస్కారవంతమైన సమాజకాంక్ష, మానవుడే మకుటదారి, మహాతపస్వి అనే ఆకాంక్ష ఆయన భాగవత రచనలో ప్రతిచోట కనిపిస్తుంది. మంచి సమాజం, భక్తి సమాజం కోసం పరితపించిన రచన చేసి భవిష్యత్తరాలకు అందించాలనే ప్రయత్నం చేసిన వారిలో పోతన అనిర్వచనీయుడు.

ఈ విధంగా పోతన భాగవత కథల ద్వారా సంసార రూపంలో మ్రగ్గె సామాన్య ప్రజలను ఆధ్మాత్మికత వైపుకి నడిపించె దిశలో భాగవతాన్ని తెనిగించి తాను పుట్టి నందుకు పుట్టిన సమాజానికి ఉత్తమ సేవా ఫలంగా భాగవత కథలను అందించి ధన్యుడయ్యాడు. భాగవత కథలు - విశ్వంలోని ప్రతి వ్యక్తి చదవదగినవి. వాటిని చదవడం ద్వారా బుద్ధి వికాసం చెందుతుంది. మేధాశక్తి పరిపూర్ణమై పరమేశ్వరుని ప్రాప్తికి పరమ పదసోపానానికి అనుకూలమౌతుంది.

**ధృవుడు :**

స్వాయంభువ మనువు కుమారులు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు, ఉత్తానపాదునికి సునీతి, సురుచి యిద్దరు భార్యలు, గుణవతి, వినయశీలి అయిన సునీతికి ధృవుడు. సురుచికి ఉత్తముడు కుమారులు. ఉత్తానపాదునికి సురుచి యందు అనురాగం అధికం. అందువల్ల ఎప్పుడూ ఆమె దగ్గరే వుండేవాడు. ఆ కారణంగా ఉత్తమునికి రాజు దగ్గర ఎక్కువ చనువుండేది. ఒకనాడు ఉత్తముడు తండ్రి తొడ మీద కూర్చొని ఆడుకుంటుండగా ధృవుడు వచ్చాడు. తండ్రి తొడ మీద కూర్చోవాలనే కాంక్షతో దగ్గరగా రాగా చూచిన సురుచి

వెర్రి నాయనా! ఆ అదృష్టం నీకు లేదు. నా కడుపున పుట్టి వుంటే ఆ భాగ్యం నీకూ లభించేది. ఇప్పుడైనా నువ్వు తపస్సు చేసి లక్ష్మీవల్లభుని అనుగ్రహంతో నా బిడ్డగా పుట్టే వరం సంపాదించు. అప్పుడు నిన్ను కూడా రాజుగారి తొడ మీద కూర్చోబెట్టి ఆడిస్తాను అంది. ధృవుని మనస్సు ఆవేదనతో కన్నుల నీరు నిండింది. ఏడుస్తూ తల్లి దగ్గరకు వెళ్ళి కథ అంతా చెప్పాడు. కన్నతల్లి బిడ్డ కన్నీరు తుడిచి: నాయనా! మీ పిన్ని నిజమే చెప్పింది. పట్ట మహిషిని కావలసిన నేను దాసీగా బ్రతుకుతున్నాను. ఏ జన్మలోనో చేసిన కర్మఫం యిది. నా కడుపున పుట్టడం వల్ల నిన్నూ బాధిస్తున్నది. నారాయణుని అనుగ్రహం వల్ల అన్నీ సమకూరుతాయి. మీ తాతగారు స్వాయంభువులు నారాయణుని అనుగ్రహం వల్లనే యెన్నో యాగాలు చేసి ఇహపరాలలో సుఖశాంతులు పొందగలిగారు. నువ్వు కూడా శ్రీహరి అనుగ్రహం పొందు, అని ఆశీర్వదించి పంపింది. ధృవుడు రాజధానీ నగరం విడిచి, పల్లెలు దాటి, అడవులకు పోయి తపస్సు ప్రారంభించాలనే నిశ్చయంతో వెడుతున్నాడు. దారిలో నారద మునీంద్రుడు కనిపించి, వాని కథ విని సంకల్పము తెలుసుకుని, చిరునవ్వుతో శిరస్సు నిమిరి :

నాయనా ! యమునా నదీ తీరాన మధు వనం వున్నది. అక్కడ వాతావరణం ప్రశాంతంగా, తపోదీక్షకు యోగ్యంగా వుంటుంది. ధర్మాసనం మీద కూర్చుని,

ఇంద్రియాలను స్వాధీనం చేసుకుని ప్రాణాయామంతో నారాయణ మంత్రం జపించు. ఆయన ప్రసన్నుడవుతాడు అని నారాయణ మంత్రం ఉపదేశించి వెళ్లాడు.

**పురంజనోపాఖ్యానం :**

పరీక్షిన్మహారాజా! చాలాకాలం క్రితం పురంజనుడనే రాజుండేవాడు. ఆయన తనకు యోగ్యమైన నగరం కోసం అన్వేషించి, అన్వేషించి చివరకు తన మనస్సుకు నచ్చిన నగరం చూచాడు. నగరం వెలుపల చక్కని ఉద్యాన వనంలో ఆగాడు. అక్కడికొక లావణ్యలహరి వచ్చింది. ఆ సుందరీ మణిని చూడగానే ఆయన మనసు ఆమె మీద లగ్నం అయింది. దగ్గరగా వెళ్లి - బాలామణీ! ఏ వంశంలో ప్రభవించావు. ఏ గోత్రం నీ జన్మతో పావన మైంది అని అడిగాడు. ఆమె నవ్వి : మహారాజా! ఎవరి దాననో, పేరేమిటో, అన్నీ మరిచిపోయాను. నీ సౌందర్యం, సాహస పరాక్రమ సంపత్తి చూశాక నా మనస్సు స్వాధీనంలో వుండడం లేదు. నవ ద్వారాలతో, నవనవ లాడే లావణ్యంతో అలరారే ఈ శరీరాన్ని నీకు అర్పిస్తు న్నాను, అనగానే పురంజనుడు సంతోషంతో ఆమెను దగ్గరగా తీసుకుని భవనాంతర్భాంగంలోని అంతఃపురంలో సకల భోగాలూ ఆమెకు అందించి అనుభిస్తున్నాడు. నిర్విరామ శృంగారయాత్రంలో బిడ్డలను కని వారికి వివాహాలు జరిపించాడు. క్రమంగా వార్ధక్యం ప్రవేశించి, శరీరంలో అవయవాల సత్తువ సడలింది. వాంఛ చావలేదు. కాలపాశ బంధితుడవుతూ కూడా నేను లేకపోతే ఈ లావణ్యలహరి యేమైపోతుందా, అను కుంటూ ఆమె మీదనే మనసు నిలిపి ప్రాణాలు వదిలాడు.

ఆ కారణంగా విదర్భరాజుకు కూతురుగా పుట్టాడు. పాండ్య దేశాధిపతి మలయధ్వజుడు ఆమెను వివాహ మాడి రాజ్యపాలనం సాగిస్తూ, సంసారిక జీవితం ధర్మ బద్ధంగా నడిపి వయసు మళ్ళగానే రాజభోగాలు విడిచి వానప్రస్త దీక్షతో అడవికి వెళ్ళి శ్రీమన్నారాయణుని చరణ కమలాల మీద మనసు నిలిపి పరమ పదం చేరాడు. వియోగ బాధ భరించలేక చితిలో ప్రాణాలు విడవడానికి సంకల్పించే వేళ బ్రాహ్మణుడొకడు అడ్డుపడి - ఏమిటి చేస్తున్నావు. నేనెవరినో మరచినట్లున్నావు. మానస సరోవరంలో విహరించే హంస దంపతులం మనం. విధి వశాన మీరు మానవ జన్మ మీద కోరిక గలిగి, భూలోకంలో రాజుగా పుట్టావు. అక్కడ ఒక కామినీ మణి కల్పించిన పంచరామ మధ్యంలో నవద్వారయుత నగరంలో ప్రవేశిం చావు. పంచరామాలంటే ఇంద్రియ పంకచం, నవద్వారాలే శరీరానికున్న నవరంధ్రాలు. అప్పుడు నీ పేరు పురం జనుడు. నాడు ఆ మగదేహం, నేడు ఈ స్త్రీ రూపం ఇదంతా నీ భ్రమ. వాస్తవానికి మనం హంసలం, అనగానే ఆమె హంసగ మారి మానస సరోవరానికి వెళ్ళింది. కామం ఎంత వంచిస్తుందో చూశావా మహారాజా! అని శకుడు సాగుతున్నాడు.

**గజేంద్ర మోక్షకథ :**

మొటి మనువు స్వాయంభువుడు, రెండవ మనువు స్వరోచిషుడు, మూడవ మనువు ఉత్తముడు, నాల్గవ మనువు తామనుడు, అయిదవ మనువు రైవతుడు, ఆరవ మనువు చాక్షుషుడు.

తామసుడు అనగా నాల్గవ మనువు కాలంలో విష్ణు మూర్తి హరిణీదేవి కడుపున పుట్టాడు. అదంతా పాల సముద్రంలోని ఒక దీవి. ఆ దీవిలో పర్వతాలున్నాయి. దానిని ఆశ్రయించుకొని చెట్లు, తీగలు, దట్టంగా పెరిగి నాయి. చిక్కగా పెరిగిన అడవి కావటం వలన అక్కడ ఎన్నో జంతువులు నివాసముంటున్నాయి. వరుణదేవునికి ఒక ఉద్యానవనం వుంది. దానిలో అందమైన పూల మొక్కలు, ఫలవృక్షాలు అసంఖ్యాకంగా వున్నాయి. ఆ ఉద్యానవనంలోనే ఒక ఏనుగుల సమూహం ఉంది. దానికి ఒక రాజు ఉన్నాడు. అతడు చాలా బలవంతుడు, పేరు గజేంద్రుడు. అతని నాయకత్వము తిరుగులేనిది. ఆరు లక్షల ఆడ ఏనుగులు అతనికి భార్యలుగా వుంటున్నాయి.

ఒకనాడు అది తన స్త్రీ పరివారంతో అంటే ఆరు లక్షల ఆడ ఏనుగులతో కలిసి ఒక చెరువులో జలకాలాడటం

మొదలెట్టింది. నీటిని పీల్చటం జలయంత్రంలోంచి చిమ్మినట్లు తన ప్రియురాళ్ళ మీది నీటి తుంపరలు వెదజల్లడం చేస్తోంది. తామర తూడులు ఆ చెరువులో ఎన్నెన్నీ వున్నాయో, వాటినన్నింటిని పెకలించి పోగులు పెట్టేశాయి. విధి బలమైనది కదా! ఆ వైభవం, ఆ సయ్యాటలు హఠాత్తుగా ఆగాయి. గజరాజు కాలును బలంగా పట్టుకొన్నట్లు అనిపించింది. మహాబలశాలి అయిన తన జోలికి రాగల గుండె దిటువు ఎవరి కుంటుంది?! అనుమానంగా కాలు కదిలించాలని ప్రయత్నించింది. అప్పుడు అర్థమైంది గజరాజుకి, తన కాలును మొసలి పట్టుకొందని! కాలును బలవంతంగా బయటకు లాగాలని ప్రయత్నించంది. పెనుగులాడింది. శక్తి వున్నంత వరకు పోరాడింది. కాని ప్రయోజనం కన్పించలేదు. మొసలి రవంత అయినా పట్టు సడలించలేదు. క్రమంగా ఏనుగు బలం తగ్గిపోతోంది.

అది నీటి పట్టు కాబట్టి మొసలి బలం పెరిగింది. తన మగని అవస్తను చూచి, జాలిపడినాయి. కాని గజరాజుకే అలివికాని ఆ మొసలి పట్టు అడేనుగులు ఎలా విడిపించగలవు? దిక్కుతోచక గజరాజు భార్యలు గట్టెక్కి వెళ్ళిపోయాయి. ఎంతకాలం పెనుగులాడినా ఆ గజం మకర పట్టు నుంచి బయట పడలేదు. క్రమంగా దానిబలం తగ్గిపోయింది. శరీరం సన్నగిల్లింది. అంత బలవంతుడు అయిన గజరాజు నిర్వీర్యమైపోయాడు. తనకిక శక్తి చాలదని విముక్తి లేదని అర్థమైన తర్వాత గజరాజుకు దిక్కుతోచలేదు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు తొండం పైకెత్తి, కనులు ఆకాశంలో గ్రుచ్చి, దైవాన్ని తోడు పిలిచి ప్రార్థించాడు. 'ఓయి! దేవదేవ! నేను ఎంత బలశాలిని! నా బలం నన్ను కాపాడుతుందని ఎంతో కాలంగా నమ్ముతున్నాను. ఆ నమ్మకం యిప్పుడు వృధా అయింది. నా బలగం నన్ను రక్షిస్తారని ఆశపెట్టుకున్నాను. యింతకాలం నాతో కలిసి జీవించిన ఆరు లక్షల అర్ధాంగులు తోకముడిచి గట్టెక్కి పారిపోయాయి.

కనుక యిక యిప్పుడు నాకు ఎవరు దిక్కులేరు. నేను పూర్తిగా నిన్నే నమ్ముకున్నాను. నన్ను కాపాడినా, కష్టాల పాలు చేసినా నీదే భారం. నీవే నా రక్షకుడవు! నీవు తప్ప మరే దిక్కు లేదు నాకు. అందువలన పూర్తి అహంకారాన్ని విడిచి పాదాక్రాంతుడనవుతున్నాను. నన్ను రక్షించు అని భగవంతుని శరణుకోరాడు. దయామూర్తి అయిన భగవంతుడు అతడి మొర ఆలకించాడు. శ్రీ మహావిష్ణువు వైకుంఠ నగరంలో తన కోటలో ఒక మారుమూల సౌధంలో ఆదమరిచి వున్నాడు. గజేంద్రుని 'శరణాపత్తి' వినగానే ఆయన హృదయం ద్రవించి వున్న పాటున లేచి వచ్చి చక్రాయుధాన్ని ప్రయోగించాడు. అది కాంతులు చిమ్ముకుంటూ వచ్చి మొసలితలను నరికి వేసింది. భగవంతుని శరణుకోరిన గజేంద్రుని కాలు బయట పడింది. గజేంద్ర మోక్షం జరిగింది! వెంటనే ఏనుగు రాజు ఒడ్డుకు వచ్చి, విష్ణుమూర్తికి నమస్కరించి, ప్రార్థన చేసి, సరస్సులోని తామరపువ్వులు త్రుంచి స్వామికి అర్పించుకొన్నాడు. శ్రీ మహావిష్ణువు మొసలికి కూడా మోక్షం ప్రసాదించాడు.

**వామనావతారం :**

వైవస్వత మనువు ఏడవ వాడు. వివస్వంతుడు అనే మహర్షికి కుమారుడు వామనావతారం ఈ మనువు కాలంలోనే జరిగింది. ఒకసారి బలి చక్రవర్తి ప్రపంచాన్ని జయించిన దానికి గుర్తుగా అశ్వమేధయాగం చేస్తున్నాడు. ఎందరికో దాన ధర్మాలు చేస్తున్నాడు. అడిగినవారికి యిచ్చి పంపటమే కాని, కాదు, లేదు అనే మాటలు నోటి వెంట రావు. అందుకే వామనుడు సంకోసించుండా నేరుగా యాగశాలకు వచ్చాడు. అతని ముఖంలో దివ్యకాంతులు వున్నాయి. బలి ఎదురు వచ్చి, బాలకుడికి యజ్ఞవేదిక దగ్గరకు తీసుకువెళ్ళాడు. దానధర్మాలు చేయటం అలవాటు కాబట్టి నీకేమి కావాలి?! అని అడిగాడు. 'నాకు కేవలం మూడు అడుగుల స్థలం చాలు! దానం యివ్వగలవా?! అని ప్రశ్నించాడు వామనుడు.

'యింత చిన్న కోరిక ఏమిటి'? అన్నాడు బలి!

'అది యిస్తే చాలు'! అన్నాడు వటుడు.

'యిచ్చిన మాటను తప్పను! బలివాగ్దానం చేశాడు!

వామన మూర్తికి మూడు అడుగుల నేల దానం చేస్తున్నట్లు ప్రకటించేశాడు!

**వామన చరిత్ర :**

వామనుడు దానం పట్టాడు! తనకు కావలసిన, తీసుకో దలచిన మూడు అడుగుల నేల ఎక్కడుందో చూపమని అడిగాడు. నీ యిష్టం వచ్చిన చోటు ఆక్రమించు కోమన్నాడు బలి! యీ దానం వెనుక జరగబోయే అనర్థాన్ని ముందుగా తెలుసుకొన్న ఆచార్య శుక్రదేవుడు అడ్డుకోవాలని ప్రయత్నించాడు. బలి చక్రవర్తి వినకపోగా వటుడికి దానస్థలాన్ని చూపించేందుకు సిద్ధపడ్డాడు. యింతవాడు అంతై, అంతైంతై భూలోకమంతా నిండిపోయి ఆకాశ మంతా ఎదిగిపోయి మూడవ అడుగుపెట్టే చోటే లేకుండా భూమి ఆకాశాలను రెండు అడుగులు నింపేశాడు. 'మూడవ పాదం ఎక్కడ పెట్టను?! అని ప్రశ్నించాడు. 'నా శిరస్సు మీద వుంచు' అన్నాడు బలి. ఫలితంగానే బలి చక్రవర్తి పాతాళలోకంలోకి అణచివేయబడ్డాడు. రసాతలం అతని నిలయం అయ్యింది. బలి చక్రవర్తి నుంచి దానంగా పుచ్చుకున్న మూడు లోకాలను దేవతలకు అప్పగించాడు విష్ణుమూర్తి.

**అంబరీషుడు :**

విష్ణుభక్తులు ఎందరో ఉన్నారు. వారిలో అంబరీషుడు చాలా గొప్పవాడు. అయన చక్రవర్తి ప్రపంచాన్ని చక్కగా పాలించాడు. శ్రీ విష్ణువుకు ఎల్లవేళలా పూజించాడు. ఆయన భక్తికి మెచ్చి విష్ణువు తన సుదర్శన చక్రాన్ని ఆయనకు ఇచ్చాడు. సుదర్శన చక్రం శక్తివంతమైనది ఎంతో పవిత్రమైనది. అంబరీషునికి, ఆయన రాజ్యానికి అది రక్షణగా నిలిచింది. కార్తీకమాసంలో ఏకాదశినాడు అంబరీషుడు ఒక వ్రతం చేశాడు. కోపానికి మారు పేరు అయిన దుర్వాసుడు ఆ సమయంలో అక్కడకు వచ్చాడు. ఏకాదశి వ్రతం పూర్తి అయిన మరునాడు ఆతిథ్యం ఇచ్చేందుకు అంబరీషుడు సిద్ధపడ్డాడు. దుర్వాస మహాముని సంధ్యా వందనం చేసుకోవటానికి నదికి వెళ్ళాడు. చాలా కాలం గడిచిపోయింది. కాని అతడు తిరిగి రాలేదు. అతిథి రాకుండా ఆతిథ్యం ఇచ్చేవారు భోజనం చేయకూడదు. ద్వాదశి ఘడియలు వెళ్ళిపోకుండా ఆహారం తీసుకోవాలని నియమం ఉంది. ఈ రెండు పరిస్థితుల మధ్య అంబరీషుడు యిరుకున పడ్డాడు. పురోహితులను పిలిచి సలహా అడిగాడు. వారు ఈ విధంగా చెప్పారు.

'రాజా, ద్వాదశి వెళ్ళిపోకుండా భోజనం చేయాలి ఏకాదశి చేసిన వారికి ఇది ఒక నియమం. అలాగని అతిథులు రాకుండా ఆహారం తీసుకోకూడదు. నీరు త్రాగి సరిపెట్టుకో'. ధర్మవేత్తల మాటలు విని అంబరీషుడు కొద్దిగా నీరు పుచ్చుకొన్నాడు. ఆ కార్యక్రమం పూర్తి అయిన తరువాత దుర్వాస మహాముని నదీతీరం నుంచి తిరిగి వచ్చాడు. వాస్తవవం తెలిసికోకుండానే అతని మీద కోప గించాడు. మహాముని కోపంలోంచి ఒక శక్తి పుట్టింది. దాని పేరు కృత్య. పెద్దగా అరిచింది. అంబరీషుని చంపాలని వెంటబడింది. కాని అంబరీషునికి రక్షణగా వున్న సుదర్శన చక్రం అడ్డుపడింది. కృత్యను కాల్చిబూడిద చేయగల మంటలను సృష్టించింది. ఆ శక్తి వాటిలో పడ చనిపోయింది. అంతటితో ఆగకుండా చక్రం దుర్వాసుడి వెంటపడింది. తనని చంపాలని వస్తున్న సుదర్వన చక్రాన్ని చూచి దుర్వాసుడు భయపడి పారిపోవడం ప్రారంభించాడు. పారిపోయే వారిని అది విడిచిపెట్టడు. వెంట పడింది. ఋషి మేరు పర్వతం దాకా పరుగెత్తి ఒక గుహలో దాక్కున్నాడు. అక్కడ కూడా చక్రం ప్రవేశించింది. మళ్ళీ వచ్చి సముద్రంలో మునిగితే అక్కడ వెంటపడింది. ఆ విధంగా వెన్నంటి సుదర్శన చక్రం నుంచి మునిని బ్రహ్మ లోకంలోని వారు కాని కైలాసంలోని వారు కూడా రక్షించ లేమని చెప్పేశారు. యిక బ్రతికే దారి లేక ముని భయంతో వైకుంఠానికి పరిగెత్తి, విష్ణుమూర్తిని శరణు జొచ్చాడు. ఒకసారి విడిచి పెట్టిన తరువాత దానిని తాను కూడా ఆపలేనని శ్రీ మహావిష్ణువు చెప్పాడు. యిక ఎక్కడా దారి కనిపించని ముని అంబరీషుని దగ్గరకు వచ్చి శరణు కోరాడు. ప్రాణాలు కాపాడమని బ్రతిమాలుకొన్నాడు.

ఎంతో మంచివాడైన అంబరీషుడు అభయం ఇచ్చాడు. సుదర్శన చక్రాన్ని చల్లబడవలసిందిగా కోరాడు. సుదర్శనం అతని కోరిక మన్నించి వైకుంఠానికి వెళ్ళి పోయింది. దుర్వాసుడు తన తొందరపాటును, రాజు మంచితనాన్ని గుర్తించాడు. తిరిగి తపస్సుకు వెళ్ళి పోయాడు. విష్ణుభక్తితో అంబరీషునితో సాటి వచ్చే రాజులు లేరు. చెడ్డవారు కూడా కాలం కలసివస్తే శక్తివంతులు అవుతారు. కాని వారి దుర్మార్గాలు మితిమీరినప్పుడు భగవంతుడు భూమిపై పుడతాడు. దానినే అవతారం అంటారు. కంసుడు మొదలైన వారు పాపాలు ఎదురు లేకుండా చేసుకుపోతున్న సమయంలో విష్ణుమూర్తి కృష్ణుడుగా అవతరించాడు. ఆయన పవళించే పాన్పు అయిన ఆదిశేషుడే బలరాముడుగా పుట్టాడు.

అతనికి ప్రాణభయం పట్టుకొంది. వెంటనే చెల్లి అనే జాలి చూపకుండా దేవకీ దేవిని చంపేందుకు కత్తి ఎత్తేడు. వసుదేవుడు బావమరిది కాళ్ళు పట్టుకున్నాడు. 'బావ మరిదీ! అధికారాలు అన్నీ, నీ చేతిలో వున్నాయి. క్రొత్తగా పెళ్ళి చేసికొని భర్తతో కాపురం చేయాలని కలలు కంటున్న ఒక ఆడపిల్లను చంపటం మంచి పని కాదు. మాకు కలిగే సంతానం ఒక్కొక్కరుగా వెంటనే నీకు అందిస్తాము. వారిని పుట్టగానే చంపితే నీకు, ప్రాణభయం వుండదు కదా! ఇప్పుడు ఈ హత్య చేయవద్దు' అని బ్రతిమాలు కొన్నాడు. ఈ మాటలతో కంసునికి కాస్త మనశ్శాంతి కలిగింది. తన అంతటి పరాక్రమవంతుడు. ఒక ఆడ పిల్లను అప్పుడే పెళ్ళి అయిన దానిని, ఇలా బాధిస్తున్నాను కదా అనుకుని అక్కడనుంచి వెళ్ళి పోయాడు. ఇతను తన స్వంత తండ్రి అయిన ఉగ్ర సేనుడు మంచి మాటలు చెప్పాడని అతనిని కూడా చెరసాలలో పెట్టాడు.

**ఆధార గ్రంథాలు :**

1. పోతన భాగవతం, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి, 1992.
2. భాగవత రహస్య దీపిక, ఎక్కిరాజు కృష్ణమాచార్య మాష్టార్, ఇ.కె. ప్రచురణలు, గుంటూరు.
3. ఆచార్య జి. నాగయ్య, తెలుగు సాహిత్య సమీక్ష, నవ్యాంధ్ర ప్రచురణ, తిరుపతి.

❖❖❖

# Konda Chiluva : Python

- Translated in Telugu by ***Vaddera Rani***

- Translated by ***Dr. M. Koteswar Rao***, Associate Professor, Dept of English, Krishna University, Machilipatnam.

**Translator's Note :**

Translation from source languages and regional languages (L1) into target language or English serves as a powerful tool, transcending borders and fostering connections among diverse regional literatures. This practice not only establishes a bridge between regional languages and the target language but also creates a platform for marginalized communities. It becomes a catalyst for the voices of the oppressed, suppressed, and exploited groups, providing them with a means to express their narratives. The English language, through translation, becomes a unifying force for various regional cultures and their languages. Dr. Babasaheb Ambedkar, the visionary architect of modern India, articulated a poignant perspective on the country, dividing it into two entities: touchable India and untouchable India. According to Ambedkar, this dichotomy extends beyond mere geographical boundaries to encompass two distinct cultures—the exploited/oppressed and the exploiter's/oppressor's culture. Babasaheb's delineation of countries aligns with the existence of two contrasting cultures within India, creating a substantial gap between the oppressed and the oppressor. Translation emerges as a potent force capable of bridging this gulf. The translation of Dalit/exploited literary works from source languages into the target language serves as a unifying factor, bringing together all oppressed groups in India.

This transformative role of translation becomes even more pronounced in the context of Dalit literature a movement that fights for Liberty, Equality, and Fraternity. Ambedkar's ideals deeply influence the writers of Dalit literature, and their works reflect a commitment to social justice. Translation, in this context, acts as a medium to amplify the voice of Dalit literature, empowering its movement and contributing to the broader discourse on human rights. The translation of Dalit literature into English assumes a pivotal role in fostering solidarity among oppressed groups. It serves as a rallying point, inspiring collective action against injustice, inequality, and social evils. The writers of Dalit literature, driven by the principles of Babasaheb Ambedkar, find resonance in their works and translations. In doing so, they contribute meaningfully to society, using their writings as a tool for social change. The influence of Ambedkar's ideas is evident in the dedication of Dalit literary writers and translators who, inspired by his vision, actively engage in creating a more equitable and just society. Their commitment is reflected in their writings and translations, which serve as a form of societal repayment. Through their work, they strive to dismantle the barriers that perpetuate inequality and amplify the voices of those who have been historically marginalized. In essence, translation emerges as a transformative force that not only transcends linguistic and cultural boundaries but also becomes a powerful instrument for social change. As it facilitates the dissemination of Dalit literature and ideals into the broader consciousness, translation of Dalit lit-

erature in general and Dalit women's literature in particular play a crucial role in building bridges, fostering understanding, and promoting a collective movement towards a more inclusive and just society.

**Konda Chiluva: Python :**

The selection of the poem *Konda Chiluva (Python)* by Varre Rani holds a specific purpose. Firstly, the translator is moved and motivated by the life of Varre Rani and secondly, to shed light on Dalit women's literature in the Telugu language. This deliberate choice centers on a poem written by Varre Rani, featured in the anthology *Nallapoddu: Dalit Women's Literature -1921-2002*. This anthology, curated and published by the well-regarded Hyderabad Book Trust in the Telugu states, stands as a testament to the significance of the literary contribution of Dalit women. Varre Rani, a notable writer, has compiled a collection of short stories and poems that vividly portray the challenges faced by Dalit women. Rani's literary works, including the chosen poem *Konda Chiluva (Python)*, are noteworthy for their exploration of the intricate problems encountered by Dalit women. Her writings extend beyond mere representation, delving into the realm of feminism as Humanism. The poem, in particular, unfolds a narrative around themes of love, marriage, and the betrayal experienced by Dalit women at the hands of caste Hindu men. The act of translating the poem *Konda Chiluva (Python)* is deemed invaluable, marking an important endeavor in bridging the gap between regional and national readership. The poem, encapsulating the essence of Dalit women's experiences, becomes a vehicle for cultural exchange and understanding. Through this modest attempt at translation, there is a sincere effort to elevate Dalit women's literature, especially in the realm of poetry, to a broader audience on a national scale.

By bringing Varre Rani's poignant poem to a wider readership through translation, the goal is to amplify the voices and narratives of Dalit women. The hope is that this endeavor contributes to a more extensive dialogue on the challenges faced by Dalit women, fostering empathy and awareness on a national level. The act of translation, in this context, becomes a powerful tool for advocacy, allowing the rich tapestry of Dalit women's literature to transcend regional boundaries and resonate with a diverse and widespread audience. In essence, the translation of *Konda Chiluva (Python)* represents not only a linguistic conversion but also a cultural and social exchange. It is an effort to break barriers and create a shared understanding of the unique struggles and experiences of Dalit women. Through this modest initiative, the aspiration is to make a meaningful contribution to the broader landscape of Indian literature by ensuring that the voices of Dalit women are heard and appreciated on a national platform.

**Konda Chiluva : Python :**

Our Python talks
Often
Our Python quarrels and fights too
When I excel in a slave's role.

Our Python
Journalistically Takes me very near to it
Like a master.
Wherever and whenever
If I have done a small deficit,
It devours me

Like a penal code.

Our Python
Put on pants.
Our Python
Talks in English.
Our Python
Does Literary discussions too.

But,
Our Python Chews and
Swallows me
by wrapping around
With the witness of four walls.

Now I am
Eagerly finding
for the advertisements, that appeared on the
news papes, to do courses on
Peeling the Snake's Skin.

**About the Author :**

Varre Rani was born to Sitamma and Venkataramayya in the year 23rd September, 1973 in Machilipatnam (Village), Machilipatnam (Mandal), Krishna District, Andhra Pradesh, India. She did M.A., Sanskrit and M. Phil., in Mysore. She worked in private college in Vijayawada as a lecturer to teach Sanskrit. She published a poem *Sree* (Woman) in1996 in Andhrabhumi news paper. She was awarded Nandini for her poem *Jolaali.* She received awards such as: X-ray, Sahithi Mithrula, Kendra Sahithi Samaakya, Kandurthi Ranjani, and Sree Sree. She was influenced by the Feminism and the Dalitism. She gave an interview to Vaartha news paper in the year 1999 on the topic Feminism with which she got place in the mainstream news papers.

She lost her parents in the floods of severe cyclone storm in the year 1973 in coastal Andhra. She was found in the ruins after cyclone and taken in by a compassionate Naidu caste couple named Alivelu Mangathayaru and Subbarao. The couple chose to adopt her as their own daughter. Mangathayaru devotedly raised Rani without revealing the painful truth of her orphaned past. However, Rani's life took another sorrowful turn with the untimely demise of her loving mother, Mangathayaru. Bereft of her sole caregiver, Rani encountered challenges, particularly within her remaining family. The support and affection she once received diminished, leaving her to navigate life as an orphaned Dalit woman. Though she was brought up in a caste Hindu family, Rani found herself leading a life marked by the struggles associated with her Dalit identity and the hardships that accompanied her status as an orphan after her mother's sad demise. The absence of familial warmth and the shift in dynamics highlighted the resilience. Rani developed in the face of adversity, shaping her journey into a poignant narrative of survival and identity.

Rani's journey intertwined with a Brahmin writer when they first met at the literary meetings in Machilipatnam. The frequent meetings at literary events and festivals cultivated a deep connection between them. Their affinity for literature blossomed into a friendship marked by frequent exchanges of letters, discussing various literary topics and issues. Over time, this friendship evolved into a profound love that culminated in their marriage in 1997 at Thirupathi. However, the idyllic beginning took a dark turn as, shortly after their union, signs of trouble emerged. Despite both being writers focusing on progressive and feminist issues, the husband, Brahmin, began to harbor suspicions,

leading to the harassment of Rani. The disparity between their literary pursuits and the turbulent reality of their relationship became apparent. Tragically, a few days after their marriage, Rani suffered a heart stroke. Despite being aware of her heart condition, her husband displayed callous indifference, neglecting to join her in the hospital. Instead, he increased the torment and frequent quarrels, belittling and insulting Rani as a woman afflicted by diseases.

In a shocking turn of events, he ran away with seventy thousand rupees without informing Rani. He left her in a state of emotional and physical distress. One fine day he visited Rani. He callously declared his intention to marry a woman from his own caste. He seriously instructed her not to write letters or call him. This heartless abandonment and the subsequent loneliness crippled Rani mentally and physically. Her husband's attitude exacerbated her already fragile health. Over a period of time, a few compassionate friends came forward to help Rani for medical treatment. However, she requested them to spend their money in bringing her writings in the form of a book rather than spending on her health. This internal conflict, fueled by considerations for her well-being and the desire to publish her works, further exacerbated Rani's psychological turmoil. Enduring the harsh realities of her husband's attitude, the overwhelming sense of isolation, and the constant reminder of her orphaned status, Rani's health deteriorated further. Her heart condition intensified, ultimately claiming her life at the end of 2021. In retrospect, one of Rani's notable and impactful writings, *Konda Chiluva (Python)*, stands as a testament to her literary legacy and the challenges she faced during her tumultuous life. Rani's story serves as a poignant narrative of love turned to torment, resilience, and the enduring power of one's artistic voice amid adversity.

**References :**

1. Ambedkar B.R. *Writings and Speeches*. Vol.1. Mumbai: Government of Maharastra, 2016.
2. Dangle, Arjun (ed), *Poisoned Bread*. New Delhi: Orient Blackswan, 2009.
3. Purushottam K., Gita Ramaswamy and Gogu Syamala (eds), *The Oxford India Anthology of Telugu Dalit Writing*. New Delhi: Oxford University Press, 2016.

❖❖❖

